ఆంధ్రసచిత్ర పత్రిక

వనితాలోకం: మీరు పొదుపరులా



16-9-'59

25 న.పై.

ANDHRA PATRIKA ILLUSTRATED WEEK



పాములవాడు

శంకర్ — మద్రాసు.



11 వ తేదీ విడుదల!
జమున
సూర్యకాంతం
నాగయ్య
గుమ్మడి
సత్యనారాయణ
రాజనాల
రమణారెడ్డి
బాలకృష్ణ
చందమామ వారి
సిపాయికూతురు
దర్శకత్వం.... చంగయ్య బి.ఎ.
ఛాయ..........కళ..........సంగీతం
ప్రసాద్...గోడ్‌గాంకర్, అచ్యుతరావు...M.S.రాజు
..........పాటలు..........రచన
సముద్రాల (జూనియర్) మల్లాదిరామకృష్ణశాస్త్రి... కొవ్వలి
కళ్యాణి (గుఱ్ఱం).. ఝాన్సీ (కుక్క)
studio SARAGAM.
పూర్ణా విడుదల
PRASADS

ఆంధ్రసచిత్ర వారపత్రిక

★

Founder
K. Nageswara Rao

స్థాపితము
1908

★

సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

★

సంపుటము 53
సంచిక 50

16-9-59

వికారి భాద్రపద శుద్ధ చతుర్దశి

★

విడిప్రతి వెల 25 న. పై.
సంవత్సర చందా 13-0-0

★

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టివీధి
మదరాసు-1.

విషయానుక్రమణిక

ముఖచిత్రం:
వల్లభరెడ్డి బ్రదర్స్ వారి
'పెద్దకోడలు' చిత్రంలో
ప్రమీల

ఉత్తరాలు

నగలూ, నాణ్యాలూ

నగలూ, నాణ్యాలూ గురించి వ్రాసింది చాలా బాగున్నది. చదువుతున్నంతసేపూ ఇంకా పూర్వోత్తర నగలు ఏమేమి వున్నయ్యో చదువుదామని ఆత్రం పుట్టించింది. చదువుతూ, ఆ నగలన్నీ పెట్టుకొంటే అప్పటివారు ఎలా వుండేవారో అని ఊహించుకున్నాను.

జి. శకుంతలాదేవి,
గుంటూరు.

ఆ వ్యాసంలో కొండలిక పదాలు చాలా వున్నాయి. అందువలన అర్థంకావడం కొంచెం కష్టమనిపించింది.

బి. ఆర్. నాథ్,
హైదరాబాదు.

ఈ వ్యాసం నిజంగా "ఆంధ్ర వారపత్రిక" పెట్టుకుంటున్న నగలలోకల్లా చాలా నాణ్యంగా వుంది.

డి. వి. ఆర్. ఎన్. రాజు,
తాడేపల్లిగూడెం.

ఈ వ్యాసం ప్రస్తుత పరిస్థితులలో, అప్రస్తుతం అని నా భావం. ఎందుకనగా పొదుపు ఉద్యమం లాంటి వాటికిది వ్యతిరేకముగా ఉన్నది. ఈ వ్యాసం మాబోటి మధ్యతరగతి సంసారులు చదువుట చాల కష్టములపాలగుట కొరకే.

కె. లింగమూర్తి - మరికల్లు.

* * *

రాజధాని కబుర్లు

ప్రవీణ్ గారి వ్యాసములు నానాటికీ దిగజారిపోతున్నవి. కేవలం ప్రభుత్వము యొక్క అవకతవకలనేగాక, ప్రభుత్వము చేసిన, చేయుచున్న బ్రహ్మాండమైన కార్యములనుగూడ ఆంధ్రప్రజానీకానికి అందివ్వవలయును.

ఎస్. నరసింహులునాయుడు
కుప్రిపాడు.


'శ్రీకృష్ణ జన్మస్థానం చెప్పిన కథలు' శీర్షిక చదివాను. ఒక మనిషి నేరస్థుడైతే కావచ్చును. అతడు ఎన్నో దొంగతనాలూ, హత్యలూ చేసి ఉండొచ్చును. పట్టుబడి జైల్లో మగ్గుతూ ఉండొచ్చును. అంతమాత్రాన వారి జీవితాలనూ, వారి నేరాలకి సంబంధించిన పూర్వాపర గాథలనూ ప్రకటించి పాఠకులను ఆకర్షించబోవడంయుచితము కాదు.—"సుప్రభాత్" ప్రవీణ్ గారు రచించుచున్న కృష్ణ జన్మస్థానం కథలు చదువుటవలన చదువరులకు ఎన్నో లాభములు కలవు. దొంగలు ప్రజలను ఏవిధముగా మోసము చేయుచున్నది తెలిసికొనుటవలన మరల ఎవ్వరుకూడ అటువంటి మోసములకు లొంగిపోరు.

ఎమ్. రామానుజం,
విజయవాడ.

రాజధానికబుర్లు చాలా బాగుంటున్నాయి. రాజకీయరంగముపై ఇష్టములేని వారికి సహితం ఈ శీర్షిక కుతూహలం పుట్టిస్తుంది.

పెదగాడ సాంబశివరావు,
రాజమండ్రి.

(55-వ పేజీ చూడండి)



రాజధాని కబుర్లు

ప్రవీణ్

'రాజధాని కబుర్లు' రాయాలని కూచున్నప్పుడు, రాయడానికి తగిన విషయాలు దొరకనప్పుడు, పాఠక మహాశయులకి ఈ విషయం వినయ పూర్వకంగా విన్నవించుకునే ఆచారం ఉంది ఇంతవరకు. కాని-'భాగ్య నగరం గొడ్డుపోయిందా విశేషాలకు?' అని నైరాశ్యం వెల్లడిస్తారేమో పాఠకులు అని భయం కలుగుతోంది ఇప్పుడు!

నిరాశకు తావులేదు; పోలేదు గొడ్డు భాగ్యనగరం విశేషాలకు. విశేషాలన్నీ చెబితే-వినేవారికి ఓపికుండాలి. అన్నీ చెబితే, వినడానికి తీరికుండాలి. చెప్ప డానికి ఉండాలి ఈ రెండూ. అవి రెండూ ఉంటే, పత్రికలో చోటుండద్దా? కనుక కొన్నే చెప్పాలి. 'ఏ కొన్ని?' అన్నది ప్రశ్న.

ఉదాహరణకి—

కటకటా! కలికాలం

ఆకాశవాణి, విజయవాడ సూచించే సమ యానికి, ఆకాశవాణి, హైదరాబాదు సూచించే సమయానికి సాధారణంగా పది పదిహేను సెకనులు తేడా ఉంటుంది. అప్పు డప్పుడు అంతకంటె ఎక్కువ తేడా ఉంటుంది అంటారు కొందరు.

ఏ రెండు గడియారాలూ ఎప్పుడూ అంగీ కరించవు. ఏకాభిప్రాయానికి వస్తే ఏదో రోగం ఉందన్నమాటే అంటారు డాక్టర్లు. ఆకాశవాణి హైదరాబాదు సూచించే సమ యానికి, ఆకాశవాణి భవనానికి ఎదురుగా ఉన్న శాసనసభ భవనంలోని గడియారా లకి ఎప్పుడూ పది నిముషాల భేదాభిప్రాయం!

ఆకాశవాణి గడియారాలు 1-31 సూచించి నప్పుడు, ప్రక్కనేఉన్న ఫతేమైదాన్ గేటుమీదఉన్న గడియారాల్లో ఒకటి 1-40 సూచిస్తుంది. ఒక కొప్పులో ఉన్న రెండు గడియారాలు ఒప్పుకోడం తప్పు కదా! ఆ గేటుమీదఉన్న మరో గడియారం 1-34 సూచిస్తుంది. సుల్తాన్‌బజార్ గడియారం కాని, జేమ్స్ స్ట్రీట్ క్లాక్ టవర్ గడియా రాలుకాని, సికిందరాబాదులో అలాదీన్స్ వద్దఉన్న గడియారాలుకాని ఒకదానితో ఒకటి అంగీకరించవు. ఆకాశవాణి హైదరా బాదు సూచించిన సమయంతో ఏకీభవించిన ఒక చేతిగడియారం ఒకేరోజు బయటపెట్టిన విశేషాలివి.

అన్ని గడియారాలు విద్యుత్ప్రవాహంతో నడిచేవేకదా మరి!

ఆరిపోతున్న దీపాలు

విద్యుత్ప్రవాహంతో నడిచే గడియారాలు విద్యుత్సౌకర్యాలు లేనప్పుడు నడవ్వు - అంటారు అన్నీ తెలుసున్న వాళ్ళు. కాదన డానికి మన మెవరం? అదీ కాకపోయినా- ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తిశాఖ నిరంతర నిస్వార్థ సేవాఫలితంగా నగరంలో రెండేసి రోజులకొకసారి ఎక్కడో అక్కడ దీపా లారిపోకుండా ఉండటల్లేదు. ఇంట్లో దీపాలారిపోకుండా, ఉండాలంటే, ఏదైనా సినీమాహాలు ప్రక్కన చేరాలి. అక్క డైనా పగలు రేడియో పెట్టుకోవాలంటే విద్యుచ్ఛక్తి ఉంటుందని గేరంటి ఇవ్వలేం మేం.

కారణాలడిగితే 'హై టెన్షన్, లో టెన్షన్' అంటూ ఏవో చెబుతారు ఉద్యో గులు. అవన్నీ ఇక్కడ రాయడానికి భయం: ఇంజనీరింగు పదాల వంటి పదాలు వాడ్డంలో జాగ్రత్తగా ఉండాలి గదా మరి!

పత్రికా కార్యాలయాలలో 'టెలిప్రిం టర్' వంటి యంత్రాలుంటాయి. అవి విద్యు చ్ఛక్తి ప్రవహిస్తేగాని పని చెయ్యవు, మన దురదృష్టం కొద్దీ! దీపాలార్పేముందు ఒక అరగంట ముందుగా పత్రికా కార్యాలయా లకు తెలపడం సమంజసం అన్న విషయం విద్యుచ్ఛక్తి శాఖ ఉద్యోగులకు తెలియాలి గదా? అది తెలుస్తే దీపాలార్పే ప్రసక్తే ఉండదంటారా?

ఇళ్ళల్లో దీపాలు పెట్టడానికి ముందు చేతులు చాపే ఉద్యోగులు, దీపాలార్పడా నికి కూడా చేతులు చాచటల్లేదు. సంతో షిద్దాం! ఇంతకీ విద్యుచ్ఛక్తి ప్రవాహం ఆగిపోతే గడియారాలు ఆగిపోయినా, తరు వాత సరిచేసి సరైన టైం పెట్టవచ్చుగదా ఉద్యోగులు!

బస్సుల 'గుత్తులు'

విద్యుచ్ఛక్తి శాఖ రథన కూడా లేదు ఆర్ టి. సి బస్సులకు. బినా అవి ఇష్టం వచ్చినట్టు గుడుగుడు గుంచంగా నడుస్తున్నా యి. ఆగష్టు 31 వ తేదీ ఉదయం 10-44 కి రెండు 7-సి బస్సులు - 1430, 1403 - సుల్తాన్ బజార్ చౌరస్తా ప్రక్క నుంచి కలిసి ప్రయాణం చేసి కోఠీదిశ పోయాయి. గం. 10-47 ని. లకు ఇవి కోఠీ విడిచి జతగా బయలుదేరి అఫ్జల్ గంజ్ పోయాయ్. అవి రెండూ పోయినపదకొండు నిముషాలవరకు మళ్లా 7-c బస్సురాలేదు, గం.10-58 లకు మరో బస్సు-1433-వచ్చింది. గం 11-10 ని. లకు అఫ్జల్ గంజ్ వద్ద 1430,1403,1433,1442 నాలుగూ సిగరెట్లు కాల్చుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ నిల బడి ఉన్నాయ్.

ఆనాటి మధ్యాహ్నం 'మెదీనా' భవనం ముందు అబీడ్స్ దిశ పయనించే ప్రయాణీ కులు బస్సుకోసం అధమం 23 నిముషాలు వేచి ఉండవలసి వచ్చింది. 3-15 నుంచి 3-38 వరకు బస్సురాలేదు. 3-15 కి ముందు ఎప్పుడొచ్చిందో తెలియదు. 3-38 కి వచ్చిన 605వ నంబరు బస్సు ఆగలేదు-సహజంగానే! మరి మూడు నిముషాల తర్వాత-3-41 లకి ఏ పి జడ్ 617 వచ్చి కొందరు ప్రయాణీకు లను స్వీకరించింది.

ఈ 26 నిముషాల్లో చార్ మినార్ దిశకి విగు బస్సులు ప్రవహించాయ్. మొదటి పది నిముషాల్లో బస్సే లేదు. 3-25 కి 605 వెళ్ళింది. మరి మూడు నిముషాలకి 619, మరి ఏడు నిముషాలకి 628, వెంటనే 1458, మరో రెండు నిముషాలకి 629 వచ్చాయ్. తర్వాత అధమం మూడు నిముషాల వరకు బస్సు లేదు. వెళ్ళిన బస్సులు అన్నీ తిరిగి రావడం అంటూ లేదు.

ఆనాడే మధ్యాహ్నమే 3-52 కి రెండు బస్సులు 605,617 కలిసి అబీడ్స్ కార్నర్ చేరుకున్నాయ్. మరి మూడు నిముషాలకి 628 వచ్చింది. మరి ఐదునిముషాలకు 629 వచ్చింది. మరి ఆరు నిముషాలకి - అంటే గం 4-06 కి 619,1458 కలిసి వచ్చాయి. మరి ఎనిమిది నిముషాల వరకు బస్సు లేదు. 4-14 కి 615 వచ్చింది.

ఆర్ టి. సి బస్సుల నిర్వహణపై ఈ రాజ ధాని కబుర్లలో చేసిన ఆరోపణలలో స్పష్టత లేదని అంటారు అధికారులు. అలా అంటారు అధికారులు. పై ఆరోపణలలో కూడా స్పష్టత లేదంటారేమో చూడాలి. ఇప్పుడు ఆర్ టి సి బస్సులకు నిర్ణీతమైన కాలాలు ఉన్నాయేమో కనుగొనమనండి. లేకుంటే - ఆర్ టి. సి పేరు మార్చి బైనా

రాజధాని కబుర్లు

ధీనం బస్సు పేరు స్థిరం చేయమనండి.

పైన పేర్కొనబడిన సమయాలు విద్యుచ్ఛక్తి అవసరం లేకుండానే పనిచేసే ఒక అమాయకపు చేతిగడియారం చెప్పినవి. ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం చెప్పిన టైములో ప్రతిఫలించిన చేతిగడియారం చెప్పినవి.

ఎద్దు, గాడిద కథ:

న్యాయవాద వృత్తిలో విజయం సాధించదలచుకొన్నవారు గాడిద ఓర్పును, ఎద్దు బలాన్ని కలిగి ఉండాలని అనుభవజ్ఞులు సర్ సి. పి. రామస్వామి అయ్యర్ గతవారం న్యాయకళాశాల విద్యార్థులకి ఉపదేశం చేశారు.

ఆయన 56 సంవత్సరాలక్రితం వృత్తిలో ప్రవేశించారు. 39 సంవత్సరాలక్రితం మదరాసు ఎడ్వకేట్ జనరల్ గా నియమితులయ్యారు. 30 సంవత్సరాలక్రితం మదరాసు ప్రభుత్వంలో లా సభ్యులుగా నియమితులయ్యారు. తరువాత కేంద్రప్రభుత్వంలో లా సభ్యులయ్యారు. మళ్ళీ న్యాయవాద వృత్తి నవలంబించారు. ఆలోచించకుండా సర్. సి. పి సలహా చెబుతారనుకోడం పొరపాటే మరి:

ఇక్కడ ఒక కథ: నిజం కాకపోవచ్చు. 1945 లో బ్రిటన్‌లో కార్మికపక్ష ప్రభుత్వం ఏర్పడినప్పుడు, ఆ ప్రభుత్వ విధానం ఏమిటో పరిశీలించి తెలుసుకోడానికి సర్ సి. పి. ఒక ప్రత్యేక ప్రతినిధిని ఇంగ్లండ్ పంపించారట. ఆ ప్రతినిధి ఆరు మాసాలు ఇంగ్లండులో ఉన్నాడు. భారతదేశానికి 1948 లోగా స్వాతంత్ర్యం ఇవ్వాలని కార్మికపక్షం నిశ్చయించిందని, ఈ నిశ్చయం కొంతకాలం రహస్యంగా ఉంచబడుతుందని, వీలుంటే భారతదేశాన్ని విభజించి, లేకుంటే మానేసి, ఆ సమయానికి ఏ రాజకీయపక్షం ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ పక్షానికి అధికారం అప్పగించాలని కార్మికపక్షం నిశ్చయించిందని సర్ సి. పి. ప్రతినిధి తెలిపాడట.

ఈ సంగతి గ్రహించిన చర్చిల్ ముస్లిం లీగుని, జిన్నాని రెచ్చగొట్టాడట. 1946 మత కలహాలు కలకత్తాలోను, ఇతరత్రా ప్రారంభమయ్యాయి. వేలకొలదిమంది ప్రాణాలు కోల్పోయారు. ఈ హింసాకాండ భరించలేక, అధికారంలోఉన్న అహింసావాదులు

రాజీనామా ఇస్తానన్నారట. తిరువాన్కూరు ప్రధానిగా ఉన్న సర్ సి. పి. వని కట్టుకు ఢిల్లీ వెళ్ళి, కాంగ్రెసు మిత్రులతోను మంతనాలు జరిపి, ఏవిధంగానైనా అధికారం విడువవద్దని చెప్పివచ్చారట. సర్ సి. పి. మాటకు 'సై' అన్న కాంగ్రెసు వాదులను రాజాజీ వెళ్ళి మరో ధోరణికి త్రిప్పారట. పాకిస్తాన్ ఏర్పడింది. సర్ సి. పి. కి కోపం వచ్చింది: తిరువాన్కూరు రాష్ట్రాన్ని స్వతంత్రరాజ్యంగా ప్రకటించారు.

ఇది నిజం కాకపోవచ్చు; కట్టుకథే కావచ్చు. కాని-సర్ సి. పి. ఆలోచిస్తేగాని సలహా ఇవ్వగా అవడానికి ఇదొక నిదర్శనం.

*　　*　　*

సర్ సి. పి. ఉస్మానియా లా కళాశాల ఉభయవిద్యార్థి సంఘాలకు ప్రారంభోత్సవం చేశారు. రోటరీక్లబ్‌లో ప్రసంగించారు. ఇన్డియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇకనామిక్స్‌లో మూడు రోజులు మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఉపన్యాసాలను ఇచ్చారు. దాక్షిణాత్య సమాజాలలో ప్రసంగించారు. వారి వెనువెంట తిరగవలసివచ్చిన పత్రికా ప్రతినిధులు, వారికున్న ఓర్పు, బలం తమకు లేకపోయాయని మొఱపెట్టుకున్నారు.

క్రొత్త మేయర్‌కి సన్మానం

సికిందరాబాదు క్రొత్త మేయర్ శ్రీ శిర్నం సత్యనారాయణ గుప్తకి శ్రీ కాళిదాస కళానిలయం సన్మానపత్రం సికిందరాబాద్ వై. యం. సి. ఏ. లో సమర్పించింది. న్యాయమూర్తి శ్రీ కందా భీమశంకరం అధ్యక్షత వహించారు.

కాళిదాస కళానిలయం అధ్యక్షులు శ్రీ జూలూరు వీరేశలింగంగుప్త నగరంలో నాటకీయుల పాట్లు విన్నవించుకున్నారు. సికిందరాబాదులో ఒక రంగస్థలం నిర్మించడానికి జరిగిన, జరుగుతూన్న ప్రయత్నాలు వివరించారు. మేయర్ రంగస్థల నిర్మాణంలో శాయశక్తులా తోడ్పడతామని హామీ ఇచ్చారు.

శ్రీ సత్యనారాయణగుప్త ఉప్పు సత్యాగ్రహం సమయంలో రాజకీయాల్లో ప్రవేశించారు. రెండుసార్లు కౌన్సిలరుగా ఎన్నుకోబడ్డారు. శ్రీ వీరేశలింగంగుప్త అన్నట్లు ఆయన ఎన్నడో మేయరుగా ఎన్నుకోబడవలసింది. కాని సికిందరాబాదు నగరపాలక సంఘ రాజకీయాలను అర్థం చేసుకోవడం భగవంతునికి కూడా కష్టం. మధ్యలో రాష్ట్రనాయకులు కూడా శాయశక్తులా ఒకరాయి విసురుతూంటారు. ఇప్పటికైనా శ్రీ శిర్నం ఎన్నిక కావడం ముదావహం. నగరపాలక సంఘం వ్యవహారాలు బాగుపడతాయని ఆశిద్దాం.

సన్మానసభ అనంతరం శ్రీయుతులు జి. నరసింహారావు, సత్యనారాయణ, జి. వి. ఆర్. ప్రసాద్, బాలబాలికలు కుమారి విజయబాల, బాలాకృష్ణప్రసాద్‌ల సంగీత కార్యక్రమం జరిగింది. కార్యదర్శి శ్రీ యం. చలపతిరావు వందన సమర్పణ చేశారు.

శ్రీ కృష్ణజన్మస్థానం చెప్పిన కథలు:

"పునర్, పునర్, పునర్... వివాహితుడి కథ చెప్తా. నేనే కాదు చాలమంది ఆత్రుత చూపిస్తున్నారు వినాలని" అంది నృసింహాజన్మస్థానం. "నర్లే! నీకే కాదు; నాకూ తెలుసు ఆ విషయం!" అంది శ్రీ కృ. జ. స్థా. అని, "విను" అంది.

"పీటర్ మన్నసీ అన్నది ఈ లోకోద్ధారకుడి ఆఖరు పేర్లలో ఒకటి. అతని అసలు పేరు కాజీ మహమ్మద్. తండ్రి పేరు మజ్హర్ అలీ. జన్మస్థానం బొంబాయిలోని బొంబాయి రాష్ట్రంలోని తూర్పు ఖండేష్‌లోని ఎరండోల్. అతని పేర్ల పూసల పేర్లో చాలా పూసలున్నాయి. అందులో కొన్ని: ప్రభాకర మార్తాండ మరాఠీ, బాలా సాహెబ్ మరాఠీ; మాధవ్ కృష్ణాజీ మరాఠీ, పర్కే; మధుకర్ బలవంత సానే; ఇత్యాది:

"ఇప్పుడు అతని వయస్సు 44 సం॥ లు. మెట్రిక్యులేషన్ వరకు చదివాడు కాని పేసు కాలేదు. సర్టిఫికేట్లు, యోగ్యతా పత్రాలు సృష్టించాడు. ఒకచోట అతను కేంబ్రిడ్జిలో ఎం. ఎ. పేసయానని, లండన్‌లో ఎఫ్. ఆర్. ఈ. పట్టం పొందానని చెప్పుకున్నాడు."

"ఎఫ్ ఆర్. ఈ. అంటే?" అంది నృ. జ. స్థా. నిగ్రహించుకోలేక.

శ్రీ కృ. జ. స్థా. "మధ్యలో మాటాడక" అని కసిరింది. తిరుసరి చెప్పింది: ఎఫ్. ఆర్. ఈ. అంటే ఫేస్ రీడింగ్ ఎక్స్‌పర్ట్ట! ముఖాలు పుస్తకాలు చదివివేసినట్లు చదివేయగలవాడు అని అర్థం.

"మొదట ఇతడు ఒక ముస్లిమ్ వనితను పెళ్ళిచేసుకున్నాడు. తూర్పు ఖండేష్‌లోనే ముగ్గురు పిల్లల తండ్రయ్యాడు. తరువాత 1945 లో బార్సీ వచ్చాడు. బార్సీ తెలియదూ? బార్సీ లైట్ రైల్వే అనే వారూ? అది! అక్కడ బ్రాహ్మణకులం వాడినని చెప్పి, ఒక మిల్లు యజమాని కూతుర్ని పెళ్ళి చేసుకున్నాడు. పదివేలరూపాయల కట్నం తీసుకున్నాడు. ఇద్దరు పిల్లలు పుట్టారు. అప్పుడు ఇతడు మహమ్మదీయుడు అని తెలిసింది భార్యకి. తెలిసి, పిచ్చెక్కిపోయింది, పాపం!

"బార్సీలో ఉండగానే తను అవినీతి నిరోధకశాఖ డైరెక్టర్ని అని చెప్పి, కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగం ఇప్పిస్తానని మధ్యపెట్టి, ఒక స్థానిక న్యాయవాదివద్ద పదిహేనువేలు కాజేశాడు.

"తర్వాత 1948 లో మన ఊరు వచ్చాడు. ఎం. ఏ. నని చెప్పి సికిందరాబాదులో ఒక మిషన్ స్కూల్లో ఉపాధ్యాయుడుగా చేరాడు. సర్టిఫికెట్ అడిగితే, ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాడు. అక్కడే ఉపాధ్యాయినిగా పని చేస్తూన్న ఒక క్రైస్తవ వనితను వివాహమాడేడు. క్రైస్తవమతం స్వీకరించి పీటర్ మన్నసీ అనాడు. సుల్తాన్‌బజార్‌లో కాపరం పెట్టాడు. ఎన్నో పుస్తకాలు రాసి, ప్రకటించాడు. వార్ధా కాంగ్రెస్ వ్యవహారాల్లో పాల్గొన్నాడు. ఐదుగురు పిల్లలు ఈ వివాహంవల్ల.

"ఇదేకాలంలో బొంబాయిలో రిటైర్డు ఆఫీసర్ గారి కుమార్తెని వి. యం. మరాఠీ పేర వివాహమాడేడు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఒక రహస్యశాఖోద్యోగిని అన్నాడు. సుల్తాన్‌బజార్‌లోనే కాపురం పెట్టాడు. పీటర్ మన్నసీ, మరాఠీ-ఇద్దరం సోదరులమనీ, అందువల్ల పోలికలు చాలా ఉన్నాయనీ అన్నాడు.

"ఈలోగా నాగపూర్ వెళ్లి ఒక లెక్చరర్ని పెళ్లాడి, కలకత్తాలో రెండుచోట్ల కాపురం పెట్టాడు. రెండోచోట ఒక బందరు అమ్మాయితో పరిచయం చేసుకొని, పెళ్లి చేసుకో సిద్ధపడ్డాడు. అక్కడ అతని పేరు సాథీ.

"సుల్తాన్‌బజార్‌లో ఉన్న అతని హిందూ భార్య బంధువులకు తెలియచేసింది. మొన్న మార్చి 17 న పోలీసులకు రిపోర్టు వెళ్లింది. మార్చి 19 న కలకత్తాలోని ఆంధ్ర వనితతో వివాహం కాకపూర్వమే అరెస్టయ్యాడు. ఇప్పుడు బొంబాయిలో మన వాళ్ళింట్లో ఉన్నాడు."

"మనిషి కాకపోతే మానె! బొమ్మ చూపించు" అంది నృ. జ. స్థా.

"అదే వద్దన్నది" అని గదమాయించింది శ్రీ కృ. జ. స్థా. ★

> 'డాక్టర్లకు శత్రువులేవాళ్లు లోకంలో ఉండరు'- ఈలోకంలో ఉండరు; కాని పరలోకమంతా డాక్టర్లకు శత్రువులే!'

న్యూఢిల్లీ లేఖ

శ్రీకృష్ణ

ఢిల్లీలో వార్తాలహరి పరవళ్ళు

ఎవరికీ తెలియని వరిక్రొత్త వార్తలు.

'మూసీ'లు లాగి వెలువరించిన వార్తల పరంపర భయంకరం. ఈ వారం వారం ఢిల్లీ అంతా ఈ వార్తాలహరితో పరవళ్లు త్రొక్కింది.

ఒకనాటి ప్రశాంత ప్రభాతంలో ఇదీ వార్త. ఆంగ్ల నౌకాదళాధిపతి (అడ్మిరల్) లార్డ్ లూయీ మౌంట్ బాటెన్ తన చిరకాల మిత్రుడైన మన ప్రధానమంత్రికి ఒక లేఖ వ్రాశాడట. మా నౌసరకుల వ్యాపారంపైకి దృష్టియుంచుకుంటే ఆ సందర్భంలో ఏదో కొన్ని వసతులు కల్పించమని భారత ప్రధానికి ఆయన వ్రాశారని ఈ వార్తలు! మా నౌపరిశ్రమలో పనిచేయుగా ఉంటూన్న కమ్యూనిస్టులు కేపుపడ్డారు ఈ వారవిని.

ఆహార మంత్రిగా శ్రీ ఎస్. కె. పాటిల్ ను బదిలీ చేయడం మరొక వార్త! క్రొత్త పదవిలో కాలు పెడుతూనే ఆయన చేసిన ప్రకటన మరీ కదలిక కలిగించింది. ప్రస్తుత ఆహార పరిస్థితిలోని ఇబ్బంది తొలగించాలంటే ఆహార ధాన్యాల వ్యాపారం ప్రభుత్వం నిర్వహించ వలసిందేనని శ్రీ పాటిల్ ప్రకటించారు. ఒకప్పుడు ఇదే అభిప్రాయం ప్రకాశంగా కూడా కలిగిఉన్న ప్రధాని శ్రీ నెహ్రూకు ఈ ప్రకటన సంతోషం కలిగించి ఉండవచ్చు కూడా.

దాపరికం లేకుండా సూటిగా మాట్లాడారు శ్రీ పాటిల్. ఇటీవల చాలాకాలంగా కేంద్ర మంత్రివర్గ సభ్యులొకరు బహిరంగంగా మాట్లాడడం ఇదే తొలిసారి! "భారత రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్ ప్రకారం వ్యవసాయికఉత్పత్తి బాధ్యత పూర్తిగా ప్రభుత్వమే వహించాలి - అది ప్రభుత్వం విధి" అని శ్రీ పాటిల్ ఉద్ఘాటించారు. విద్య, ఆరోగ్యం కూడా అటువంటివే!

ఏ రాజ్యాంగ సూత్రాల ప్రకారం తాను అధికారంలోకి వచ్చారో వాటిని సక్రమంగా అమలుపరచడంవల్ల ప్రధానమంత్రి గౌరవమర్యాదలు పెరుగుతాయి. అధికార సుస్థిరత పెరుగుతుంది.

వ్యవసాయం గాని, దానితో పాటు విద్య, ఆరోగ్యం గాని స్వతంత్రమైన శాఖలని శ్రీ పాటిల్ భావం.

శ్రీ పాటిల్ ఇంకా ఏ విధి నిర్ణయాలు ప్రకటించి ఉండకపోవచ్చు గాక! తన ఉద్దేశ్యాలు ఏవిధంగా ఉన్నాయో వివరించడానికి పై ప్రకటనలు చేసిఉండవచ్చు. అయితే రాష్ట్రాలలోని ఆహార వ్యవసాయ శాఖలతో కలసి జట్టుగా ఏర్పడి కేంద్ర ఆహారశాఖ పనిచేయవలసి రాగలదనీ, ప్రణాళికా సంఘంతోను, కేంద్ర నీటిపారుదల, సామాజికాభివృద్ధి మంత్రిత్వ శాఖలతోను సంబంధం చాలా ఉంచుకోవలసి ఉంటుందని కూడా ఆయన వివరించారు. ఈ మంత్రిత్వ శాఖలన్నీ పరస్పరం ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉండేటువంటివి.

'విడిపోయి నిలుద్దాం-కలసి కూలిపోదాం' (Divided we stand and united we-fall) అనే సిద్ధాంతం మరి శ్రీ పాటిల్ నిర్ణయంతో వీగిపోవాలి.

చాలారోజులుగా కేంద్రమంత్రిగా ఉంటున్న శ్రీ పాటిల్ నీటిపారుదల మంత్రిగా, రవాణా - తంతి తపాలా శాఖల మంత్రిగా మార్చబడ్డారు. తిరిగి ఆహార వ్యవసాయమంత్రిగా నియుక్తులైనారు. 'సోషలిజం' మూలసూత్రాలు శ్రీ పాటిల్ కు ఇంకా వంటబట్టలేదు. ఇండియాలో 'సోషలిజం' అంటే ఉద్యోగాలు కల్పించే సాధనమన్నమాట.

ఒకవైపున ఉద్యోగాలు కొంతకాలం వరకు క్రొత్తవాళ్లకు ఇవ్వడం అవకాశం లేదని హోంశాఖ ప్రకటిస్తుంటే- మరొకవైపున ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజి కార్యాలయాలు నెలనెలా విపరీతంగా క్రొత్త ఉద్యోగాలిస్తున్నట్లు జాబితాలు చూపిస్తున్నవి. గుమస్తా ఉద్యోగాలు మరీను! దేశాభివృద్ధి ప్రణాళిక రూపొందించిన కారణం ఒకటే! అందరికీ వృత్తులు ఉద్యోగాలు కల్పించడం. అభివృద్ధి ప్రణాళికలన్నిటి లక్ష్యం ఇదికాదా?

మొన్న సీమన్స ఢిల్లీలో యూరపియనులకు చెందిన ఒక హోటలు తెరవడానికి వీలులేని



విమాన పదాతిదళాల శిక్షణ పాఠశాలకు సికిందరాబాదులో రక్షణమంత్రి శ్రీ కృష్ణమీనన్ మొన్న ప్రారంభోత్సవం జరిపారు. సేనాని తిమ్మయ్య, శ్రీ నగేశ్, కృష్ణమీనన్‌లు ఇష్టాగోష్ఠిలో ఉన్నప్పటి దృశ్యం. (శ్రీ తిమ్మయ్య రాజీనామా వార్త ఇటీవల రాజకీయరంగంలో విపరీతంగా సంచలనం కలిగించింది.)

పరిస్థితులు కల్పించబడినాయి. విధిలేక ఆ యజమానులు హోటలు మూసుకోవలసిరాగా పార్లమెంటు సభ్యుడొకాయన "మరి పని వాళ్ళకు కల్పించబడిన ప్రత్యామ్నాయం ఏమిటి"అని విచారించారు కూడా. సామాజికాభివృద్ధిశాఖలోగల ఉద్యోగు లెంతమంది? ఇంతమంది కావాలా? వీరు చేస్తున్న దేమిటి? ఇంకో ప్రశ్నలకు సమాధానం దొరకలేదు శ్రీ పాటిల్ కి. ప్రతి జాతీయపరిశోధనాలయంలోను ఒక సమాజ వికాసకార్య కేంద్రం స్థాపించిందట ఈ మంత్రిత్వశాఖ. ఇది చాలా చిక్కు వ్యవహారం. ఈ ఉద్యోగుల ఓటుసహాయంతో ఎన్నికలు సైతం గెలవవచ్చునేమో! ఆహారోత్పత్తికి నిరంతరం సాగిస్తున్న సంగ్రామం విఫలం గనక అయితే ఏది విఫలం కాదు? ఏగిపోదు? 'ముందున్నది ముసళ్ళ పండుగ' ఆహార స్వయం సమృద్ధి సాధనయత్నం ప్రధానమంత్రికి ఒక పెద్ద ప్రశ్న! చాలా క్లిష్టమైన సమస్య!

ప్రభుత్వ పరంగా ఆహార ధాన్యాల వ్యాపారం ఒక చక్కని బొమ్మ. పైగా గాజు బొమ్మ! ఈ మార్పుల్లో చేర్పుల్లో అనేకసార్లు పగిలిపోయింది. ఆహార సమస్యకు ఒక్కటే పరిష్కారం. త్వరితగతిని సమృద్ధిగా ఆహారోత్పత్తి దీనికి పరిష్కారమని శ్రీ పాటిల్ చెప్పింది నిజం!

శ్రీ పాటిల్ ఒక్కరే తెలుసుకోగలవారు ఆహారోత్పత్తికి భూవసతి గరిష్ఠ పరిమితుల నిర్ణయమూ, సర్వీసు సహకార సంస్థలూ ఎంత హానికలిగించాయో. ఢిల్లీకి అందేవార్తలనుబట్టి వీటివల్ల వేలాది సాగుబడి భూములు పండ్లతోటల పెంపకం క్రిందికి తీసుకురావడం జరిగిందిట. ఇది ఆహారోత్పత్తి సమృద్ధి సాధనకు హానికాదా?

* * *

ఇది ఇలా ఉండగా ఈవారం పొక్కిపోయిన పెద్దవార్త సైనికసిబ్బంది ప్రధానాధికారి జనరల్ తిమ్మయ్య రాజీనామా! ప్రధానమంత్రి ప్రకటననుబట్టి చూస్తే రాజీనామా ఉపసంహరణ కూడా అయిపోయిన తర్వాత అసలు రాజీనామా వార్త బయటికి రావడం జరిగిందన్నమాట.

విదేశీరాయబార కార్యాలయంలో ఎక్కడో—ఏ సందర్భంలోనో—ఏ నిషాలోనో-ఏహుషార్ లోనో ఈ వార్త ఎలా బయటికి వచ్చిందో వచ్చిందట!

కమ్యూనిస్టు సభ్యురాలు శ్రీమతి రేణు చక్రవర్తి పేర్కొన్నట్లు హఠాత్తుగా ఆగస్టు 31వ తేదీనే రక్షణమంత్రికీ, సర్వసేనానికి విభేదాలు పుట్టుకురాలేదు. అవి కొంతకాలంగా ఉంటున్నాయి. లోక్‌సభ చర్చలవల్ల ఇది బోధపడుతుంది.

శ్రీమతి చక్రవర్తి ప్రశ్న అసలు పాకిస్తాన్ ప్రెసిడెంటు న్యూఢిల్లీకివచ్చిన రోజునే ఈ రాజీనామాపత్రం దాఖలు చేయడంలో అంతర్యం ఏమిటీ అని. ఇదే సందేహం తన పక్షీయులలోకూడా ఉండటం మూలాన ప్రధానమంత్రి స్పీకర్ ను 'సమాధానించ' వలసిందన్నట్లుగా చూశారు.

అసలు రాజీనామా పొరపాటయ్యేటట్లయితే- దాని ఉపసంహరణ మరింత పొరపాటు! జనరల్ తిమ్మయ్య సరిగా వ్యవహరిస్తే రాజీనామా ఆమోదించబడేదేమో- అటువంటి రాజీనామా ఏదైనా అంగీకరింపబడుతుందని సూచించిఅయినా ఉండాలి. రక్షణ బలాలపై అధికారహోదాల ప్రభావం కూర్చిన సూత్రాలు ప్రధానమంత్రి సమంజసంగా ప్రస్తావించారు. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రూమన్ - మెకార్థర్ ల ఉదాహరణ కూడా లోక్ సభలో ప్రస్తావనకు వచ్చింది.

నా మట్టుకు నాకు కర్జన్-కిచ్ నర్ ల వ్యవహారం జ్ఞాపకం వచ్చింది. అయితే అది మిలిటరీ నియంతృత్వపరిపాలనకు దురదృష్టవశాత్తూ గురి అయిందనుకోండి.

ఏది ఏమైనా అంతా సర్దుకుపోయిందని స్పీకరు ప్రకటించారు. ఈ సర్దుకుపోవడాలు చాలా ఇబ్బందికరమైనవి. ముఖ్యంగా రక్షణబలాల విషయంలో రక్షణశాఖ ఉద్యోగుల బాగోగులు శ్రద్ధగా ఇకముంది గమనిస్తామని శ్రీ నెహ్రూ అన్నారు. దీనితోనైనా క్రమంగా సుహృద్భావం ఈ అధికార వలయాల్లో వ్యాపించునుగాక! ★

మళ్ళీ పెళ్ళి



'కోకిపిల్లకేం తెలుసు ఉండేల్ దెబ్బ' అని మామయ్య గుడ్లెర్రచేస్తూ తనే ఏదో పెద్ద ధక్కామక్కీలు తిన్నవాడికిమల్లే, చదివే పేపర్ని ఝళిపించి మునివేళ్ళతో పట్టుకొని, మందపాటి నల్లఫ్రేము కళ్ళజోడును రెండో చేత్తో చక్ మని తీసి నాకు గట్టిగా బుద్ధిచెప్పాలన్నట్టుగా అదోపోజులో నుంచున్నాడు. రెండుచేతుల్లో కాఫీతీసుకు వస్తున్న మా అత్తమ్మ మళ్లా ఏదో చెలరేగబోతోందని గ్రహించి, ఏమిటో విడిసంగతి గట్టిగా తేల్చుకోవాలని వాళ్ళన్నయ్యకు వకాల్తా యిచ్చి ప్రక్కనే నుంచున్న, మా అమ్మనుచూసి, 'ఏమిటన్నట్టు'కనుబొమలతో అడిగింది. 'ఇంకేముంది...అదే' అన్నట్టు తలత్రిప్పగా 'సరే' అన్నట్టు రెప్పలు వాల్చి టేబులుమీద కాఫీపెట్టి వెళ్ళిపోయింది.

కాఫీ త్రాగి సావధానంగా నా సంగతి తేలవాలని కాబోలు పేపరు కుర్చీలో పారేసి కప్పు అందుకొని కాఫీ చప్పరించి 'దీంట్లో పంచదార తగలెయ్యలేదేమే!' అని వంటింట్లో, మా అమ్మకు తనకు కప్పుల్లో కాఫీపోసుకుంటున్న మా అత్తమ్మ గుండె లదిరేట్లు అరిచాడు. వెంటనే 'ఖంగు'మని వంటింట్లో ఏదో మోతయింది. మాఅమ్మవెళ్ళి పంచదార తీసుకువచ్చి రెండు గ్లాసుల్లోనూ పంచదారవేసి చెంచా మామయ్య గ్లాసులో వదలి డబ్బా మూతపెట్టుకుంటూ వెళ్ళింది.

మామామయ్య 'సీరియస్ నెస్'ను గ్రహించనట్టు ఇవన్నీ పరిశీలిస్తోంటే నాకొళ్ళుమండి కాఫీ తీసుకోవేం అని లెంపకాయ కొట్టినట్టుగా అన్నాడు.

తాపీగా 'తీసుకుంటున్నా గా' అంటూ కప్పుతీసుకొని వాకిలి గేటువంక చూస్తూ కాఫీ త్రాగటంతో మామయ్య ఒళ్ళు మరీ మండిపోయింది.

అలా నావంకే చూస్తూ కాఫీ త్రాగేసి కప్పు టేబులుమీదపెట్టి 'ఎన్నివిధాల చెబితే యేం దున్నపోతుమీద వర్షం కురిసినట్టు' అని పేపరు తీసుకొని నాతో మాట్లాడటమే అసహ్యమన్నట్టుగా తన గదిలోకి వెళ్ళిపోయాడు.

నందివాడ వెంకటరామయ్య

మా అమ్మ వంటింట్లోంచి వరండాలోకి వచ్చి కేసు విచారణ ఆగిపోవటం చూచి వాళ్ళన్నయ్య గదిలోకి వెళ్ళి 'ఏరా ఏమన్నాడు?' అని నెమ్మదిగా వ్యవహారాన్ని కదిపింది.

'ఏమంటే నాకెందుకు పోతేపొమ్మను – మద్రాసే పోతాడో బొంబాయే పోతాడో – వచ్చేపాట్లు ముందుగానే తెలిసిరావు వాడికి వెధవ సినిమాలు – ఇదిగో గట్టిగా చెప్తు – వాడు నామాట కాదని సినిమాల్లోకి వెడితే వస్తులు పడుకుంటున్నా కానిడబ్బుపంపనని ఏమిటో వెధవెళ్ళి బావుకునేది–నిక్షేపంలాంటి ఉద్యోగాన్ని కాలదన్ని వెళ్ళిన సుబ్బారావు చూడరాదూ – భోరుమంటూ డొక్కలు ఎండగట్టుకొని లెంపలేసుకొని తిరిగివచ్చాడు. అయినా అప్రదిష్టపని బి. ఏ., చదివి వేషాలేయటం ఏమిటి? ఇదిగో నీతో కూడా చెబుతున్నా – వాడు నాటకాల్లోనూ సినిమాలలోనూ వేషాలేస్తే నా కూతుర్ని కూడా యివ్వను.'

'నీ కూతుర్ని యివ్వకపోతే వాడికి పెళ్ళి కాదురా! – ఏదో నచ్చచెప్పి వెళ్ళకుండా చూడరా అంటే అలా మండిపడతావేమిటి– కాస్త నెమ్మదిగా చెప్పి ఆపరా.'

'ఏం నెమ్మదిగా చెప్పటం – చెప్పలా(?) కాలేజీలో నాటకాలు వేస్తుంటే–అబ్బాయి ప్రయిజులు తెస్తున్నాడని ఉబ్బితబ్బిబ్బయ్యావు. ఆ అలుసు చూసుకొని వాడు వీధి నాటకాలకు కూడా తయారయ్యాడు – ఇక రేపణ్ణుంచీ పాతగోడలమీద, చెత్తకుండీల మీద, జట్కా బండ్లమీద కూడా అబ్బాయి మొఖం కనబడుతుంది – దాంతో మరీ ఆనందంగావుంటుంది. ఛీ! మన్ని చూసి ఇంకా ఎవరూ క్రింద ఉమ్మెయ్యరు!–'

'ఏరా యిక నీమాట నీకేనా' అంది అమ్మ ఇవతలికొచ్చి, ఆఖరిసారిగా.

'ఏలాగమ్మా వెళ్ళకపోతే – రమ్మని మద్రాసు నుండి టెలిగ్రాం వచ్చింది. స్నేహితులందరూ వీడ్కోలు విందుకూడా చేశారు, వెళ్ళకపోతే బాగుంటుందా?' అని బెడ్డింగు చేత్తో పుచ్చుకున్నాను.

"ఇక నీ యిష్టం– చెప్పేవాళ్ళెవరూ లేరుగదా" అని కంట నీరు పెట్టుకుంది.

"సంతోషంగా పంపమ్మా" చేతి రుమాలతో కళ్ళు తుడిచి పాదాలకు నమస్కారం పెట్టి వీధి గుమ్మం వైపు రెండడుగులు వేసేసరికి ఛాయ కాలేజీ నుండి పుస్తకాలు పుచ్చుకొని రిక్షా దిగింది.

"బావ చేతిలో బెడ్డింగు చూసి, "బావ" అని మాత్రం అనగలిగింది.

"ఆ వెళ్ళొస్తా. ఇక దిగ్విజయం. నువ్వు ఎదురొచ్చావు"

ఛాయ దిగిన రిక్షాలోనే బెడ్డింగు పెట్టి రిక్షాలో కూర్చొని "వెళ్ళొస్తా ననటానికి" తలవంచేసరికి ఛాయ ప్రక్కనే నుంచుంది.

"వెళ్ళొస్తాను ఛాయ"

"తప్పదా బావా, నేను జ్ఞాపకముంటానా మద్రాసులో"

"నువ్వు ఛాయవి. ఎలా మర్చిపోతాను. స్టేషన్‌కి పోనియ్యి.

ఇదుగో ఛాయా! బావ బెంగలో పడి చదువుకి స్వస్తి చెప్పేవు! బి. ఎస్‌సి. ఫస్టున రావాలి."

"ఎం. ఎస్‌సి. మద్రాసులోనే చదువుతా బావా"

"ఓ! దగ్గరుండి చెప్పిస్తాగా!" రిక్షా కదిలిపోతోంది. ఛాయ చూస్తుండగానే సందు మలుపు తిరిగిపోయింది.

ఛాయ అలాగే నుంచుంది. రిక్షా వెళ్ళిన వైపే శూన్యంగా చూస్తోంది. అప్పుడే బావ రైలు ఎక్కి మద్రాసులో దిగినట్టు, ఏకు చేస్తున్నట్టు, బావ ఎవరో అమ్మాయి కౌగిలిలో చిక్కుకుపోయినట్లు, తెరమీద బొమ్మల్లాగా గిరగిరా తిరిగిపోతోంటే కళ్ళలో నీళ్ళు గిరగిర్రాడి గిరుక్కున తిరిగి గేటు వేసుకొని లోపలికి వెళ్ళిపోయింది.

మద్రాసులో రైలు దిగగానే స్టూడియో నుండి పంపిన కారు స్టేషన్‌వద్ద సిద్ధంగా వుంది. సరాసరి స్టూడియోకే వెళ్ళాను. డైరెక్టరుగారు సిగరెట్టు దమ్ము గుమ్ముగా కొడుతూ ఏదో ఆలోచనలో నిమగ్నమైన పోజులోంచి తెప్పరిల్లుకుంటూ కూర్చొమని చెప్ప వలసిన విషయాలు నాలుగూ చెప్పి వారం రోజులలో సెట్టు పూర్తవుతుందని వెంటనే షూటింగు మొదలుపెడతాం అని చెప్పారు. ఇంతలోనే చిన్ననాటి స్నేహితుడు రామం వచ్చాడు అక్కడికి ఏదో ఫైలు పుచ్చుకొని. తాత్కాలికంగా రామం ఇంట్లోనే మకాం పెట్టాను.

ఆ పిక్చరు సంవత్సరాదికి రిలీజు చేయాలని షూటింగు త్వరత్వరగా సాగిపోతోంది.

ఒకరోజు షూటింగులో హీరోయిన్ చేతులలో బంధింపబడటం స్పృహతప్పి ఛాయ కౌగిలనుకొని 'ఓవర్ ఏక్షన్' చేయటం, డైరెక్టరు 'కట్' అంటం జరిగింది.

ఆ మర్నాడే ఛాయవద్దనుండి బి. ఎస్‌సి. పరీక్షలు అయిపోయినట్లు, వాళ్ళ నాన్న ఏదో సంబంధం నిశ్చయిస్తున్నట్లు 'ఎక్స్‌ప్రెస్' డెలివరీ కవరు వచ్చింది.

సినిమా షూటింగుకూడా తన ఆత్మకథను 'పేరలల్'గా నడుస్తోంది.

మర్నాడు షూటింగులో ఘట్టం అదే తన ప్రేయసినుండి వేరే పెళ్ళికి లగ్నాలు నిశ్చయింపబడుతున్నాయని వచ్చిన ఉత్తరాన్ని చదువుకొని విషాదంగా పోజు పెట్టి, వెంటనే తన ప్రేయసివద్దకు వెళ్ళేందుకు రైలుఛార్జీలు లేక దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లు 'క్లోజప్' షాట్‌కి పోజు పెట్టాలి.

తీసే పిక్చరు కామెడీ. తన ప్రేయసిని నప్పచెప్పటం డైరెక్టరు భారం. కాని తన ఆత్మకథలో భారం వహించేవారు ఎవరూ లేరు. అదీగాక తనకథ కామెడీయో ట్రాజెడీయో తుదివరకూ తెలిసి రాదు.

ఏదైతేయేం నా ఆత్మకథకు భగవంతుడే డైరెక్టరుగా వున్నప్పుడు సాధారణంగా కామెడీ చేయటమే ఆయనకు అలవాటు. కానీ పిక్చరు ధాటీగా సాగిపోతుంటే ఇప్పుడు ఇంటికి వెళ్ళొస్తానంటే నన్ను వదుల్తారా? వదలరు.

ఇంతలోనే అసిస్టెంటు డైరెక్టరు రామం వచ్చాడు. నా మొఖం చూసి 'శ్రద్ధంటే అలా వుండాలి. రేపటి షూటింగుకి రిహార్సల్సు చూసుకుంటున్నావా' అన్నాడు.'

'దన్నాం—ఫో' కాదురా నాయనా అసలు కథ ఇదని వివరించాను.

రామం వెంటనే స్టోరీ ఫైలు తీసి 'కథలో హీరోయిన్ హీరోవద్దకు పారిపోయి వచ్చింది నగలతో సహా. అలా రావచ్చునేమో నీ ప్రేయసి' అన్నాడు.

'అక్కడ డైరెక్టరూ రైటరూ మార్గమధ్యంలో ఏ పోకిరీ వెధవలనీ వెంటబడనీయకుండా, అంత బొంబాయినగరంలోనూ ప్రియుణ్ణి వెదికి వద్దన కలిపే భాగం వారిదని హామీ వహించారు కాబట్టి హీరోయిన్ బయలుదేరింది. కానీ ఇక్కడ ఆటువంటి హామీ ఏమీ లేదే! అదీగాక ఛాయ చాలా భయస్తురాలు. నేను వెంటవుంటేనే బయలుదేరి వస్తుంది.'

రామం సిగరెట్టు ముట్టించి ఏదో ఐడియా వేస్తున్నాడు. ఐడియా పూర్తి కాకుండానే టెలిగ్రాం వచ్చింది ఛాయవద్ద నుండి.


చిటిక వేసి చెప్పాను ఛాయ బయలుదేరి వస్తోందని స్టేషన్‌కు వెళ్ళాలనీ.

ఉదయమే స్టేషన్‌కి వెళ్ళి ఛాయని

ఒకాయన హోటలుకెళ్ళి సర్వర్‌ని "ఏమున్నాయి" అని అడిగాడు. ఉన్న పదార్థాల లిస్టు చదివేశాడు సర్వర్.

"ఒక్కటీ నచ్చింది లేదే మయ్యా. మేనేజర్ని తీసుకురా" వెంటనే సర్వర్ ఇలా అన్నాడు నిర్లిప్తంగా:

"చట్నీతోనా, సాంబార్‌తోనా సార్?"



మళ్ళీ పెళ్ళి

టాక్సీలో తీసుకువచ్చాను.

తరువాతి కార్యక్రమం!

వెంటనే రిజిస్ట్రాఫీసుకు వెళ్ళి వివాహమునే అడ్డును కాస్తా తొలగించుకున్నాము. ఇప్పుడు కొత్త ఊపిరి పీల్చగలిగాను. ఇక మామయ్య వచ్చినా భయం లేదు!

ఛాయ ఏదో భయం భయంగానే వుంటోంది. ఛాయకు ధైర్యం చెబుదామంటే, మామయ్య తలపుకు వచ్చినప్పుడల్లా నేనూ త్రుళ్ళిపడుతూనే వున్నాను. ఎలాగో అలా ధైర్యం తెచ్చుకొని, భయాన్ని దిగమింగుకుంటూ

'మీ నాన్నంటే ఎందుకంత భయపడతావు' అని మొదలుపెట్టా.

'నువ్వెందుకు బావా అలా ఖంగారు పడుతున్నావే పొద్దుణించీ'

'ఏవ్వే నాకు ఖంగారేమిటి—మనం చేసింది ఏమైనా తప్పుపనా?'

'మా నాన్న ఇక్కడకు వస్తాడేమో అని భయంగా వుంది!

'నాకూ అదే...ఏమిటో...అలాగే... భయం...భయంగా వుంది!'

'మంచి ధైర్యస్తుడివి బావా' అని చిలిపిగా నవ్వింది.

'నాకు భయమేమిటే ఏదో సరదాగా అలా ఏకు చేస్తున్నా గానీ' అంటూ ఆ లేత చెంపమీద ఒక చిరుదెబ్బ కొట్టాను.

సిగ్గుతో తల త్రిప్పుకొని కిటికీలోంచి బయటకు చూస్తూ అమాంతంగా 'బావా' అని కౌగలించుకుంది.

'ఏమిటే అఘాయిత్యం' అంటూ కిటికీ లోంచి చూద్దునుగదా, ఇంకేముంది మా మామయ్య రానే వస్తున్నాడు.

'ఛా...యా—చ-చ-ఛాయా, ఆ వచ్చేది మీ నాన్నేనా అలా వస్తున్నాడే ఉగ్రనరసింహాస్వాములే—తలుపులు కూడా బార్లగా తీసేన్నాయ్!'—

'మా నాన్నే కాదండీ మా అమ్మ మీ అమ్మ కూడా వున్నారు ఆయన వెనకాలే'


'చచ్చాం పో—తలుపులు వేసిరా'

'ఏమో బాబూ మీరే వేసిరండి'

'చెప్పినమాట వినాలి—వేసిరా' మా మామయ్య గుమ్మంలోకి వచ్చి డోరు నెంబరు చూసుకుంటున్నాడు.

'చచ్చాంరా నాయనా' ఛాయని పట్టుకొని గబగబా ఎక్కడికో లోపలి గదిలోకి తరారయ్యి నెమ్మదిగా తొంగిచూస్తున్నాను.

మామయ్య ఆ ఇంట్లో నా ఫోటో వుండటం చూచి దృఢపరచుకొని 'ఒరేయ్—



ఆంధ్రదేశమంతటా జయభేరి మ్రోగిస్తున్న
మహోన్నత చిత్రం!
స్వాతంత్ర్య సమరానికి
మొట్టమొదట రణభేరి మ్రోగించిన
ఆంధ్ర వీరుని అమరగాథ!
ఏ.సి.ఇ సమర్పించు
పద్మినీ పిక్చర్స్ వారి
వీరపాండ్య
కట్టబ్రహ్మన
[తెలుగు]
పూర్తి గేవాకలర్ చిత్రం
నిర్మాత, దర్శకుడు.. బి.ఆర్.పంతులు
CHITRALEKHA
రచన, నిర్వహణ..డి.వి.నరసరాజు...పాటలు..ఆరుద్ర..సముద్రాల జూనియర్..& కొసరాజు......

★ మళ్ళీ పెళ్ళి ★

విరా' అని ఫీస్టల్ దెబ్బలాగా గేక వేశాడు.

ఛాయని లోపల వుంచి గుటకలు మ్రింగుతూ,

'ఏం మామయ్యా! ఎక్కడనుంచి రావటం.'

'ఇంటివద్దనుంచే-ఇలా కూర్చో' - ఏదో



చిత్రం: "వైరం", మద్రాసు.

మొదలుపెట్టబోతున్నాడు.

'నాకేం తెలియదు మామయ్యా'అని నోరు జారబోతున్నా.

ఇంతలోనే మా అత్తయ్య అందుకొని 'ఉండండి అంతా హడావిడి కాస్త స్థిమితంగా చెప్పవచ్చులెండి' అని అదిలించింది.

ఎందుకనో అంత సీరియస్ మామయ్యా దిగజారి గుటక మ్రింగి ఊరుకున్నాడు.

'ఉండు కాళ్ళు కడుక్కో నీళ్ళు తీసుకువస్తా'నని లోపలికి వెళ్ళి ఛాయవున్న గదికి తాళంపెట్టి నీళ్ళు తీసుకువచ్చి యిచ్చాను.

ప్లాస్కులో కాఫీ ముగ్గురికీ యిచ్చి స్థిమితంగా కూర్చున్నాము. మా అమ్మ, అత్తయ్యా ఇల్లు చూచేవారులాగా లోపలికి వెళ్ళి నన్ను మెల్లగా పిలిచారు.

మా అమ్మ అడగలేక అడగలేక

'ఛాయ ఇక్కడకు వచ్చిందిరా ?' అని అడిగింది.

నా కాళ్లు చల్లబడ్డాయ్, కళ్లు కంగారు తింటున్నాయ్.

'ఛాయా-ఇక్కడకు రావట మేమిటమ్మా-ఏం ఇంటివద్ద లేదు !'

మా అమ్మ తెల్లబోయి 'ఇక్కడకూ రాలేదు !' అంది.

మా అత్తయ్య నోట్లో గుడ్డ కుక్కకొని కుళ్ళిపోతోంది. 'ఇంకా ఒక రోజు రాకపోతే నా కూతుర్ని ఏ నూతిపాలో గోతిపాలో చేశారు' వాపురుమంటూ మామయ్యదగ్గరకు వెళ్లింది.

'నువ్వు నోరుముయ్యి. నీ ఏడుపుతో నన్ను కంగారు చేస్తున్నావ్ అంటూ' మామయ్య మా అత్తయ్యని ఓదార్పుగా కసిరాడు.

మా నూతనదంపతుల్ని ఆశీర్వదించటానికి మా డైరెక్టరుగారు ప్రొడ్యూసరుగారు టాక్సీలో ఫోటోగ్రాఫర్ని వెంటబెట్టుకుని వచ్చేరు. దానివెనకాలే సినిమా బృందమంతా నాలుగు టాక్సీల్లోదిగారు.

మా డైరెక్టరుగారు నూతన దంపతులికి మా అభినందనలని ప్రొడ్యూసరుగారిచేతికి పెద్దబుట్టలోంచి రెండు దండలు తీసి యిచ్చారు !

ప్రొడ్యూసరుగారు చిరునవ్వుతో నా మెళ్ళో దండవేసి రెండోదండ చేత్తో పుచ్చుకున్నారు.

'దచ్చాంరా నాయనా-' మా మామయ్య మొఖంచూశా తెల్లబోయి నోరుతెరచి చూస్తున్నాడు. మెల్లగా లోపలికివెళ్లి తాళంతీసి ఛాయను ఇవతలకు తీసుకువచ్చా.

రామూ: 'ఏమిట్రా ఆ యెదురింట్లో పోట్లాట?'

గోపీ : 'ఎక్కే పోట్లాటకాదు. ఆ యింటాయన తనతో తనే మాట్లాడుకుంటున్నాడు.'

రామూ : 'మరి ఏమిటా అరపులు'

గోపీ : 'ఏం లేదు. ఆయనకు చెవుడు.

ఆమె మెల్లో దండవేసి ఆశీర్వచనం పూర్తి చేశారు ప్రొడ్యూసరుగారు. మా మామయ్య నోటినుండి ఏ అశుభదీవన వస్తుందో అని చెవులు నిక్కబొడచేవుంచాను.

మామయ్య ఇంకా తన నిశ్చేష్టత నుండి తేరుకోలేదు.

మెల్లగా ప్రొడ్యూసరుగారికి మామయ్యను 'ఇంటర్ డ్యూస్'చేశా. ప్రొడ్యూసరుగారు సవినయంగా నమస్కారాలర్పించారు. తప్పనిసరిగా నమస్కారమని బలవంతంగా చిరునవ్వొకటి నవ్వాడు మామయ్య.

'అమ్మయ్యా' చిరునవ్వు నవ్వుతోంటే మామయ్య మొఖం ఎంతో అందంగా వుందనిపించింది. పనిలోపని దంపతులిద్దరం మామయ్య కాళ్ళమీద పడ్డాం.

మామయ్య మండిపడి 'వీల్లేదు—మళ్ళీ పెళ్ళిజరగాల్సిందే' అంటూ చరచరా లోపలికి వెళ్ళిపోతున్నాడు.

రాముం మామయ్యను ఆపి 'మీరు వీల్లేదన్నా చెల్లదండీ రిజిస్టరు మేరేజి—ఇద్దరి సమ్మతంమీదనే జరిగింది.'

'ఎందుకు చెల్లదు — ఎలా చెల్లదో చూస్తాను. రిజిష్టరు మేరేజి చేసుకోటం మా ఇంటా వంటా లేదు. యథావిధిగా ఈ పెళ్లి మళ్ళీజరుపుతాను. లగ్గాలు పెట్టించి' గుడ్లు పెద్దవిచేసి రామాన్ని మింగేసేవాడులాగా అన్నాడు.

'బచ్చాంరా నాయనా' టపాకాయలాగా పేలిన నాగుండె కాయ మంత్రజలంతో కూడుకున్నట్లయింది.

చరచరా ఛాయను తీసుకొని ఇంటికి వెళ్లిపోయాడు. రెండురోజుల్లో లగ్గాలు నిశ్చయించి వెలిగ్రాంకొట్టాడు. ప్రొడ్యూసరు గార్కి డైరెక్టరుగారికీ ఛాయకూ నాకూ శుభముహూర్తాన స్వగృహంలో వివాహమని ఆహ్వానాలు పంపాడు మామయ్య. అందరం కలసి మేండుమేళాల మోతలో ఛాయకు నాకు మామయ్యచేసే 'మళ్ళీపెళ్ళి'కి ఘనంగా తరలివెళ్లాం. ★

అభినవ భగీరథుడు!

"అనంతం"

"నిత్య గోదావరీ స్నాన
పుణ్యదో యో మహామతిః,
స్మరామ్యాంగ్లేయదేశీయం
కాటనుం తం భగీరథం."

ఈ శ్లోకాన్ని పఠించినవారు చయనులు గారు. చయనులు గారు చయనం చేసి చయనులు గారయినవారే గాని మామూలు చయనులు గారు కారు.

సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. పదిగంటల ప్రాంతం. ఇప్పటినుంచీ ప్రారంభిస్తే కాని, మాధ్యాహ్నిక కృత్యాలు రెండు జాములకైనా తెమలవని, శ్రోత్రి కాలువలో ఆదరాబాదరా స్నానం చేసి, సంధ్యావందనాదికాలు ముగించుకొని, పిడిచిన నీర్కావిమడుగుధోవతిని నడికట్టుగా ఉంచుకొని, చెంబునిండుగా నీరు గ్రహించి, ఒడ్డెక్కబోతూ, కాలువవైపు తిరిగి, పై శ్లోకం పఠించి, కన్నులు నిమీలించి ఒకక్షణంపాటు, చేతిలో జలపూరిత కలశం ఉండగానే చేతులు జోడించి, ఒడ్డువైపు తిరిగి రెండడుగులు వేశారు; ఆగిపోయారు.

ఒడ్డుపైన ఆజానుబాహువూ, కమ్మచ్చున లాగి తంచిన వెండి తీగలవలే పలితమైన కేశజాలం కలవాడూ, అట్టివేయై, వెనక్కు త్రిప్పబడి గండుబయినా కాని మీసాలు కలవాడూ, సూటూ, బూటూ, హేటూ ధరించినవాడూ, ధవళధవళాంగుడూ ఐన ఒక పీముదొర నిలువబడి, అధికారం తేజోనిలయాలయినప్పటికీ ఆదర గౌరవవినయనికేతనాలయిన నేత్రాలను చయనులుగారిపై ప్రసరింపజేస్తూ, అచ్ఛ భారతీయ ధోరణిలో రెండు చేతులూ కలిపి నమస్కరించారు.

చయనులు గారు యత్కించిత్ చలితులయినా, సకలిత హస్తాలను జతపఱుస్తూ, 'శ్రీ రామార్పణమస్తు' అన్నారు.


దొరగారు తన ప్రక్కనున్న ఆయనతో చిఱునవ్వు నవ్వుతూ ఏదో అన్నారు. ఆ దొరగారి ప్రక్కనున్న ఆయన, ఖిళ్ళ కుచ్చులు పోని పంచెకట్టి, తొడిగిన చెవులు లేని అంగీ పైన పొడుగాటి కోటు వేసి, సన్నమల్లు పెద్ద పాగా చుట్టి, పైన వెడల్పంచుల కండువా వేసికొని ఉన్నాడు; అన్నాడు:

"అయ్యా! ఇందాక తమరు చదివిన శ్లోకాన్ని, దొరగారు మళ్ళీ చదవమంటున్నారు," అని.

చయనులుగారు విస్పష్టోచ్చారణతో మళ్ళీ పఠించారు. దొరగారి ముఖంపై ఆశ్చర్యానందాలు లాస్యమాడాయి. మళ్ళీ ఇంగ్లీషులో ఏదో అన్నారు. తిరిగి తలపాగా ఆయన ఇలా అన్నాడు తెలుగులో.

"దాని తాత్పర్యమేమిటండీ"

"నిత్యమూ గోదావరీస్నానం చేయటం వల్ల కలిగే పుణ్యాన్నిచ్చిన మహామేధావీ, ఆంగ్లేయ దేశీయుడూ, అభినవ భగీరథుడూ, ఐన కాటనుదొరగారిని స్మరిస్తున్నాను: ఇదీ దీని తాత్పర్యం"



సముద్రంలోకి వ్యర్థంగాపోయే నదీజలాలకు ఆనకట్టకట్టి ఆంధ్ర భూమి సస్యశ్యామలం కావటానికి తోడ్పడిన సర్ ఆర్థర్ కాటన్. వీరి ఈ కృషికి శతవార్షికోత్సవం ఇటీవల ఆంధ్ర రాజధానిలో జరిగింది.

తాత్పర్యాన్ని పాగా ఆయన ఇంగ్లీషులోని కనువదించారు. ఇక దొరగారు ఇంగ్లీషులో అన్నవాటిని పాగా ఆయన తెలుగు చెయ్యటమూ, చయనులు గారి మాటలను మళ్ళీ ఇంగ్లీషు చేయటమూ జరుగగా కథ నడిచింది.

"భగీరథు డెవరు? కాటన్ ఎవరు? ఈయన అభినవ భగీరథు డెలా అయ్యాడు? మీకు నిత్యగోదావరీ స్నానపుణ్యాన్నెలా ఇచ్చాడు?"

"భగీరథుడంటే, తన పితామహులకు ముక్తిని కలుగజేయటానికై అష్టకష్టాలూపడి, ఆకాశగంగను అధోలోకానికి తీసుకువెళ్ళి పితామహులను ఉద్ధరించిన అతిలోక పురుషుడు.

"కాటన్‌గారినిగురించి నాకంటే తమకే యెక్కువ తెలిసిఉండాలి. మాకు తెలిసినదల్లా, ఆ మహానుభావుడు ఆంగ్లదేశీయుడు పీముదొర. ఉద్యోగరీత్యా మా దేశానికి వచ్చినా, తీతపురాళ్ళందుకొని కాలం గడిపేవాళ్ళలో కలియక, ఈ దేశాన్ని పరాయిదేశంగా భావింపక, ఈ ప్రజలకింత అన్నోదకాలు కలిగించినవాడు. ప్రభుత్వంవారు మొదట అంగీకరింపకపోయినా, వారికి లాభం కలిగే హేతువులు చూపించి, ఒప్పించి అఖండగౌతమికి ఆనకట్ట కట్టించి మా దేశాన్ని సస్యశ్యామలం చేసిన సుకృతాత్ముడు.

"ఆకాశంనుండి అధిదమస్తకానికి, శివశిరస్సునుండి శీతాద్రికి, శీతాద్రినుండి భూతలానికి, అవనీతలంనుండి అంభోధికి, పాథోధినుండి పాతాళానికి వియద్గంగను తీసుకువెళ్ళటానికి భగీరథు డెంత శ్రమించాడో, ఎంత దీక్ష వహించాడో కాటన్ దొరగారు, సముద్రాభిముఖియైపోయే అఖండగౌతమిని బుజ్జగించి, తన మేధానేత్రప్రసరణం వెనుక నే ములకములకలుగా త్రిప్పి, అఖిల జనులనూ ఉద్ధరించేదిగా చేయడానికి అంతగానూ శ్రమించాడు; అంత దీక్షనూ వహించాడు; కనుక అభినవ భగీరథు డన్నాము.

"అంతకున్నా మించి ఆయన మాకు చేసిన మహోపకారం మరొకటి ఉంది. మాది కర్మభూమి. మాకు ఇహ సౌఖ్యాలకంటె పరమపదానందానికే ప్రాధాన్యం. కర్మిష్ఠులకు ప్రథమకర్తవ్యమూ ప్రధానమూ స్నానం. ఆ స్నానం జీవనదిలో అయితే శ్రేష్ఠం. అందునా అఖండగౌతమీజలంలో అయితే వేరే చెప్పాలా! మాకూ గౌతమీ మాతకూ చాలా దూరం. ఇదివఱకు ఏ పర్వదినాలలోనో మాత్రమే—అదయినా ప్రయత్నించి ప్రయాసపడితేనే గౌతమీ జలస్నానం లభ్యమయేది. ఎంత కర్మమీద నిష్ఠ ఉన్నా భుక్తి గడవాలికదా! అగ్రహారం విడువలేకపోయాం. గౌతమ మహాముని కున్నంత తపశ్శక్తి మాకు లేదు ఆమెను మా కాళ్ళదగ్గఱకు రప్పించుకోవటానికి. ఆ భగీరథుడు తన పితామహులను ఉద్ధరించుకోవటానికి గంగను త్రిప్పితే, కాటను దొరగారు మా పితృదేవతలనూ మమ్మూ ఉద్ధరించటానికా అన్నట్లు ఈ గౌతమీ గంగను మా యింటిప్రక్కకు పంపి మాకు నిత్యగౌతమీ స్నానఫలాన్నిచ్చారు. ఈయన అభినవ భగీ

★ అభినవ భగీరథుడు ★

రథుడు కాకపోవడ మేమిటి ?"

ఈ మాటలు వింటూన్నంతసేపూ దొర గారి వదనం వింతవింతగా అలతిఅలతిగా ఎఱుపుదనం వహిస్తూ ఉంది. పాగా ఆయన దొరగారిని చూపుతూ దయనులుగారితో ఏదో అనబోయారు. కాని దొరగారు వారించి ఇలా అన్నారు.

"ఆ కాటన్ గారు చేసినగొప్ప ఏముంది ? ఆయన ప్రభుత్వ యంత్రంలో ఒకసీల. జరిగిందంతా ప్రభుత్వపక్షానే. అదీగాక, అతని స్థానంలో, ఆ సమయంలో, ఎవరున్నా ఆపని చేయించేవారేమో ! అదతని విధి. తనవిధి తాను నిర్వహించి మంచి ప్రభుత్వోద్యోగి అనిపించుకొని ఉండవచ్చు. అంత మాత్రానికే ప్రాతః స్మరణీయుడు కావాలా అతడు ? నిజానికి మీ కృతజ్ఞతఅంతా ప్రభుత్వానికే చెందవలసి ఉంటుంది."

"మే మలా అనుకోము. ప్రభుత్వమనేది ఒకభావమనీ, మీ మాటలలో ఒక యంత్రమనీ, అందులో కాటన్‌దొరగారూ ఒకసీల అనీ అంగీకరిస్తాము. ఆయనస్థానంలో ఎవరు ఉన్నా ఆ పనిచేసేవారే అన్నారు. ఎవరు చేస్తే వారే మాకృతజ్ఞత నందేవారు. కాటన్ కాటన్‌గా కాక నిత్యమూ గౌతమీస్నాన పుణ్యఫల ప్రదాతగా నేస్మరింపబడుతూంటే. ఇతరులు ఉండటానికి అవకాశం ఉన్నపదవిలో ఉండటం ఆయనకేమీ అనర్హతను ఆపాదింపజాలదు.

"ఇక అది ఆయన విధిగదా అనేది. ఆయన ఆ ఉద్యోగంలో ఉన్నారు గనక ఆపని చేసే అవకాశం దొరికినమాట మరి వాస్తవం. అయితే, ఆయన్ని ఎవరూ గౌతమీనదిమీద ఒక ఆనకట్ట కట్టించవలసినదిగా ఆజ్ఞాపించలేదు మొట్టమొదట. పైగా, ఆయనకట్టిస్తే బాగుంటుందంటే పైవారు ప్రతికూలించారు. అందర్నీ ఒప్పించి కుయుక్తులు అన్నింటినీ త్రోసి రాజనీ, సర్వవిఘ్నాలనూ జయించి, ఈ మహాకార్యం చేశాడాయన.


"ఈ కృతజ్ఞత అంతా ప్రభుత్వానికే చెందాలన్నారు. ప్రజలనుండీ పన్నులేకొని వారికి సౌకర్యాలేర్పరచటం ప్రభుత్వ విధి. అందులో ప్రభుత్వానికి స్వార్థదృష్టి ఉండటానికి వీలు లేదు. ఈ ప్రభుత్వం అటువంటిది కాదు. తనకూ లాభంఉందని కాటన్ ఎన్నోవిధాల వాదించి చూపితే నేకాని ఈ పనికి అంగీకరించలేదు. ఈ ప్రభుత్వదృష్టిలో ఇది ఒక లాభసాటి వ్యాపారంతప్ప ప్రజలకోసం చేసితీరవలసిన పనికాదు. విధి విధానాన్ని అలా ఉంచి, కేవల లౌకికదృష్టినుంచి ఆలోచిస్తే కాటన్ లేనిదే ఈపని ప్రభుత్వం చేసేదికాదు.


"అలాటి కాటన్ మేధా, నిరంతరదీక్షా కారణంగా లభించే ఈ పుణ్యజలంలో నిత్యమూ స్నానం చేస్తూ, దానితో పితరులకు తర్పణాలిస్తూ ఆయన్ని స్మరింపకపోవటమా ? ఎంత ఆత్మభ్రంశం!"

దొరగారి కపోలాలు మరి అరుణితము లయాయి. వారు లజ్జాభరంతో అన్నారు.

"అయ్యా ! భారతీయులు ఇంత కృతజ్ఞులని నేననుకోలేదు. మర్యాదకు మాటల్తో కృతజ్ఞత చెప్పటంకాక తమ హృదయంలో అతనికి ఇంత శాశ్వతమందిరాన్ని ఏర్పరుస్తారనుకోలేదు. ఇంత అదృష్టవంతుడైన కాటన్ ధన్యుడు. అయ్యా ! ఇంకా నన్ను నేను మీనుండి దాచుకోలేను. నేనే ఆ అదృష్టవంతుణ్ని; కాటన్‌ను. తమ హృదయ వైశద్యమూ, వైశాల్యమూ చూచి—ప్రభుత్వాన్ని గూర్చిన తమ అభిప్రాయముతో ఏకీభవించలేక పోయినా—ముగ్ధుణ్ణయ్యాను. నా ఆనందసూచకంగా తమకొక నూరారులు సమర్పింపదలచుకొన్నాను. బంగారు

కార్టూను పోటీలో గెలిచిన చిత్రం





చిత్రం: శంకర్ - మద్రాసు.

విశేషక అసిస్టెంటు ఇంజనీరు గారిచేత పంపుతాను. తమరు తప్పక స్వీకరించాలి."

'నేనే కాటన్ నన్న' మాట వినగానే చయనులుగారు ససంభ్రమంగా రెండడుగులు వెనక్కు వేశారు. వాకొనగాని మహానందం వారిని పులకితులను జేసింది. కన్నులు మిల మిలలాడినాయి. చలితకుండలకాంతులు కపోలాగ్రాణిమలతో తళ తళ లాడినాయి,' అన్నారు.

"అబ్బ! ఎంత సుదినం! ఒక గ్రామానికి కాదు, పట్టణానికి కాదు—దేశానికల్లా అన్నదాత అయిన మహానుభావుడా నాతో ఇంతసేపూ నిలుచుని మాటాడి, నన్ను సూరాలు తెచ్చి సత్కరించ దలచినది! ఇంత అదృష్టం పట్టుతుం దనుకోలేదు. బాబూ! పరాకోక్తి తప్ప ఎఱుగని ఈ ఛాందసుని మాటలు మిమ్మల్ని ఇంతగా ఆకర్షించాయా! మీరింత సరసులా! ఇది పొగడటం ఎలాగ! కానటం ఎలాగ! తమవంటివారు తామై మెచ్చి యిస్తూన్నపుడు కాదనటం అవినయ సూచక మేమో! కాని, అవుననటం మట్టుకెలాగ? ఈ ఔదార్యం తమకు సహజమయినట్టే ఔచిత్య వివేచనమున్నూ; కనుక ఫరవాలేదు. అయ్యా! నేను చయనం చేసిన వాణ్ని; అప్రతిగ్రహణ నియమం కలవాణ్ణి; గ్రాసవాసోదైన్యం లేనివాణ్ణి; అన్యథా భావించకండి. చయనులు ఎటువంటివాడో ఈ మండలానికంతకూ తెలుసు."

దొరగారు చిన్నబుచ్చుకొన్నట్టు అయినారు. పోగా ఆయన అన్నారు.

"అయ్యా! చయనులుగారూ! తమరలా సెలవిస్తే గాదు. అంత గంభీరులయిన దొరగారూ ఎంత చిన్నబుచ్చుకున్నట్టయినారో చూడండి! వారు కాలువల్లోకి తొలిసారి నీరు ప్రవహించినప్పుడు కూడా మీ ఆ మాటలు విన్నప్పుడు పొందినంతటి సంతోషాన్ని పొందలేదు. ఆనకట్ట పని ఆగిపోయినప్పుడుకూడా మీరు గ్రహించననటంలో పొందిన ఖిన్నతను పొందలేదు. కాలువపై పర్యవేక్షణకు వచ్చి గుర్రాలను' బంగళాలో వదలి ఇలా వచ్చాము. అసలే మీవంటివారంటే వీరికి ఆసక్తి. మిమ్మల్ని చూస్తూ వడుస్తున్న వారు మీ శ్లోకము విని ఆగిపోయారు. తనపట్ల భారత జాతి చూపే కృతజ్ఞతకు చిహ్నంగా మిమ్మల్ని గుర్తించి ఉప్పొంగిపోయిన వారు దానికి గ్రుంకుపాటుగా చిన్నబుచ్చుకోవటం భావ్యమా? ఆలోచించండి పెద్దలు."

చయనులుగారు కనులు మూసికొని ఒక్క నిమిషం ఆలోచించారు; అన్నారు.

"సరే! తుని తగవుగా నా కొక ఉపమార్గం స్ఫురిస్తోంది. ఆ మహానుభావుడికీ తృప్తి కలుగుతుంది. నాకూ ఆనంద మవుతుంది. మా అగ్రహారానికి రామాలయం లేదు. అప్పుడప్పుడు ఏ ముష్టి ఎత్తయినా కట్టింతామా అనిపించేది. కాని, అగ్నిహోత్రం విడువ వీలులేక పడినది కాదు. సరే, ఈ నాటికి ఘటన ఉన్నది కాబోలు! దీన్ని అందుకు వినియోగిస్తాను."

(63-వ పేజీ చూడండి)

తెలుగు వెలుగులు-2



చలనచిత్ర ధరిత్రి చరిత్ర ముఖపత్రాన్ని గర్వకారణాల తోరణాలతో అలంకరించడానికి అక్షరక్రమాన పేర్ల ఎన్నిక చేస్తే 'భ' కారక్రింద బహుముఖ ప్రజ్ఞావతి భానుమతి పేరు చేరుతుందని సినీ జనులూ, సినీ జనాభిమానులూ కూడా అంగీకరిస్తారు.

నేటి సినీతారకు ముఖ్యమైన అందచందాలతో పాటు, స్వతంత్రమైన నటనా శిల్పం, నటనలో అనుభవాన్ని ప్రజలోకి తర్జుమా చేసుకోగల ప్రజ్ఞ, ఎత్తుకున్నా, అనుకున్నా, అనకున్నా, తలపెట్టిన ప్రతికొత్త పనీ అసాంతం చేసే సాహసం, చేసి ఆపైన పర్యవసానాలను తట్టుకోగల బలం ఆమె సొత్తు.

ఆయాసం లేకుండా హాయిగా, గాటిన్ దారంమీద మంచిముత్యంలా సాఫీగా, కొండమీద వాగులా చలాకీగా ప్రవహించే మధుర గానం ఆమెకు అమూల్యమైన కంఠాభరణం. భానుమతికి తమిళదేశంలో కూడా ప్రసిద్ధి కెక్కిన అగ్రశ్రేణి తెలుగు నటీమణులలో ప్రథమస్థానం ఉంది. అందుకు ఆమె సంగీతం కూడా ఒక కారణం. కర్ణాటక సంగీతం మీద ఆమెకు గల అభిమానానికి నిదర్శనం, తను తీసే ప్రతి చిత్రంలోనూ విధిగా ఒక త్యాగరాయ కీర్తన గాని వర్ణంగాని వినిపించడం. భానుమతి నటననూ, గాత్రమాధుర్యాన్ని కీర్తిస్తూ అనర్గళంగా ఉపన్యసించ గల వాటిలో మల్లీశ్వరి, విప్రనారాయణ చిత్రాలు ఎన్నతగ్గవి. ఆమెకు సంగీత రచనలో కూడా అభినివేశం ఉంది. చలన చిత్ర దర్శకత్వానికి సాహసించిన తొలి ఆంధ్ర మహిళ కూడా ఆవిడే. రచయిత్రిగా కూడా భానుమతి ఇటీవల కృషిచేసి, హాస్యరచనలతో అలరించింది. ఆమె కట్టెవాక్యాలు, ఆమెలాగే ధాటీగా, చురుకుగా నడుస్తాయని ఆమెను ఎరిగిన వారంటారు. ఆత్మవిశ్వాసానికీ అహంకారానికీ మధ్య సరిహద్దును జరపడానికి సంకోచించనివారు, ఒక్కొక్కసారి భానుమతి ధైర్యాన్ని ఆత్మవిశ్వాసాన్ని గర్వంఅనీఅహంకారమనీనిర్వచిస్తారు.

వినమ్రత మంచిదేగాని, అనవసరంగా లేనిపోని వినయం, నమ్రతఅభినయించడం తనకు గిట్టదని ఆమె అంటుంది. ఈ వైఖరితోనే, తనకు 'గిట్టని' పరిస్థితులలో ఆమె తెలుగు పరిశ్రమకు అంటకుండా ఎక్కువగా తమిళ చిత్రాలలో నటించడం జరుగుతోందని స్థితిగతుల నెరిగినవారు అంటారు.

నిజానికీ అంశాల నిజానిజాలూ సాధకబాధకాలూ సినిమా ప్రేక్షకులకు, సంగీత ప్రియులకూ సంబంధించినవి కావు; అయినా ఏది ఏమయినా, భానుమతి అతిసమర్థులైన తెలుగు కళాకారులలో అగ్రగణ్యఅనీ, ఆమె తెలుగుచిత్రాలలో ఇతోధికంగా కనుపించడం వాంఛనీయమనీ సినీపరిశ్రమ లోపలా ఇవతలా ఉన్న కళాభిమానులు కాంక్షిస్తున్నారనడం సత్య దూరం కాదు. ★

మద్రాసులో అమెరికన్ లఘు పరిశ్రమల ప్రదర్శనం



అమెరికా ప్రభుత్వ వాణిజ్యశాఖ మద్రాసు ఐలెండ్ మైదానంలో లఘు పరిశ్రమల ప్రదర్శనం ఒకటి ఏర్పాటు చేసింది. ఈ నెల 1 నుంచి 30 దాకా జరుగుతున్న ఈ ప్రదర్శనంలో వివిధ శాలలలో చూపుతున్న విషయాలు భారతదేశంలో చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి ఎంతో తోడ్పడగలవు.

ఈ ప్రదర్శనం జియోడెసిక్ డేరాలలో ఏర్పాటు చేయబడింది. వీటిలో పెద్ద గుడారంలో కొత్తరకం పనిముట్లతో చిన్న చిన్న పరిశ్రమలు సులువుగా తక్కువ వ్యయ ప్రయాసలతో ఎట్లా నిర్వహించవచ్చునో చూపుతున్నారు.

వ్యవసాయ శాలలో గోధుమతోనూ, జొన్నలతోనూ వివిధరకాల వంటకాలు ఎట్లా చేసేది చూపుతున్నారు. ఇందులో పాలపొడిని తిరిగి పాలుగా తయారుచేసే యంత్రం, ఇంకా పాడిపరిశ్రమకు పనికి వచ్చే ఇతర ఆధునిక పరికరాలు చూపుతున్నారు. మరొక గుడారంలో అమెరికన్ వ్యాపార, పారిశ్రామిక ప్రతినిధివర్గంవారు ఉండి అమెరికా వ్యాపారస్థులతో ఉమ్మడి వ్యాపారం చెయదలచినవారికి, అమెరికాలో ఎగుమతి, దిగుమతి వ్యాపారం చేయగోరే వారికి కావలసిన సలహాలు, సమాచారం తెల్పుతున్నారు. ఇక్కడే వాణిజ్య సమాచారం, పారిశ్రామిక పరిజ్ఞానం తెలిపే గ్రంథాలతో ఒక గ్రంథాలయం కూడా ఏర్పాటు చేశారు.

లోహపురేకుల విభాగంలో గ్రామసీమలకూ, జనసంఖ్య స్వల్పంగా ఉన్న ప్రదేశాలకూ ఎద్దుబండిపై సులువుగా తరలించ వీలయ్యే ఒక వెల్డింగ్ కర్మాగారాన్ని ప్రదర్శిస్తున్నారు.

బకెట్లు, అన్నిరకాలైన డబ్బాలు, సూర్యరశ్మి కుంపట్లు (సోలార్ ఓవెన్స్), ట్రంకుపెట్టెలు, అందమైన రకరకాల పెట్టెలు, లోహపు రేకులు తయారు చేసేటందుకు పనికివచ్చే సామగ్రినికూడా ఆ లోహపు రేకుల కర్మాలయ విభాగంలో చూపుతున్నారు.

24 అంగుళాల వెడల్పుగల 16 గాజ్ లోహపు రేకును కత్తించగల పెద్ద కత్తెరను అమెరికాలో తయారైన పనిముట్ల ప్రదర్శనలో ఉంచారు. దానితో యంత్రసహాయం లేకుండా చేతితోనే రేకులు కత్తిరించవచ్చును. ఆ ప్రదర్శనంలో, అనుకొన్న ఆకారంలో రేకును చుట్టే లోహపు రోలింగ్ యంత్రాన్ని చూపుతున్నారు.

లోహపు రేకు భాగాల బ్రాకింగ్, డ్రాయింగ్, ఎంబోజింగ్, మొదలైనవాటికి పనికివచ్చే పంచ్‌నికూడా ప్రదర్శిస్తున్నారు. అది లోహపు రేకులకు 4 రంధ్రాలు చేయగలదు.


లోహపురేకు భాగాలు రెండింటిని ఫ్యూజింగ్ ద్వారా వెల్డ్ చేసే స్పాట్ వెల్డర్‌ను ప్రదర్శిస్తున్నారు. సోల్డర్‌ను వినియోగించటంవల్ల అయ్యే అధిక ఖర్చు ఈ వెల్డర్ వల్ల ఎంతో తగ్గిపోవటమే కాక, త్వరగానూ మన్నికగానూ పని జరుగుతుంది.

ఇండియాలో లోహపు రేకు పాత్రల వినియోగం పెరిగిపోతూ ఉండడంవల్ల ఈ చిన్నతరహా పరిశ్రమ ఈ దేశంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ఈ యంత్రాలన్నీ సుమారు 17 వేల రూపాయలలో స్థాపించవచ్చును. దీనిని 10 మంది నిర్వహించగలిగితే, దానిలో తయారైన అమ్మకం, పంపిణీ మొదలైనవి చేయటానికి 30మంది పైగా కావలసివస్తారు.

సూర్యశక్తితో వంటచేసే విధానాన్ని రెండు వేర్వేరు రకాల కుంపట్ల ద్వారా ప్రదర్శిస్తున్నారు.

లాస్ ఏంజెలిస్‌కు చెందిన హాఫ్‌మన్ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ తయారుచేసిన సూర్యరశ్మి పోర్టబుల్ రేడియో రిసీవర్‌ను ఇండియాలో తొలిసారిగా ఇక్కడ ప్రదర్శిస్తున్నారు. ★



లఘు పరిశ్రమల ప్రదర్శనంలో రకరకాల పనులుచేసే "ఆల్" రంపం

రెండు గదులు

(గతవారం తరువాయి)

మరుసు ఆదివారం తొమ్మిదిగంటలకు వాసు రూముకని బయలుదేరాడు. వాసు అప్పుడే ఇక్కడకు వచ్చి రెండునెలలు దాటింది. అప్పటినుంచి తనింటికి డిన్నర్‌కు ఆహ్వానిద్దామని అనుకుంటూనే ఉన్నాడు. కాని జాప్యం అయిపోయింది ఆహ్వానించటంలో. తను అతడితో తీరికగా మాట్లాడే వదే లేదు. ఇవాళ ముఖ్యంగా అతడిని పట్టుపట్టి యింటికి తీసుకువెడదామని యెంతో ఆత్రంతో బయలుదేరాడు. తీరా గుమ్మం ముందు నిల్చుని లోపల ఉన్న దృశ్యానికి చకితుడయ్యాడు. వాసు పద్మమణి ఒకేసారి మధుకేసి చూశారు.

"నువ్వా!" అన్నాడు ఒక్కసారి మధు పద్మమణిని చూచి.

"ఆఁ. నే నే"అంటూ లోపలగదిలోకి వెళ్ళిపోయి తలుపులు చేర వేసుకుంది.

వాసు మధును, వెళ్ళే పద్మమణిని ఒక్క క్షణం వరకూ చూస్తూ కూర్చుండిపోయాడు. ఆఖరుకు "రా మధూ!" అంటూ ఆహ్వానించాడు.

మధుగుమ్మంముందే నుంచుని ఉత్సాహం తెచ్చుకుని "ఏంలేదు వాసూ! చాలరోజులయింది నిన్ను చూసి అని చక్కావచ్చాను" అన్నాడు. మాటలు తడబడ్డాయి కూడ.

వాసుకంతా అయోమయంగా ఉంది. "రా లోపలకు రా" అన్నాడు మళ్ళా. మధు లోపలకు వచ్చి బెడ్డింగుమీద కూర్చున్నాడు. ఇద్దరి అవస్థ ఒకే మోస్తరుగా ఉంది. ఎవరూ యేవిధంగానూ మాటాడలేక పోతున్నారు.

ఎవరి భావాలలో వాళ్ళు మునిగి తేలుతున్నారు.

ఆ భీకర నిశ్శబ్దాన్ని భరించలేక మధులేచి నిల్చుని "చూసి పోదామని వచ్చాను. అప్పుడప్పుడు వచ్చిస్తూండు భాయీ! అంతే. అంతకు మించి యేంలేదు. వస్తాను" అంటూ రెండడుగులు వేశాడు. డిన్నర్‌కు ఆహ్వానిద్దామనుకుని వచ్చినవాడు ఆమాటే మర్చిపోయాడు.

మధు యెందుకు వచ్చినట్లో యెందుకు పోతున్నట్లో బుర్రబద్దలు కొట్టుకున్నా అర్థమయింది కాదు వాసుకు. విడుతున్నానంటే అభ్యంతరం చెప్పలేకపోయాడు మరి.

చేర వేయబడ్డ తలుపులు తెరువబడ్డాయి.

"ఆగండి" అనే మాటలువిని మధు వెనుతిరిగాడు.

వాసు, మధులిద్దరూ పద్మమణికేసి చూచారు. ఏడ్చి ఏడ్చి ఆమెకళ్ళు వాచిపోయాయి. జుట్టు రేగిపోయింది. చెక్కిళ్ళమీద కన్నీటిచారలు స్పష్టంగా అవుపిస్తున్నయ్. ఆమె యీసారి వాసును ఉద్దేశించి "మీకు మతి లేనట్లుందే! ఇంటికొచ్చినస్నేహితుల నిలాగేనా మన్నించేది?... మంచి మాటలుచెప్పి పంపడం మంచివారి లక్షణం కాదు. ఉండమనండి ఆయన్ను, కాఫీతాగి

రామకృష్ణ

వెడతారు. పదినిముషాల్లో పట్టుకువస్తాను. స్టౌవలిగించేయడం కూడ అయిపోయింది" అంటూ లోపలకు వెళ్ళిపోయింది.

మధు ఆమాటలకొక యంత్రం మాదిరిగా వెనుతిరిగి వచ్చి బెడ్డింగ్ పై కూర్చున్నాడు.

పద్మమణి మాటలకు వాసు నిజంగా గాభరాపడిపోయాడు. తన్ను యీ వరకు ఆమె యింతలా మందలించలేదు. మధుయేం



"స్వామీ! ఆ పెట్టేదేదో కాస్త క్రాప్ చెరగకుండా పెట్టండి"

(ఎమ్. శంకర్రావు, అనకాపల్లి)

నొచ్చుకుంటాడో అనుకుంటూ తలవంచుకుని కూర్చున్నాడు.

రెండు గ్లాసులలో కాఫీ తెచ్చి వారి ముందు ఉంచి తిరిగీ లోపలకు వెళ్ళిపోయింది. మళ్లా తాగకపోతే యెక్కడ చూస్తుందో అనే భయంచేతనో ఎందుకోగాని మధు మారు మాటాడకుండా వాసుకంటె తొందరగానే కాఫీ తాగేసి లేచి "వెళ్ళొస్తాను వాసు!" అని అతడి సమాధానంకోసం యెదురు చూడకుండానే కనుమరుగయ్యాడు.

ఆ క్షణంనుంచి పద్మమణిలో యిదివరకటి ఉత్సాహం, చలాకీ అన్నీ మాయమయిపోయినట్లు అయిపోయాయి. ఆమెలోని యీ మార్పుకు దారులు ఊహించలేకపోయాడు వాసు. అసలు పద్మమణి, మధు ఒకర్నొకరు చూచుకోడంతోటే యెందుకంత బిత్తరపోయారో తెలీటంలేదు. మధు యీసారి యెక్కడయినా కన్పించినా ముభావంగా రెండు ముక్కలు పల్కి వెళ్ళిపోతున్నాడు. పద్మమణికూడ తనపట్ల మూకీభావంతోటే ప్రవర్తిస్తూంది. ఏదో తపనతో సతమతమవుతూన్నట్లు అవుపించేది. ఇదివరకామె కాలకృత్యాల నన్నిటిని చాల తొందరగా నిర్వర్తించుకునేది. ఇప్పుడు లేచేటప్పటికే యెనిమిదయిపోతూంది. తనే ముందులేచి స్టౌ వలిగించి కాఫీ పెడుతున్నాడు కూడ. అప్పుడిదా ఆమెను లేపేవాడు. ప్రతి విషయంలోను చాల పరాకుగా ప్రవర్తిస్తూంది. మధూ పద్మమణీ, వాళ్లిలో వాళ్లు యేం బాధపడినా మధ్య తనకు సంకట పరిస్థితి యేర్పడింది వాళ్ళ మనస్తత్వాలు జీర్ణించుకోలేక. పద్మమణి అన్నమాటలకు నొచ్చుకుని మధు తనమీద కక్ష సాధించటానికి ప్రయత్నిస్తూన్నట్లుగా అతడి ప్రవర్తనను బట్టి అర్థమయింది. ఒకరు చేసిన తప్పిదానికి మరొకరు ప్రతిఫలం అనుభవించటం యిదే తొలిసారిగా తెలుసుకున్నాడు.

ఆ రోజు సాయంకాలం అయిదుగంటల ప్రాంతాన వాసు ముందుగదిలో కూర్చున్నాడు సాలోచనగా. పద్మమణి లోపల గదిలో ఉంది.

"సలాం సాబ్!"

ఆ కేకకు వీధిలోకి చూచాడు వాసు.

"సలాం సలాం" అని "ఏం పనిమీద వచ్చావు?" ప్రశ్నించాడు లేచి నిల్చుని.

"అమ్మగారూ హున్నారా?" ప్రశ్నించాడు వాడు.

"ఏ అమ్మగారు?" అడిగాడు వాసు కాస్త చిరాకుగా.

"మణమ్మగారు"

వాడి ఆకారం చాలా నీచంగా ఉంది. గళ్ల లుంగీ, చిరిగిపోయిన లాల్చీ వేసుకున్నాడు, ఎఱ్ఱటి టోపీ ఒకటి వికృతంగా కన్పించింది. అన్నిటికీ మించి వాడి రంగు

రెండుగడులు

కౌరు నలుపు, రాక్షసిబొగ్గు నయం. పోటు మనిషి యెవడో వచ్చి మణమ్మ కావాలంటూ నేవిటీ అని ఆశ్చర్యపోయాడు.

పద్మమణి వారి సంభాషణ వినిపించి ముందు గదిలోకి వచ్చింది. కొయ్యలా నిలబడిపోయింది. నోట మాట రాలేదు.

"సలాం మణమ్మా!" అన్నాడా వ్యక్తి.

వాసు పద్మమణిని చూచి గాభరా పడిపోయాడు,

"మణీ! ఎవరో వచ్చారు" అన్నాడు సూటిగా చూస్తూ.

పద్మమణి లేనిఉత్సాహాన్ని అభినయిస్తూ "మీ కిన్నాళ్లుగా నే నేమి చేసున్నానో చెప్పలేగుకదూ? మీరు అడుగనూలేదు, ఈయన ప్రైవేట్ డిటెక్టివ్ రమణ. ఈయన దగ్గరే నేను అసిస్టెంటుగా పనిచేస్తున్నాను ...ఆ ఈయనిలాటి వేషాలే వేసి అందరి గొంతుకలూ కోస్తుంటారు. అంతే నేరస్థులనే లెండి" అంటూ గబగబా చెప్పేసింది.

కాబోసు అనుకొని వాసు "రండి లోపలకు" పిలిచాడు.

పద్మమణి మళ్లా వాసును చూసి "ఈయనిప్పుడో పెద్ద కేసు గురించి ఆమాకీ తీసున్నాగా లేండి" అంది.

ఆ వ్యక్తి తల ఆడించాడు. అవు నన్నట్లుగా.

అతడు లోపలకు వచ్చి "నీవల్ల యిప్పుడో పని కావలసుంది. బయటకు రా" అన్నాడు పద్మమణితో ఆజ్ఞాపించే ధోరణిలో.

అతను ముందు నడిచాడు.

"ఇప్పుడే వస్తాను వాసు! పది నిముషాలలో" అంటూ నీరసంగా నవ్వి వాడి ననుసరించింది.

ఎప్పట్టిలో యేం పోతుందో చెప్పటానికి యెవరికీ సాధ్యం కాదు. ఇప్పటివరకూ పద్మమణి ఒక సాధారణ యువతిగానే తన హృదయంలో స్థానం యేర్పరచుకొంది. కాని యివాళ్టి పరిస్థితినిబట్టి ఆమెది 'పరిశోధక నైజం' కూడా అని తేలింది.

పద్మమణి అస్తమానం డిటెక్టివ్ నవలలు చదువుతూంటటం వాసు చూస్తున్నదే, కాని దాని వెనక ఉన్న ఆంతర్యం యివాళ ఆమె ముఖతః వింటేగాని అవగతం కాలేదు. ఆమె నాదారి త్రొక్కించాడు భగవంతుడు; అందుకని ఆ వైపుకే ఆమె మనస్సు అస్తమానం మొగ్గుచూపుతుంటుంది.

పదినిముషాలలో వస్తానన్నది అరగంట గతించినా రాకపోయేటప్పటికి యేమిటో తెలియని ఆత్రం కలుగుతూంది. ఆమెకూ తనకూ మధ్య వాస్తవానికి ఉన్న సంబంధం

గాని బంధుత్వంగాని యేంలేదు. కాని ఒకరి కోసం మరొకరు తపించటంలోని అర్థం యేమిటో!

సుమారుగా గంటతర్వాత పద్మమణి వచ్చింది. వస్తూనే లోపలి గదిలోకి వెళ్ళిపోయింది. ఒక్క క్షణం తర్వాత "మణీ!" అంటూ కేకేస్తూ లోపలి గదిలోకి వెళ్లాడు. ఆమె పక్కమీద దొర్లుతూ వెక్కి వెక్కి యేడుస్తూంది. వాసు పిలుపుకు ఆమెకు స్పృతి కెక్కలేదు.

దగ్గరకు వెళ్లి ఆమె వీపుమీద ఆప్యాయంగా చెయ్యివేసి "ఏం జరిగింది మణీ!" అంటూ తట్టాడు.

ఆమె లేచి కూర్చుని ఉబికి వచ్చే దుఃఖాన్ని నిగ్రహించటానికి విఫల ప్రయత్నం చేసి రెండు చేతులతో ముఖాన్ని తుడుచుకుని "నువ్వా! అబ్బే; ఏం జరగలేదు... ఏదో యిలా బాధపడుతూండటం నాకు అలవాటై అయిపోయింది. దీనికై పెద్ద పట్టించుకోకు" అంది స్తిమితంగా కూర్చుని.

ఆమె ఏకవచనంలో సంబోధించటం యిదే తొలిసారి! అలా సంబోధించి మాటాడుతుంటేనే తన కానందం కలిగింది.

వాసు చేతిలోకి చేతిని తీసుకుని "పట్టించుకోకు అంటే తీరిపోయిందా మణీ! ...నేను నీగురించి యెంత బాధపడుతున్నానో నీకు తెలీదు. నువ్వొక్క పదినిముషాలలో వస్తానని గంటకయినా రాకపోయేటప్పటికి నేను అనుభవించిన ఆ వేదనయింతా అంతా కాదు. ఎందుకు నీగురించి నేనింత శ్రద్ధతీసుకోవాల్సి వస్తుందో నాకే అర్థంకాదు. నీ బాధలు నేను విని పాలుపంచుకోడానికి నోచుకోకపోతున్నా నే అవి తెల్సుకునేటప్పటికి నా మనస్సు ఆలోచన చెయ్యలేక నీరసత్వస్థితికి వస్తూంది. ఇద్దరం రూములో పార్టనర్సు అయ్యాం. జీవితాన్నే యిద్దరం ఒకరికష్టాలలో మరొకరు భాగం తీసుకుంటూ ఆనందానికి అవకాశం చిక్కినప్పుడు యిద్దరం ఏకంగా అనుభవించాలనే నిర్ణయానికి కూడ వచ్చాను" అంటూ ఆగాడు.

ఈ మాటల కామెకు పెద్ద ఆనందమేమీ కల్గలేదు; పైగా మరీ కృంగిపోతూ "నేనది జంగబోదని చెప్పటానికి యెంతో విచారిస్తున్నాను వాసు!" అంది కుండ బ్రద్దలు కొట్టినట్లు స్పష్టంగా.

"ఏం మణీ! నీకు నేను తగనివాణ్ణనా? లేక యింకేవైనా పరిస్థితులు...?" గుండెమీద చతికిలబడ్డాడు.

ఆమె కాస్త పేలవంగా నవ్వి "నువ్వు నాకు తగవన్నది కాదు ప్రశ్న; నీకు నేను తగనని మనవి చేయాల్సి వస్తూంది. నాచుట్టు అనేకగోడలు నిర్మింపబడి వున్నవి. వాటిని దూకి నువ్వు నన్ను చేరి నీ జీవిత సహభాగినిగా చేసుకోవడమన్నది వట్టి కల్ల. అలా యెన్నటికీ జరగదు. జరగటానికి యేవిధంగానూ అవకాశాలుకూడ లేవు. అసంభవమయినదాన్ని సంభవంగా 'చేయ్యూవడమంత తెలివితక్కువ మరొకటిలేదు" అన్నది.

వాసు కాస్త విరక్తితో "నన్ను యెందుకింత బాధ పెడతావ్ మణీ! ఉన్న విషయం విప్పిచెప్పి వివరించకూడదూ? ఆ రోజు మధు వచ్చిన దగ్గర్నుంచీ చూస్తున్నాను. మీ ఇద్దరూ నన్నెందుకింత అవస్థ పెడతారు?" అన్నాడు.

పద్మమణి పెద్దగా నిట్టూర్చి "ఇవాళ నీకు ముఖ్యంగా చెప్పక తప్పదు. ఇంతకాలం నా ఆటలు సాగాయ్... నేనొక కులటను... వేశ్యను భాయీ!" అంది.

"ఆ! మరింతకాలం నా కళ్లలో దుమ్ముకొట్టావా?" అనేమాటలు అతని నోటినుండి ఊతగా బయటపడ్డాయి.

"ఆవేశపడకు వాసూ! నేను చెప్పేది పూర్తిగా విన్నతర్వాతే నువ్వు నాకే శిక్ష విధించినా సిద్ధం కాగలను. నీకు నేను తీరని ద్రోహం చేసినమాట వాస్తవమే. దీనికి లక్షక్షమాపణలు చెప్పుకున్నా తీరేది కాదని నాకు తెలుసు. నేను జన్మించినది వేశ్యకులంలోనే. అవలంబించినదావిద్యే. అయిన వాడికీ కానివాడికీ దాసోహం చెయ్యాలి వాడిచ్చే డబ్బులకోసం. ధనమదాంధులూ వస్తుంటారు, గుణహీనులూ వస్తుంటారు. కవులు వచ్చి పద్యాలలో ప్రశంస చేస్తారు, కళాకారులు చిత్రాలలో నిరూపిస్తామంటారు మా అందాన్ని. అయినా అది హేయమయిన జీవితమే. తాగి వస్తాడొకడూ;

గోపీ: "బ్రదర్ కంచరగాడి దను చూడాలని ఉందిరా. ఎలా ఉంటుందో - ఎప్పుడూ చూడలేదు."

రామూ: గోపీ, "ఎప్పుడూ చూడలేదా-చూసినా గుర్తించలేదా"

గోపీ: "ఎప్పుడూ చూడలేదురా."

రామూ: "నీబొంద రోజూ అద్దంలో చూసుకుంటూనే వున్నావుగా. ఇబ్బందల్లా కనిపించేది గాడిదని గుర్తించక పోవడం."

★ రెండు గదులు ★

వాసు ఆ మైకంలో తిన్నాతాడు, పడవలసిందే. ఎవడి ఆజ్ఞ అయినా ఆ డబ్బుకోసం తల దాల్చి నెరవేర్చాలి. నాయకురాలు అజ్ఞానుసారం నడివీధిలో గజ్జకట్టి నాట్యంచేయాలి. మేమా కులంలో పుట్టడం మా దోషం. మాకొకవేళ ఆ వృత్తిమీద యేవగింపు కల్గినా బలవంతంగానయినా ఆ విద్యని అవలంబింపచేసే దుష్గ్రహాలు వుంటారు. వాళ్ళు తురక దయ్యాలకుమల్లే మమ్మల్ని పట్టుకుని పీడించి పిప్పిచేస్తుంటారు. అలాటివాళ్ళ కోవలోకి చెందినవాడే ఇందాక సాహేబ్ వేషంలో తయారయి వచ్చినవాడు." ఆగిందక్కడ.

"వాడెవడో ప్రయివేట్ డిటెక్టివ్ అన్నావే?" అన్నాడు అదోలా చూస్తూ.

"అలా అంటేగాని నువ్వు నమ్మవు కనుక. ఇంచుమించు డిటెక్టివ్ చేసే పనే వీడు చేసేది కూడ.....వృత్తి మీద విరక్తి పుట్టి బయలుదేరాను. అందరి కళ్ళూ కప్పి దూరంగా మసలవచ్చు అనుకున్నాను. కాని అది యింత అసాధ్యమైనదని నాకు మొదట్లో తెలిసిందికాదు ... అన్నట్లు మీ స్నేహితుడు మధు కూడ ఆ పరమసుఖమేదో పొందుదామని వచ్చి ఇరవై రూపాయలిచ్చి వెళ్ళిపోయినవాడే" ఆగింది.

ఆమె మాటలు ఒక్కొక్కటి ఒక్కొక్క ములుకులా హృదయానికి తగిలి బాధ పెడుతున్నాయ్.

పద్మమణి ఈసారి లేచి తన సామానంతా సర్దుకుంది. వీథిలోంచి కాలీరిక్షా వెళుతుంటే పిల్చింది. అందులో సామానుపడేయించింది.

"నన్నిలా వట్టేట ముంచి వెళ్ళిపోతున్నావా మణీ! అంగులోనూ యీ అసలు సందెవేళ" అన్నాడు అధికమించే వ్యథతో.

పద్మమణికూడ ఉబికి బయటపడనుంకించుచున్న కన్నీటిని బలవంతంమీద ఆపుకుంటూ "నిజం తెలిసిపోయాక మనిద్దరం జీవించటం కష్టం వాసు!...నామీద యెన్నో ఆశలు పెట్టుకున్నావ్. నీ జీవితపు పథాన్ని పూలబాటగా చేసి ఆనందింపచేసి కోటి స్వర్గాలను కల్గిస్తాననుకున్నావ్. ఆ ఆశలన్నీ అడియాసలయిపోయాయి...చివరకు ఇలా విడిచిపోతున్నందుకు నాకూ బాధగానే ఉంది. ఏమీ చెయ్యలేని అబలను. నా జీవితంలో మిమ్మల్ని మర్చిపోలేను. నా హృదయం ఎక్కడవున్నా మీ శ్రేయస్సునే ఆకాంక్షిస్తుంది. వెళ్ళిరానా మరి?" అన్నది.

మాట పెకిలిరాలేదు వాసుకు. తుదకు "వెళ్ళి రా" అన్నాడు రుద్ధకంఠంతో. రిక్షా నీరసంగా కదిలింది వీథిలోనుంచి...

మధు వచ్చాడు వాసుకామె వేశ్యఅనేది రూఢిగా చెప్పేద్దామని. తీరా తను చెప్పనవసరం లేకుండానే పద్మమణి, పద్మమణి సామానుతో రిక్షా తరలిపోతూండడం చూచి ఒక్క నిటూర్పు విడిచిపుచ్చి వాసు రూములోకి వచ్చాడు.

"కూర్చో మధూ!" అన్నాడు వాసు.

మధు కూర్చుంటూ "ఆమె వెళ్ళిపోతూందేం?" ప్రశ్నించాడు.

వాసు గాద్గదికంగా "వెళ్ళిపొమ్మని నేను చెప్పలేదు మధూ! వెళ్ళిపో నిశ్చయించుకుంది. వచ్చేటప్పుడెంత హఠాత్తుగా వచ్చిందో, ఇప్పుడూ అలాగే వెళ్ళిపోయింది" అన్నాడు.

మధు నేలమీద వేలితో రాస్తూ "నేనొక విషయమై నిన్ను హెచ్చరిద్దామని వచ్చాను. కాని అవసరం లేకపోయింది. కుమ్మంలోనే అయిపోయిందాపని" అన్నాడు.

"నాకు తెలుసు మధూ! నువ్వు చెప్పదల్చుకున్నదేమిటో; అది ఆమె చెప్పే వెళ్ళిపోయింది. చిత్రమేమిటంటే ఆమె నాతో కలిసి జీవించిన యీ కొద్ది రోజులలోనూ వేశ్యగా తెల్సుకోలేకపోయాననే. ఆ సంస్కారం, ఆ వాక్చాతుర్యంవల్ల ఎవడూ ఆమెను వేశ్యగా అనుకోలేడు. నా విషయంలో కూడ అంతే. ఆమె తను వేశ్యనని చెప్పుకున్నప్పటికీ నేనామెను ఆ దృష్టితో చూడలేకపోయాను. ఆమె నా హృదయంలో కులస్త్రీగా స్థానం ఏర్పరచుకుంది గాని, కులటగా కాదు భాయి! కులటగా కాదు. ఇకముందెప్పుడయినా తారసపడ్డా ఆమెను హీనదృష్టితో చూడలేను" అన్నాడు


మధుకూడ జాలిగా "ఆమె ఒక అభాగ్యజీవి. ఆమె కా సంస్కారం జన్మాంతర సుకృతంవల్ల కల్గిననే. ఆమెను చూచి జాలిపడతాం; ఇంకా నీవంటి సహృదయుడైతే విలపిస్తాడు ఆమె అధోగతికి. అంతకుమించి ఎక్కువ సానుభూతి ఆమెపట్ల మనం చూపగల్గేదేదీ లేదు" అన్నాడు.

ఒక పదినిముషాలు కూర్చుని మధు వెళ్ళిపోయాడు.

వాసుకు ఆ రాత్రి భోజనం చెయ్య బుద్ధి కాలేదు. వెనక గదిని చూచినప్పుడల్లా ఏవో వెనకటి స్మృతులావరించి ఆవేదనపాల్జేసేవి. ఆరాత్రి ఎన్నోసార్లు ఏడ్చాడుకూడ.

మర్నాడు ఆ దుర్భర వాతావరణానికి తట్టుకోలేక రెండు గదులూ ఇంటివారికి హాండోవర్ చేసేసి లాడ్జింగు హోటలుకు మార్చేశాడు!! ★

ముళ్ళపూడి వెంకటరమణ



నువ్వాకథ వినుండవులే. చేబదులు చెంచయ్యని పిలిచేవారు. ఒకటిగానీ రెండుగానీ నోటిమాట లేదప్పు నోటుమాట లేకుండా పుచ్చుకోడం అతగాడి పెద్ద అబ్బో. ఇప్పటికథా. నువ్వు మీ అమ్మ కడుపున పడడానికి పూర్వ రంగానికి మాట. ఎందుకు గుర్తుండిపోయిందీ అంటేను. మీ అమ్మకి సీమంతం జరిగే రోజున, నాదగ్గరకొచ్చి పాతిక వేలు చేబదులిస్తావా బావా అన్నాడు. చెప్పొద్దూ నాకు నవ్వొచ్చింది. అలాగే ఇంకాసేపు ఊసులాడి నవ్వించి, పాతిక రూపాయలు పట్టుకపోయాడు. జ్ఞాపకం వచ్చింది విను.

చెంచయ్య, ఇలాగే మేలమాడినట్టే, ఏడుకొండలని ఒక పెద్దకాపు దగ్గిర నాలుగొందలు చేబదులడిగాడు. ఏడుకొండలు డబ్బు వడ్డీకి తిప్పేవాడే అనుకో. అయితే ఎంత హెచ్చరిగ్గా నిర్వాకం చేసేవాడనీ. ఓబ్బో. ఆకలింపమని పేగులు లెక్కెట్టేసుకునేవాడు మళ్ళీ మనిషి మాయిగిలపడకుండా. అప్పుడూ శతకోటి లెక్కలు చెప్పి ప్రాణాలు తోడేసి మరీ విదిపేవాడు డబ్బుని. వసూళ్లు కూడా అంతే. రాక్షసుడే. అయితే ఒహాసుగుణం. ఆమాట ముందే చెప్పేసేవాడు. ఏది. ఇలా నేను రాక్షసుడినిబావా అని. ముందుముందు ఎలాగా వ్యవహారం చెడుతుంది. వాడే లాగా విన్లో కాబోలీ దెయ్యం అంటాడు. అప్పుడు వీడు, నేను మొదటే చెప్పానుగా నాకూ తెలుసు అని నవ్వి మరీ కుప్పమీద పంట, అవసరమైతే పైమీది బట్టా కూడా ఎగరేసుకు పోయేవాడు.

ఏడుకొండలికి ఒక్కగానొక్క బిడ్డడు. వాడికోసారి వాతంకమ్మి ప్రాణమ్మీదికొచ్చేవరకు చెంచయ్య రాత్రికి రాత్రి మూడామడదూరం వల్లకాటికి డపడి పోయి దేవరగార్ని ఉన్నపళంగా లేవదీసుకొచ్చి మందు పోయించి పోయే ప్రాణానికి చక్రం వేసి అడ్డై నిలబెట్టాడు. ఆవిశ్వాసం ఏమూలో నిలదొక్కుకుంది ఏడుకొండలికి.

అదో, మరి ఇంకేకళ నున్నాడో, రెండు పుంజీల అప్పుకి చెంచయ్యగాడు నాలుగొందల కౌడ చేరం పెట్టగా, తీసుకో బావా నీకు చర్మం చెప్పులు కుట్టిచ్చినా ఋణం తీరుద్దా అంటూ వడ్డీగిడ్డీ వద్దులే అంటూ ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ వల్లమాలిన వరాలూ షరతులు, పెట్టకుండా నాలుగు పెద్దనోట్లూ వాడిచేత పెట్టాడు. పంట దింపగానే మళ్లీ ఇచ్చెయ్యాలని మటుకుమాటనేసుకున్నాడు. నెత్తిమీద పున్నమి చంద్రుడూ, బండి నీడలో నేనూ, కొంచెం అసంటా-అరుగో నీ పెళ్లాం నిలబడ్డంత దూరాన, ఏడుకొండలు ఇంటేది సాక్ష్యం.

మూడు తిరిగి నాలుగో పున్నమొచ్చేనాటికి రొఖ్ఖం సర్దుబాటవుతుందనీ తప్పకుండా ఇచ్చేస్తాననీ, వడ్డీకూడా పదో పాకో ముట్టచెబుతాననీ సత్తెప్రమాణకం పెట్టాడు చెంచయ్య. ఇలా ఆపదకి అడ్డుపడ్డందుకని కంట తడిపెట్టాడు కూడా.

చెంచిగా, నీకు అంత డబ్బెందుకురా, ఆడిస్తనాడని నువ్వు తీసుకుంటన్నావా, నిజంగానే కావాలా అనక మల్లా ఇచ్చుకునేటప్పుడు బగవవద్దని నేను ఓమూలనసిగాను. ఛఛెన్ నీకేట తెలుసు నా అవుసరం అని ఎగిరాడు. ఏడుకొండలు కూడా ఏమనుకున్నాడో మరి, ఓసి బావా, కొంచెం ముందెనకలు చూసుకు మరీ తీసకోడం మంచిదిగాదా, అనక ఈడిచేకేడుకోండతే గాని, పుట్టెడు వాయాల, కాబూలీజీబూతం అనగలవు. చూడుమరి అన్నాడు పరాచికంగా అన్నట్టు.

కాదు కూడ దంటూ అపురుబాపురని రొఖ్ఖం లాగేసుకు రొండిన దోపేసుకున్నాడు చెంచయ్య

ఏమోలే. పిల్లా జెల్లా ఉండే పెగా రొండు కాపురాలాయె. ఆడికేటి అవుసరమో మనకేల అని నేనూరుకున్నాను.

నేననుకున్నట్టే అయింది. వారం తిరిగేసరికి పెద్దావిడ అక్కొ ఒత్తులవాడింటిమీద పడి గుమ్మెత్తిపోస్తోంది. చిన్నామెకి పట్టెడ పురమాయించినపుడు నాకేల జెప్పలేదూ అని. తరవాత సవతులిద్దరూ తగవులాడుకున్నారు. నీకు పిల్లా జెల్లా లేరు. గొడ్రాలివి... నీకేం కులుకుతవు నీకు దోచిపెట్టే అప్పుల్లోనా కొంపగుండం చేస్తున్నాడు అంది పెద్దామె. ఆపైన ఏడుకొండల్ని కూడా తూర్పారబట్టేసింది.

వింత జెబుతా విను. ఇంతపోరూ అయేసరికి, చెంచయ్యకి ఏడుకొండలుమీద మనిషి కొచ్చినంత కోపమొచ్చేసింది. ఈ యెదవనాయాల ఇయ్యమటిగదా నేబుచ్చుకున్నా, దానిమూలా నేగదా చిన్నమ్మకి పట్టెడ చేయించడం, పెద్దమ్మకి ఉసురుపెట్టడమూను అని ఆవాడినా తావడనా అన్నాట్ట. ఏడుకొండలికి పౌరుష మేసుకొచ్చింది. న్యాయ్యాల నేనొద్దు మొర్రో అంటే పేణం కడంటేలా పీక్కుతినేశాడుగా ఎయ్యా అన్నాడు కాని ఎంత రాక్షసుడైనా మంచిముండావాడేమో తమాయించుకున్నాడు. చెంచయ్యకి మట్టుకు కోపంపోలేదు ఇంతపోంచనజేసి నన్ను పెడదారిన పెడతాడా. ఇలా ఎన్ని కొంపలు కూలిపోతునాయో అని నచ్చజెప్పుకున్నాడు.

అంచేత డబ్బు చేతికందినరోజున ఏడుకొండలు గుమ్మానికొచ్చి పిలిచేవరకూ చెంచయ్యకి డబ్బు వదులుకో మనసు కాలేదు. మనసు నీరుగారిపోయింది. చచ్చి చెడి గడించిన డబ్బంతా పీడెదాన ఒక్కసారి గుమ్మరించాడమేవిటని విసుక్కున్నాడు. ఆపైన మళ్ళీ ఏమనుకున్నాడో ఏం జాలిపడ్డాడో లేకపోతే ఏడుకొండలు కండలు చూసి ఇంకేమన్నా అనుకున్నాడో మొత్తానికి శాంతంగానే ఈవలకొచ్చి, కూచోమని దాహం అడిగి, కుశలంజెప్పి, బావా ఒక్కిన్నపం అన్నాడు

ఏంది చెంచయ్యా అన్నా డేడుకొండలు కులాసాగా

మరేంలేదుబావా. నగదేమో చేతికొచ్చినమాట రైటే నీకు దల్చినుకో. కాని ఇప్పుడేగదా అందిందీ, ఇంకా సరిగ్గా లెక్కెట్టి కూడా చూడలేదాయె అంటంది నీ చెల్లెమ్మ అంటూ నసిగాడు.

ఏడుకొండలు నవ్వాడు కాని మాట జారలేదనుకో.

అయినా ఆకాస్త నవ్వే దొరకబుచ్చుకుని వుంటున్నాడు. రెండ్రోజు ఇంట్లో వుండు కుని, నిదనీకు పువ్వులో బెట్టిచ్చెయ్యనూ అంగు లోకానీ ముట్టుకుంటే ఒట్టూ...మరేం లేదు. మాలక్ష్మి ఇలా కొంపలో అడుగెట్టిందో లేదో అప్పుడే మళ్ళగొడితే మనసు పీకుతా దని బుల్లెమ్మ ఇదవుతంది అన్నాడు

సర్లె. నీమాటెకాదనీయ్ అంటూ చెంచయ్య బుడాడి బుగ్గపుణికి, చేతిలో జీళ్ళపొట్టం వాడచేతపెట్టి వెళ్ళిపోయాడు

రెండ్రోజులు తరవాత మనింటిదగ్గిర జత పడ్డారిద్దరూ. అప్పుడే నాకీబాగోతం అంతా తెల్సింది. నన్ను చూడగానే ఏడుకొండలు చాటుకి బిలిచి, బావా, నీ డబ్బు అలాగే ముగ్గుపుట్టుంది దయ్యావ్! అన్నాడు చెంచయ్యా తెచ్చిపెట్టుకుని.

సరేమంటావు. నేనువచ్చేట్టా మాపిటేకి నువ్వు దెచ్చేట్టా అన్నాడు ఏడుకొండలు

మాపిటకే గావాలంటావా పిల్లలు పెట్టేదేటి అన్నాడు చెంచయ్య చనువు దీసుకుని

యూడవబోయి బావుండదని నవటాలంటే ఏవిటో ఏడుకొండలు మొగం చూడగా నాకానాడు తెల్సింది.

యాడాది రెక్కలకష్టంగందా, అంగులో ఒక్కరూపాయి డబ్బులెట్ట పప్పూ వణ్ణవూ సుబ్బరవైన కూరా చేసుకుదిన్న పాపాన పోలేదూ మన వేఁసెత్తా ఇత్తే అన్నకిమట్టు లేని సుకవూఁ అంటే దయా చెల్లెమ్మ అని నసగాడు చెంచయ్య.

ఏటో మీ వాదసాలు మరీ సిత్రంగున్నయ్యి అంటూ వెళిపోయాడు ఏడుకొండలు.

వారం తిరిగాక ఓరోజు మద్దేనేళ చెంచయ్యింటికెళ్ళాడు ఏడుకొండలు.

ఎండనిపడొచ్చావేటి సెపాలన్నాడు చెంచయ్య

కొత్తవేటున్నాయిగనక అన్నాడు ఏడుకొండలు గుంబనగా.

పాతవిమటు కేవున్నాయి అన్నాడు చెంచయ్య ఇంకా తొంగుక్కుండా.

—ఆ డబ్బు కోకా—అని మాట జారేసింది బుల్లెమ్మ.

శాస్తరం జెప్పినట్టుందీ, బావకి సమానూ అదే జూసనుకున్నవేటి మన్లాగ అన్నాడు చెంచయ్య—నవ్వినా పెళ్ళాంకేసి కొరకొర జూసి.

మీ సంగతేవోఁ నాకెరుకలేదు గాని, నాకు మటుకు డబ్బుగావాలయ్యోయ్ అన్నాడు ఏడుకొండలు.

అంత మోటగా తీసుకుపోవద్దని బతిమలాడాడు చెంచయ్య ఇంట్లో తెచ్చి పదిరోజులైనా ఉంచుకోకుండా యిస్తే మన సొప్పటింలేదన్నాడు. ఎలాగా ఇచ్చేసేదే గదా అన్నాడు ఇంకొక పదిరోజులుఉండనీ అన్నాడు.

సరేనన్నాడు ఏడుకొండలు. పది వెళ్ళాక పదకొండ్రోజున అడిగితే, ఇవాళ సుక్కురారంగదా మూన్నాసి మాలక్ష్మిని ఎలా పంపుకోను అన్నాడు

శనివారం నాడు ఏడుకొండలు గుమ్మంలోకొచ్చేసరికి, చూడనట్టూ లోపల కూర్చుని తలుపేసుకుని, పెళ్ళాన్ని బిలిచి, ఆ శనిగాడొస్తాడు డబ్బెక్కడుందో చూసుకుని గట్టిగా పురమాయించాడు.

ఏడుకొండలికి ప్రాణం నీరుగారిపోయి వచ్చినవాడొచ్చినట్టే వెనక్కెళిపోయాడు.

ఆదివారం నాడు చెంచయ్య సంతకెళ్ళాడు.


సోంవారన్నాడు చెంచయ్య బుల్లోడు, ముంతెడు రూపాయలూ కలబోసుకు ఆడుకుంటున్నాట్ట వాణ్ణి ఏడిపించడం ఎలా! సరే మంగళారంఎలాగేనా మంగళారంగదా. బుదవారం నాడు మటుకు, ఇదుగో పద బావా నీ వెనకాలే వస్తున్నా, ఎంతేనా కష్టార్జితం చూడు అన్నాడు చెంచయ్య.

నాదిమటుకు కాదేటి అప్పనంగా వచ్చిపడబాపతనుకున్నావా అన్నాడు ఏడుకొండలు.

అంత మాటన్నావా. శాంతపడు అన్నాడు చెంచయ్య నవ్వి అప్పనంగా వచ్చింది, అప్పలాళ్ళ కడుపుకొట్టి కొంపలార్పి, వడ్డీలుగా పోగేసింది కాపోతే ఇది కష్టార్జితమా ఏవిటని మనసులో అనుకున్నా. అంగుకని తన కష్టార్జితంమీద జాలేసింది. పాపం అనుకున్నాడుకూడా. మొత్తానికి బుదవారం నాడు ఏడుకొండలు వెనకాలే డబ్బు మోసుకొస్తానన్నాడు గాని అంతపని చెయ్యలేదు. వల్లాడు కబుర్లు చెపతావుంటే, సరదాగా కూచుండిపోయాడుట.

లక్షింవారం, సుక్కురారం, శనివారం ఏడుకొండలు అటువేపెళ్ళనేలేదు ఆదివారం నాడు చెంచయ్యే కబురెట్టాడు ఏడుకొండలికి ఒక్కసారి చూసి పొమ్మని.

ఒంట్లో నలతగా ఉంది బావా. పులపగం దగలెం దంతకన్నేంలేదని బుల్లెమ్మంది గాని ప్రాణం బేజారుగా ఉంది. నేనే పైకం



"బావా ఇవాళ పైకం జతపరుస్తానన్నావు ఇస్తావా?" అన్నాడు ఏడుకొండలు, చెంచయ్య గుమ్మంలోకొచ్చి.

★ ఋణానందలహరి ★

అద్ధామనుకున్నాను. గాని వల్లనయిందిగాదు అన్నాడు చెంచయ్య నీరసంగా.

ఏడుకొండలికి తలకొట్టేసినట్టయింది. ఇన్నాళ్ళూ అందరూ, అందరితోపాటు తనూ, తనని యములాడన్నా నవ్వేసేవాడు. ఈసారి నిజంగానే తను యముడు అయినట్టనిపించింది. ఆ రోజుల్లో ఉంటుండి మీసం తడుము నేవాడు. దున్నపోతుకి, బర్రెలకీ దూరంగానిలబడేవాడు నిజంగానే తను యముడేమోనని భయందగిలిచెస్తున్నట్టే ప్రాణం విలవిల్లాండేది.

అలాగే కానీ అన్నాడు దిగులుగా.

మరేంలేదు. కొంపలో నాలుగు రాళ్ళున్నాయన్న ధీమా చూడూ, అదే పది మందులపెట్టు. పత్తెం దినగానే-అన్నాడు చెంచయ్య.

పదిహేనురోజులిగ్గాని పత్తెం దిన్నట్టు పల్లీకున ఒప్పుకున్నాడుగాదు చెంచయ్య.

ఈలోగా ఏడుకొండలు డబ్బుకి రొక్కసంపడ్డా నోరుమూసుకున్నాడు.

ఆ తరవాత అతను నోరెత్తినరోజుని చెంచయ్య గజగజలాడిపోయాడు మార్గశిర మాసంలో గోదాట్లో స్నానంజేసినాడిలా.

అంతలా నోగుపారేసుకున్నందుకు ఏడుకొండలికే మళ్ళీ మనసెలాగో అయిపోయి శాంతపడి ఇంటికెళ్ళిపోయాడు.

మన్నాడు, అతన్ని వాకిట కూచోబెట్టి చెంచయ్యా, బులెమ్మా చెరోవెంపూజేరి ఓదార్చారు. మరేం ఫరవాలేదు. తిడితే తిట్టావు, మేం కోపంజేసుకోంలే అన్నారు. నువ్వుగాపోతే మరెవరు తిడతారన్నారు. మరోడు తిడితే ఊరుకుంటామా అన్నారు. ఊరుకునేది లేదనికూడా ఖచ్చితంగా చెప్పేశారు. ఆనక, చెంచయ్య డబ్బుసంగతి కూడా మెల్లిగా నచ్చజెప్పాడు.

ఏడుకొండలికి వెంటనే ఆ నాలుగొందలూ ఇవ్వడానికి అభ్యంతరం లేనిమాట నిజమేట. కాని అంత దూకుడుగా వెళ్ళి ఆ నాలుగొందలూ చక్కబెట్టే రాచకార్యాలేమీ లేవుంటాయి గనక. చేసే నిరవాకం ఏముంటుంది గనక. అవేమన్నా పిల్లలు బెడతాయా. ఆమాటకొస్తే ఓ నెల్లాళ్ళపాటు ఇందమ్మటే తన ఇలాకాలో ఉంటే, పాతికో పరకో వడ్డీవస్తే పిల్లలకీ బట్టా పాతా కొనవచ్చు. ముసిల్ది మూడేళ్ళమట్టి సణుక్కుంటోంది ఓ కొత్త గొంగళీ కొనిదగలెయ్యమని. అందుకని, మొన్న-డబ్బు ఇంట్లో ఊరికేపడుంటే ఎవడుదిన్నట్టని--మొన్నంటే మొన్న ఓహ కావలసినాయనకి సర్దాడతను. మళ్ళీ నెలతిరక్కుండా తిరిగొచ్చేస్తుంది సెకం. అవతలి వాడు చాలా పెద్దమనిషి. మరోడూమరోడూ కాడు. అన్నవేళకి తప్పకుండా జమచేసేస్తాడు. దేవుడంటే నమ్ము ఏడుకొండలూ అంటూ జరిగిన విషయం చెప్పుకొచ్చాడు.

ఏడుకొండలికి మధ్యలో ఓచోట కోపం వచ్చింది. ఓచోట దుఃఖం పొల్లిపోయింది. ఇంకోసారి ఖూనీచేదామని బుద్ధిపుట్టింది. ఓసారి తనే పొడుచుకు చద్దామని, అందుకు ముందో వెనకో ఈ చెంచయ్యగాడికి అప్పిస్తానన్న నాలికని తెగ్గోసేసుకోవాలనీ మనసైంది. మరోసారి ఆలు మగలిద్దర్నీ వేలాం పాడిపారెయ్యాలనిపించింది. చివరకి జరిగింది మాత్రం భోరున ఏడిచి నెత్తి కొట్టుకుని ప్రాణం చాలొచ్చి కుప్ప కూలిపోవడం. ఆలు మగలిద్దరూ అతన్ని పొగేసి లేవదీసికు దేసిమంచినీళ్లిచ్చి పంపేశారే దప్ప డబ్బు కివ్వలేదు. ఇచ్చేందుకు డబ్బు లేకపా అనడగవేం? డబ్బేమో ఉండె.

కాని రెక్కలార్చి గడించిన దాన్ని ఈయములాడి ఎదాన గొట్టడానికి వాళ్ళకి చేతులు రాలేదు. వాళ్ళమాట కేంజేస్తాగా. అప్పుతీర్చే డబ్బు అలాటిదాయె. తీర్చేటపుడు ప్రతి మనిషికీ మనసలా ఉండునాయె.

నువ్వు గావాలంటే ఓసారి మన చిరాబుక్కు చూడు.

బదులు దీసుకున్న పైకొన్ని అసలపలుగా మొత్తంగా జమకట్టిన కొత్తా లెన్నున్నాయో లెక్కట్టి చూడు. వంద బుచ్చుకున్న వాడికి, వందా చచ్చినా ఇవ్వడానికి చెత్తులావు. తొంభై యిస్తాడు. పది ఆనక పంపుతా బాబాయ్ అంటాడు. ఇంతడబ్బు నీఎదానకొడుతూ ఉంటేవెధవ పదిరూపాయలకి ఏడవక్కర్లేదులే అన్నట్టు. ఆనక ఆ పదీ ఏదిరా అని మనం అడిగి జచ్చేమూ వాడిచ్చి జచ్చాడా. చిన్నదయిపాయె. ఏదిరా అని అడిగితే మనం నూగింజకి నాలిక జాపే దరిద్రులం అయిపోతాం. అడక్కపోతే ఆ మాటేనా ఉందా. మళ్లీ అప్పుకొచ్చినపుడు నీ పాతబాకీ అణాపైసల్తో పారెశా కావాలంటే చిఠాజూసుకో అంటాడు. పదుచ్చుకున్నవాడు అందులో రెండుకో మూడుకో నామంబెడతాడు. ఇదీ మనకి దక్కేవడ్డీ.

* * *

ముసలాడు పొద్దస్నే కూచోబెట్టి ప్రాణం తోడేశాడనుకునేవు. ఊరికేలోకమ్మీద సంగజెప్పాను. నీ జతగాడు మంచివాడే కావచ్చు. కాని సంగతదీ. బాకీ తీర్చేటపుడు డబ్బు విదల్చడానికి ఓపట్టాన ప్రాణం వొప్పదు. ఇదన్నా డబ్బు ఉంటే గింటే నాట. అసలు చేతికే డబ్బు రాబోతే ఇంకెంత అవస్థో చూసుకో.

ఇంతకీ ఏడుకొండలు చెంచయ్య దగ్గిర బాకీ ఎలా వసూల్జేశాడంటావు? అన్నాడు మునసబుగారు.

ఏమో తెలీదే నాన్నా అన్నాడు గుర్నాధం.

ఆలోచించి చూడు.

నాకు తెలీదే. నీకు తెల్సా?

నాకూ తెలీదు. అసలు వాడు వసూలే చెయ్యలేదు. ఏడుకొండలు అవసరాన్ని బట్టి, 'నేనెరిగిన పెద్దమనిషి దగ్గిర ఋణమిప్పిస్తానుపట్టు' అంటూ, మూడోమనిషి ద్వారా ఐదొందలు నూటికి నెలకి రూపాయ వడ్డీమీద నోటు రాయించుకు ఇప్పించాడు చెంచయ్య. నోటు మాటవరసకే అన్నాడు. వడ్డీ నేను సర్దేస్తాలే అని మాటవరసకన్నాడు. ఏడుకొండలికి తను బాకీ ఉన్నది అలా ఫిరాయించేస్తానికూడా మాటవరసకే అన్నాడు. ఏడాది తిరిగేసరికి, కోర్టునుంచి సమన్లొచ్చాయి. నోటువరసమూలంగా. ఏడుకొండలు రాద్ధాంతం చేసి, నువ్వే పోయిమ్మన్నావో అన్నాడు చెంచయ్యని. నాకేం పట్టె మన్నాయ్, నే నిప్పిస్తానన్నానా పోపోవోస్ నీకన్నా మొనగాళ్ళని చూశాం అని గసిరి పారేశాడు చెంచయ్య.

ఏడుకొండలు మాట అలా తూలకపోతే తాను సర్దేవాడేనట. చివరకి ఎక్సుపార్టీ డిక్రీ అయిపోయింది దావా. అమీను కుమ్మక్కై నిలబడేసరికి అనూమినూ అనకుండా ఐదొందల అరవై కరుకులూ, కోర్టు ఖర్చులూ, పైగా అమీను గారి ముడుపూ చెల్లించుకున్నాడు. తరవాత ఏడుకొండలు మళ్ళీ మనిషవలేదు.

మరి నువ్వు సాక్ష్యం ఇవ్వలేదా? ఇలా ఏడుకొండలు చెంచయ్యకి బదులివ్వగా చూశానూ-అని గుర్నాధం తండ్రిని అడగలేదు.

అడిగినా, చెంచయ్య ఆ బాకీ తీర్చలేదనడానికి మటుకు సాక్ష్యమేముందిటా అని తండ్రి అంటాడని అతనికి తెలుసు.

ఇలాటి ప్రశ్నలు అడగరానివని కూడా లోగడ ఇలాటి ప్రశ్న వచ్చినపుడు ఆయన చెప్పాడు. ఎందుకో ముందు ముందు నీకే తెలుస్తాయిలే అన్నాడు.


* * *


సరే నాన్నా వాణ్ణోసారి అడిగొస్తాను. మళ్ళీ బాకీ తీర్చడానికి నీకు డబ్బెక్కడి నుంచి వస్తుంది, ఎంతవస్తుందీ అని కనుక్కుంటాను. వాడిచేతి కెంతొస్తుందంటే, అందులో సగ మివ్వచ్చునేమో అప్పుడు బాకీతీర్చడానికి ఆక్షేపణగా ఉండదుగదా అన్నాడు గుర్నాధం.


నీ యిష్టం. నాదేముంది అన్నాడు మునసబుగారు.

(పై వారం ఋణానుబంధం)









అన్వేషణ

పోతుకూచి సాంబశివరావు

(గతవారం తరువాయి)

ఎక్కువ అందం లేకపోయినా తీర్చిదిద్దిన కన్నూ, ముక్కూ, పలుచని శరీరం పొట్టితనంలో, వనజ ఆకర్షణీయంగానే ఉంది. వనజతో రాణి స్నేహం పెంచుకుంది అందరితో వలెనే. అయినా నటకులందరూ రాణితో పలుకుతూ మాట్లాడినట్లు వనజతో మాట్లాడ యిష్టపడేవారు కాదు.

స్నేహాలు పెరిగిపోయి, కనిపించడమే మానేసిన రాణిపై చెప్పలేనంత కోపం వచ్చింది. రాఘవరావుకు. అన్నగా తన్ను స్వీకరించి ప్రయాణం చేసిన రాణి తన ప్రమేయమే లేకుండా నాటకరంగంలో ప్రవేశించి, ప్రచారం చేయించుకోడం రాఘవరావుకు కన్నెర్ర కలిగించింది. రామనరసుతో తనకున్న చనువు పలుకుబడి ఉపయోగించి వీలైనప్పుడు ఉద్యోగి వినయంతో రాణి తప్పు మన్నించి తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవలసిందని, డబ్బు యిబ్బంది వల్ల నాటకాల సమాజాల్లో తిరిగి బాధపడుతోందని నచ్చచెప్పేవాడు రాఘవరావు. తాను ఎవరికీ తెలియకుండా నెలజీతం ఆమెకు ముట్టచెపుతున్న సంగతి గూఢంగా అట్టిపెట్టి, రాఘవరావు మాటల్లో నిజం ఉందన్నట్లు పైకి నటించేవాడు రామనరసు. త్వరలో ఆమెను తిరిగి ఉద్యోగంలో చేర్చే ఏర్పాటు చేస్తానని వాగ్దానమిచ్చాడు; అయినా ఆ వాగ్దానం తీర్చుకునే పరిస్థితులు ఏవిధంగా సృష్టించాలని పతనుత్తమయ్యాడు రామనరసు స్వప్రయోజన దృష్టితో. రామనరసు దగ్గర తన శక్తినంతా వినియోగించి రాణికి తిరిగి ఉద్యోగం యిప్పించే ప్రయత్నం చేస్తూ కష్టపడుతున్న సంగతి గుర్తించకుండా నిర్లక్ష్యంగా సంచరిస్తున్న రాణిని మందలించాలని యింటికి వెళ్లాడు.

ఆమెను చూడగానే, సహజమైన నవ్వుతో, అమాయకంగా ఆప్యాయత కనబరుస్తూ ఆహ్వానించింది రాణి రాఘవరావును. చేతుల్లో ఉన్న మల్లెదండ అందిచ్చాడు రాణికి.

"మల్లెపూవులాంటి పవిత్రమైన హృదయం రాఘవరావుగారిది!" నవ్వింది మరియమ్మ తన పెదవులు వంకరగా త్రిప్పి కొంచెం సొగసుతో.

మరియమ్మవైపు తీవ్రంగా ముఖం పెట్టాడు రాఘవరావు; ఆమైనా రాణికి బుద్ధి చెప్పి తన ఆశ్రయం కోరమని సలహా యివ్వలేదని, మరియమ్మ అతని మాపుకు భయపడి తనవంటింటి గదిలోకి పోయింది టీ నీళ్ళు తయారుచేసి అతని కోపం తగ్గించాలని.

రాణి యింతవరకు తాను వేసిన నాటకాల వేషాల ఫోటోలు తెచ్చి రాఘవరావుకు చూపించింది.

"చూడమ్మా....నీవు యింకా అనుభవం నేర్చుకోవలసిన పిల్లవు....నాటక సమాజాలలో చేరితే నీ పరువు ప్రతిష్ఠలు పోతాయి. ...అన్ననైనందుకు నా విధ్యుక్త ధర్మం నిర్వర్తించాలని యీ సలహా యిస్తున్నా!" సన్నని కోలముఖం చిట్లించి, ఎత్తు పళ్ళు యికిలించి, జాలిగా రాణివైపు చూశాడు రాఘవరావు. అతనిముఖం బాగా కమిలిపోయినట్లు కనిపించింది రాణికి. అంత అందవికారి తన్ను కూర్చి ఏమీ అసూయపడటం లేదు. కదా అని ఒకనిమిషం సందేహించి, అయినా అతను తన్ను చెల్లెలని సంబోధిస్తున్నప్పుడు అటువంటి శంకలకు దారి యివ్వకూడదని, అతని సలహా సహజ ధోరణిలో యిచ్చినదేనని నమ్మింది.


రాఘవరావుతో తన ప్రవర్తన అసభ్యంగా లేదని నీతికరంగానే ఉందని వాదించింది రాణి.

"అయినా చూడు చెల్లీ! సంఘానికి భయపడాలి...నువ్వు పెళ్ళిచేసుకోవాలి...!" రాఘవరావు మాటలను తేలికైన నవ్వులతో ఆపేసింది రాణి.

"ఎందుకు నవ్వు?" వడలిన నల్లవంకాయలా ముఖం ముడుచుకున్నాడు రాఘవరావు.

"ఆ...పెళ్ళి అంటే...నవ్వు వచ్చింది!" ఒక్కసారి నవ్వులోంచి ఏదో ఆలోచన, విషాదం, బాధ ఆమెముఖంలో పెంవేసుకున్నాయి. మరొక నిమిషంలో ముఖకవళికలు మార్చుకొని కనుబొమ్మలు ఎగరవేస్తూ పులికింది రాణి.

"ఏమండీ!...నాటకాలతో పాటు నృత్యం నేర్చుకోవాలని ఉంది...!" నవ్వింది రాణి.



"అలా క్లబ్బు కెళ్ళొస్తానండీ! ఇవాళ హాలిడే కదా!"

-చిత్రం: డి. వెంకటరావు-నెల్లూరు

"ఇంకా నృత్యం నేర్చుకుంటానను... బాగుంది... కావాలంటే నేను ధనసహాయం చేస్తా చెల్లీ... రేపే నృత్యం చెప్పే పాఠశాలలో చేరు...!"

అంటూ పాతిక రూపాయిలు తీసి చేతిలో పెట్టాడు రాఘవరావు. రెండుసార్లుయింటికి వచ్చినా కనిపించలేదని నిష్ఠూరం వేశాడు రాఘవరావు. జరిగిన అసంతృప్తులకు పరిహారంగా ఖులాసాగా చిదానందంగా రాఘవరావుపైపు నవ్వి, మరియమ్మ తెచ్చిన టీ స్వయంగా చెమిచాతో కలిపి రాఘవరావు చేతి కందించింది రాణి.

"నాకు తెలుసు చెల్లీ... నేనంటే నీకు అవ్యాజమైన అభిమానమని!" రాఘవరావు విశాలంగా నవ్వాడు.

"అస్తమానూ మీ పేరే స్మరిస్తూ ఉంటుందండి!" మరియమ్మ తన విధ్యుక్త ధర్మమైన ఊతపదం వదిలింది.

"రామనరసుతో చెప్పాను... త్వరలో నీకు ఉద్యోగం మళ్లీ యిస్తానన్నాడు!" తన పలుకుబడి ప్రభావం స్ఫుటంగా స్ఫురించేటట్లు గొంతు సకిలించాడు రాఘవరావు.

రాణి కృతజ్ఞత తెలిపింది.

రాఘవరావు సినిమాకి వెడదా రమ్మన్నాడు.

కురూపియైన రాఘవరావుతో వీధిలో తిరగడం రాణికి యిష్టంలేకపోయింది. ఆరోగ్యం సరిగా లేదని దగాలు ముఖం పెట్టింది. బహుశా ఉద్యోగంలేక సరైన కుటుంబరక్షణలేక బెంగతో ఆరోగ్యం చెడగొట్టుకుంటూందేమోనని భయపడి, ఆరోగ్యం మహాభాగ్యమనే సూక్తి బోధించి, త్వరలో మరోక పాతిక రూపాయిలు పంపుతానని వాగ్దానంచేసి రాఘవరావు వెళ్లిపోయాడు.

ఉద్యోగంలో తిరిగి చేర్చుకునే దాక ముఖం చెల్లక రాణి స్నేహంపోగొట్టుకోడం యిష్టంలేక నెలజీతం పంపిస్తూ, ఆమెతో మాట్లాడడానికి పదిపదేయింటికి వెళ్ళడం తన హోదాలోపమని రామనరసు ఒంటరిగానే బాధపడసాగాడు.

నృత్యంకూడా తెలిసుంటే. నటన అనుభవంతో నాటకాలలో చేరి సినీతారకావచ్చునే ఆశ రాణికి కలిగింది. ఉద్యోగం లేని తీరిక సమయం సరిగా సద్వినియోగం చేసుకున్నట్లుంటుందని రాణి నృత్యకళాశాలలో చేరింది.

తన నాటకమండలిలోని నటులకు, మండలి పోషకులకు, హితులకు కృష్ణమూర్తి ఒకరోజు తేనీటివిందు చేశాడు. అబిద లోని ఒక హోటల్లో సుందరమైన వనంలో మధ్య వరుసగా టేబిల్సు అమర్చబడి, పైన పూల గుత్తులు వేలాడుతున్నాయి. నాల్గువైపుల కుర్చీలు వరుసగా అమర్చబడి ఉన్నాయి. మేజామీదకు కాంతి వచ్చేలా సొగసుగా ప్రక్కనున్న చెట్టుకొమ్మ మీంచి జారు

★ అన్వేషణ ★

తోంది ఒక విద్యుద్దీపం.

అతిథులంతా వచ్చాక కృష్ణమూర్తి నిలుచుని ముఖ్య అతిథి, పరమహంసను పరిచయం చేశాడు. తన నాటకమండలి కార్యక్రమాలు, నిర్మాణాత్మక కృషి విపులంగా ముందు వివరించి, పరమహంస దేశంలో ప్రఖ్యాతికెక్కిన నటుడనీ. ఏ పాత్రనైనా క్షుణ్ణంగా అర్థం చేసుకుని మరుక్షణంలో అభినయించగల శక్తి ఆయనలో ఉందనీ, విదేశగమనంలో పొందిన విజ్ఞానం వయసు ప్రయోగాలలోని అనుభవం జతచేర్చి అద్భుతనటుడిగా కీర్తి గణించుకున్నారని, ఆయన సన్మానంకోసమే తన నాటకమండలి తరఫున యీ అల్పాహార విందుచేస్తున్నానని కృష్ణమూర్తి చిన్న ఉపన్యాసం యిచ్చాడు.

వచ్చిన అతిథుల నందరినీ పరమహంసకు పరిచయం చేశాడు. అతి చనువుగా అందరినీ పలకరించాడు పరమహంస. నాటకంలోని ఆధునికరీతులుగూర్చి తన అభిప్రాయాలు చర్చించాడు. అనుభవమున్న నటీమణుల ఆవశ్యకత నాటకరంగానికి చాలా అవసరమని ఎదురుగా ఉన్న రాణి వనజలవంటి సంస్కృతిగల స్త్రీలు నాటకరంగంలో ప్రవేశించడం స్త్రీ జాతికి పురోగతి చూపడమేనని ఉద్ఘాటించాడు.

ఫలహారాలసమయంలో యిష్టాగోష్ఠి జరిగింది. వయసుడిగిన పరమహంసకూడ రాణివంక తదేకధ్యానంగా చూడక మానలేదు. తాత్కాలికంగా నగరానికి వచ్చానని చెబుతున్న పరమహంస ఎంతసత్యం వచిస్తున్నాడో అనే అనుమానం కూడా ఇతర నటులకు కాకపోయినా రాణికి ముఖ్యంగా కలిగింది. పరమహంసరాణిపై విసిరే తీవ్ర దృష్టులలో ఒకవిధంగా ఆ నగరం విడిచిపోయే మనిషిలా కనిపించలేదు. ఆలోచనలు ఎక్కువ ఉన్న తన తల అర్థాలు అనేకం పుట్టిస్తుందని, తన్ను తానే దూరుకుని, రాణి సహజమైన చలాకి నవ్వుతో తేనీటివిందులో గడిపింది.

పరమహంస మర్నాడు రాణి యింటికి ప్రత్యేకం రానే వచ్చాడు. ఒక క్షణం పరమహంసను చూసి ఆశ్చర్యపోయినా, తొట్రుపాటు సర్దుకుని, అమిత గౌరవంతో ఆహ్వానించింది రాణి.

"ఆడవాళ్ళను దర్శించడానికి వచ్చినప్పుడు తృణమో పణమో బహుమతి ఇవ్వాలనే సిద్ధాంతం నాది...యీ గులాబీపూల గుత్తి...!" అందిచ్చాడు పరమహంస చిరునవ్వుతో.

తల నెరిసి, ముఖం ముడుతలుపడి ఎభై సంవత్సరాలకు పైబడిన ప్రసిద్ధనటుడు అపూర్వ గౌరవంతో అందిస్తున్న పూలగుత్తి తీసుకోకపోవడంలో అసభ్యత స్ఫురించింది రాణికి: పూలగుత్తి అందుకుని ఆఘ్రాణించి, ఒళ్ళు గగుర్పొడిచి ఆనందంతో నవ్వింది రాణి.

ఆ నవ్వుతో పరమహంస చైతన్యం తప్పినట్లు తీవ్ర వదనం పెట్టాడు.

అతని వదనం చూసి ఆశ్చర్యపోయి అమాయకంగా నిలుచుంది రాణి.

కూర్చో రాణీ!... మనకున్న తక్కువ పరిచయంతో నీ దగ్గరికి రావడం అన్యథా భావించకు... నాటకరంగంలో పాశ్చాత్య రీతుల్లో క్రొత్తపంథాలు ఊరూర ప్రయోగాలుచేసి సఫలీకృతుడనయి యీ నగరానికి వచ్చాను. ఆ ప్రతిభ యిక్కడ చాటాలి అనుకుంటున్నా... నా ప్రయోగాలు చైనా, జపాన్, బోర్నియో, మలయాల్లో కూడ ప్రశంసలు పొందాయి... నేను ఒక్కణ్ణే నా నాటకబృందంలోని మనిషిని... కాని నీ సహాయం కావాలి... ప్రదర్శనకు ఏభయి తక్కువ కాకుండా నీకు బహుమతిగా యిచ్చుకోగలను!" గబగబ గుక్క సర్దుకోకుండా చెప్పాడు పరమహంస.

"మీ పేరు విన్నాం... ఎప్పుడూ చూసే భాగ్యం కలుగలేదు!" మరియమ్మ చేతులు ముడుచుకుని నమ్రతగా నవ్వింది.

పరమహంస చిదానందంగా నవ్వాడు.

పరమహంస కోరికలో అన్యాయం కాని, వస్తున్న ధనం తన్నుకోడంలో సమంజసం కానికనిపించలేదు రాణికి. కృష్ణమూర్తి నాటకాలలో నటించినట్లే పరమహంసతో కూడ నటిస్తే వచ్చిన కష్టమేమీ లేదనుకుంది. అయినా కృష్ణమూర్తి ప్రదర్శనలతో సంఘర్షణ పడకుండా తన కార్యక్రమాలు నిర్ణయించుకోమని కోరింది రాణి.

తల ఊపాడు పరమహంస జిజ్ఞాసతో. రాణి తన సహకారం యివ్వడానికి అంగీకరించింది. పరమహంస నిష్క్రమించాడు రాణియింటినుంచి.

పరమహంస నాంపల్లిలోని పెద్ద హోటల్లో బసచేశాడు. తనరాక గురించి, నటనాప్రతిభ గురించి పత్రికలలో 'చూచాయవార్తలు' యిప్పించాడు. నగరంలో పెద్దలైన కళాకారులను కళాపోషకులను కలుసుకున్నాడు. తన ప్రదర్శనలకు అనువైన అవకాశం యివ్వవలసినదనీ. ధనార్జన కాక, కళా ప్రదర్శన తన ముఖ్యధ్యేయ

(46-వ పేజీ చూడండి)


త్వరపడండి! త్వరపడండి!
సన్‌లైట్ రంగులు వేసే పోటీ
రు. 25,000
విలువైన వందలకొలదీ గొప్ప బహుమతులు!
రెండు
మొదటి బహుమతులు.
రు. 4000/- రొఖము లేదా అంతవ్యయములో భారత దేశంలోవిలాస విహారము!
నాలుగు
రెండవ బహుమతులు:
హెచ్.ఎమ్.వి. రేడియోగ్రామ్!
ఆరు
మూడవ బహుమతులు:
మల్టి ఆల్ వేవ్ రేడియో యున్ను దానితోపాటు ఒకహింద్ అంబాసెడర్ సైకిల్!
2000
ప్రోత్సాహక బహుమతులు:
పెయింటింగ్ సెట్ లేదా ఒక బొమ్మ!
తల్లిదండ్రులారా — మీ పిల్లలు ఇంకా పాల్గొనలేదా? జ్ఞాపక ముంచుకోండి. ప్రతి సన్‌లైట్ పై రేపర్ వారికి సన్‌లైట్ రంగులు వేసే పోటీలో పాల్గొనే అర్హతను గలిగించుచున్నది: ఈ పోటీ వయస్సు వారీగా రెండు గ్రూప్‌ల ప్రవేశము నిమిత్తం నియమింపబడినది: (1) పది ఏళ్ల లోపు వయస్సువారు. మరియు (2) 10, 15. ఏళ్ల మధ్య వయస్సువారు. రెండు గ్రూప్‌లయందలి చిత్రములున్నూ వేర్వేరుగా పరిశీలించబడి నిర్ణయించబడును. ఒక వయస్సు గ్రూప్‌యందు మొదటి, రెండవ, మూడవ, బహుమతులను మరియు ప్రోత్సాహక బహుమతులను గెలుపొందినవారికి ఇచ్చే బహుమతులే మరియొక గ్రూప్‌యందలి గెలుపుదారులకు కూడా ఇవ్వబడును.
త్వరపడండి!
ముగింపుతేదీ: నవంబర్ 16, 1959.
సన్‌లైట్ అమ్మే మీ దుకాణదారువద్ద నేడే ప్రవేశ పత్రములను ఉచితంగా తీసుకోండి. ప్రతి పత్రమందున్న ఒక సొగసైన చిత్రమున్నది. మీ పిల్లలు దానికి రంగులు వేయాలి — వారికిష్టమైన ఏ రంగులతోనైనా సరే.
SUNLIGHT SOAP
కొద్ది సన్‌లైట్ చాలా బట్టలను ఉతుకును!
హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్‌వారి ఉత్పత్తి
S/9-X52 TL



రైల

కో. తై

రైలు బయలుదేరడానికి పదినిముషా లుండగా ఒక టికెట్ కలెక్టర్ రామకృష్ణదగ్గరకివచ్చి "మీ రేనా ఆర్. కె. శివన్?" అని తనచేతిలోని కాగితాలవైపు చూస్తూ ఇంగ్లీషులో అడిగాడు. రామకృష్ణకు తనపేరు నిలా మార్చి అడగడం ఒక క్షణం చిరాకెత్తించింది కాని తను టికెట్ కొనుక్కున్నప్పుడే అలా తప్పు వ్రాయడంచేత టికెట్ కలెక్టర్ మీదవిసుక్కుని లాభంలేదని "అవును" అనిమాత్రం సమాధాన మిచ్చాడు. "ఢిల్లీ వరకూ వెళ్తున్నారుకదా?" అని నిర్ధారణ చేసుకుని ఆ రైల్వే ఉద్యోగి వెళ్ళిపోయాడు. రత్లాంలో తనొకరోజు దిగవచ్చునని అతనితో రామకృష్ణ చెప్పలేదు.

రామకృష్ణ ప్లాట్ఫారం మీదనుంచి తనకంపార్ట్మెంట్ లోకి ఎక్కి తలుపుదగ్గిర నుంచున్నాడు. బొంబాయినుంచి ఢిల్లీ వెళ్ళడం అతనికిదే మొదటిసారి. బొంబాయి కూడా తను ఇంతకుముందు రెండుసార్లే వచ్చాడు. అక్కడ తనకున్న ఒక్క స్నేహితుడూ వేరే పనిమీద మరింకొక చోటికి వెళ్ళవలసివచ్చింది. అందువల్ల సేషన్కి తనకి తెలిసినవా రెవరూ రాలేదు. కంపార్ట్మెంట్ లోని నాలుగు బెర్ లలోనూ మూడు ఖాళీగా ఉన్నాయి. ఎవరూ రారనుకుంటూ ఉంటే, ఇందాక వచ్చిన టికెట్ కలెక్టరుతో ముగ్గురు త్వరత్వరగా వచ్చి, లోపలికి ఎక్కడం మొదలుపెట్టారు. రామకృష్ణ వారిని రానిచ్చేందుకు లోపలికి జరిగాడు. వచ్చిన వారిలో ఒకతను సిక్ అని అతని వేషమే తెలుపుతూ ఉంది. మిగిలినవారిద్దరిలో ఒక మనిషి బలంగా ఉన్నాడు, పెద్దమీసాలతో. ఇతని వెంట సన్నగా, పొడుగ్గాన్న ఒకతను లోపలికి వచ్చాడు. మొహం పాలిపోయి కణతల దగ్గిర రక్తనాళాలు పచ్చగా కనిపిస్తున్నారు. టికెట్ కలెక్టర్ వారిపేర్లు గబగబ వ్రాసుకుని, ఏదో చెప్పి వరిగెత్తుకుంటూ వెళ్ళిపోయాడు.

వాళ్ళుసామాను సర్దుకుంటూ ఉంటే, రైలు బయలుదేరింది. మీసాలమనిషి వచ్చి రామకృష్ణ పక్కన కూర్చున్నాడు. తక్కిన వారిద్దరూ సామానంతా సర్ది ఒకపెట్టెను మధ్య నిలువుగా నుంచోపెట్టారు. దానికి మూడువైపులా రెండుపెట్టెలు చిన్న ఒక బుట్టా అమర్చారు. రామకృష్ణకు ఇదెందుకో బోధపడలేదు.

"ఎంతవరకు వెళ్తున్నారు?" అని మీసాలున్నతను అతన్ని అడిగాడు ఇంగ్లీషులో.

"ఢిల్లీ" అని రామకృష్ణ చెప్పాడు "మీరు?" అని అడిగాడు. అతనొకవిధంగా నవ్వి ఏదో గొణిగాడు. రామకృష్ణ తన స్నేహితుడొకడు రత్లాంలో ఉండడంచేత అక్కడ దిగిపోతే దిగవచ్చునసే సంగతి చెబుదామా అని ఆలోచించి, ఊరికేనే చెప్పకుండా వదిలివేశాడు. ఇంతలో సన్నగాఉన్న వ్యక్తి వచ్చి, రామకృష్ణను హిందీలో ఏదో అడిగాడు. రామకృష్ణకు అర్థంకాలేదుకాని, "కిషన్" అనేమాట వినిపించింది.

ఇంగ్లీషులో, "నాపేరడుగుతున్నారనుకుంటాను. "కిషన్ కాదు! రామకృష్ణ! బొంబాయిలో బుకింగ్ క్లార్కు తప్పుగా అలా రాశాడు. నాకు హిందీరాదు," అని అన్నాడు.

"అలాగా?" సన్నగా ఉన్నతను జవాబిచ్చాడు. తక్కినవారిద్దరూ అంతా వింటున్నారు.

"మీపేరు?" అని రామకృష్ణ అడిగాడు. వారు ముగ్గురూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నట్లు అతనికి అనిపించింది. ఒక క్షణం తర్వాత సిఖ్, "నాపేరు కమల్ సింగ్, ఇతను," అని మీసాలమనిషిని చూపిస్తూ, "కపూర్, ఇతనిపేరు బాల్లె," అని పరిచయం చేశాడు. రామకృష్ణ లేచి అందరితోనూ కరచాలనం చేశాడు.

బాల్లె జేబులోనుంచి రెండు పేకట్లపేలు తీసి 'సెల్లోఫేన్' కవర్లను చించివేస్తున్నాడు. కమల్ సింగ్ హిందీలోనో, ఇంకొక భాషలోనో, గబ గబ మాట్లాడుతున్నాడు. కపూర్ నిర్లక్ష్యంగా తల ఆడించినట్లనిపించింది రామకృష్ణకు. బాల్లె వంకరగా చిరునవ్వు నవ్వుతూ పేకముక్కలనొక చేతినుంచి మరొక చేతిలోకి ధారగా పోస్తూ నుంచున్నాడు. చివరకు, కమల్ సింగ్ రామకృష్ణతో, "చిన్నఆట వేస్తున్నాం. మీరుకూడా..." అని వదిలివేశాడు. రామకృష్ణకు పేకాటంటే అసలుఇష్టంలేదు. ఏమనాలో తెలియక చూస్తూ ఉంటే కపూర్ బాల్లేలు తనవైపు కొంచెం దీక్షగా చూస్తున్నారని గ్రహించాడు. ఎందుకో కపూర్ చూపు అతన్ని కలవరపెట్టింది. కొంచెం భయంవేసింది కూడా. అనుకో కుండా, "సరే" నన్నాడు.



ప్రయాణం

రమల రావు

"మీకు మూడు ముక్కల ఆట వచ్చుననుకుంటాను. మనమిప్పుడాడబోయేది అదే," అని కమల్ సింగ్ చెప్తూ కూర్చున్నాడు; అతనికి ఎదురుగా రామకృష్ణ, కుడిచేతివైపు సీట్ మీద బాత్లే, బాత్లేకుఎదురుగా కపూర్.

"అంత బాగారాదు. అయినా మీరెంత ఆటలాడుతున్నారు?" అని రామకృష్ణ ఎదురు ప్రశ్న వేశాడు. కమల్ సింగ్ సమాధానం ఆశ్చర్యం, సందేహం కలిగించాయి. తను అంతకు ముందెప్పుడూ అటువంటి పందేలతో ఆడలేదు. అయినా మొత్తం తనదగ్గరున్న మూడువందలను తలుచుకొని ఆడేద్దామనుకున్నాడు.

మొదటి రెండుఆటలూ కపూర్ గెల్చాడు. తర్వాత కమల్ సింగ్ కొన్ని, తను కొన్ని గెల్చారు. కపూర్ మధ్యలో లేచి పెట్టెలలోనుంచి ఒక 'విస్కీ' సీసా తీసాడు. రామకృష్ణ ఎంత బలవంతంచేసినా తాగదల్చుకో లేదు. వారుముగ్గురూ తాగడం మొదలు పెట్టారు. "మద్యపాన నిషేధం" గురించి చిన్న చిన్న "జోక్స్" అందరూ చేశారు. సుమారు గంటసేపటివరకూ బాత్లే ఒక్క ఆట కూడా గెవలేదు. కపూర్ ఈ విషయాన్ని గురించి బాత్లేను కొంచెం వెక్కిరించడం మొదలుపెట్టాడు. అప్పటికి అతనేబాగా గెల్చాడు. రామకృష్ణకు అందరిలోకీ తక్కువ పోయింది.

బాత్లే ఒక ఆట గెల్చాడు. "ఇక మీరు గెలుస్తారనుకుంటాను," అని రామకృష్ణ అంటే అతను సమాధానమియ్యకుండా పేకముక్కలనుకలిపి పంచడం మొదలుపెట్టాడు. తర్వాత రెండు ఆటలు గెల్చాడు. ఒకటి రెండు ఓడిపోయి మళ్ళీ గెల్చాడు. కపూర్ కొంచెం విసురుగా ఆడి బాగా నష్టపడ్డాడు. ప్రత్యేకం ఒక ఆటలో అతనూ, బాత్లే ఒకరిమీద ఒకరు పందేలు వేసినతర్వాతముక్కలు తిరగవేశారు. బాత్లేవి మూడురాజులూ, కపూరువి ఆసూ, రాజూ, రాణీ. కపూర్ విసుక్కుంటూ ముక్కలు విసిరివేశాడు. రామకృష్ణ, కమల్ సింగ్‌లు వాటిని ఏరి బాత్లేకు ఇచ్చారు.

బాత్లే వరుసగా గెలవడం మొదలుపెట్టాడు. సూరత్ స్టేషన్ వచ్చేప్పటికి కపూర్ డబ్బంతాపోయింది. బండి ఆగుతూ ఉండగానే అన్నీ లోపల దాచేశారు. మళ్ళీ బయలుదేరిన తర్వాత కపూర్ తన పెట్టెలోనుంచి కొన్ని నోట్లకట్టలు బయటకితీశాడు. "రామకృష్ణా! ఇక మనదే గెలుపు చూస్కో," అని తనకు వేసిన ముక్కలను చూడకుండానే డబ్బు కట్టడం మొదలుపెటాడు. మళ్ళీపోయింది. బరోడా స్టేషన్ వచ్చేవరకూ అతను ఓడిపోతూనే ఉన్నాడు.

రామకృష్ణ దిగి కొంచెం టీ త్రాగి, ఫ్లాస్కులో కొంచెం పోయించుకుని వచ్చాడు. మళ్ళీ ఆట మొదలుపెట్టినతర్వాత ఒక ఆట గెలిచాడు. దానితో అతని నష్టం పది, పదిహేను రూపాయలకు తగ్గిపోయింది.

"త్రాగడం కొంచెం తగ్గించు! లేకపోతే ఆట గెలవ్వు!" అని కమల్ సింగ్ కపూర్‌తో అన్నాడు. కపూర్ అతని మీద కసురుకున్నాడు. సుమారు ఒంటి గంట అవుతుందనగా బాత్లే ఒక పెద్ద ఆట గెలిచి పేక కలుపుతున్నాడు. కపూర్ అతని చేతుల వైపే జాగ్రత్తగా చూస్తున్నవాడల్లా "ఆగు!" అని అరిచి ముక్కల్ని లాక్కుని తెరిచి పరీక్షచేయుడం మొదలుపెటాడు. వాటని క్రిందకి విసరి ఏదో అరుస్తూ, సీసాను చేత్తోకి తీసుకొని బాగా వెనక్కిలాగి బాత్లే నెత్తిమీద కొట్టాడు. అతని తల గాజు సీసాకు తగిలినప్పుడు కలిగిన చప్పుడు రామకృష్ణ ఒళ్లు జలదరించింది. ఇదంతా కొన్ని సెకండ్లలో జరిగిపోయింది. బాత్లే చిన్న అరుపుతో వెనక్కి పడిపోయాడు. కమల్ సింగ్, రామకృష్ణ అతన్ని లేవదీశారు.

"మోసం చేస్తున్నాడు రాస్కెల్!" అని కపూర్ ఏదో అంటున్నాడు. బాత్లే కణత చితికిపోయి ఉన్నది. రామకృష్ణ గుండెమీద చేయివేసి చూశాడు. ప్రాణం లేదనిపించింది.

"గొలుసులాగి, ఎవరైనా డాక్టర్ . ." అని మొదలు పెట్టిన రామకృష్ణ మాటల్ని మింగివేశాడు. తన కళ్ళముందర జరిగిన సంఘటనని తనే నమ్మలేకపోతున్నాడు. బలవంతంగా మనిషిని బాదటం తనెప్పుడూ ఇంతకుముందు చూడలేదు. కపూర్ సీసాను మరింత గట్టిగా పట్టుకుని కమల్ సింగ్ వైపు చూశాడు. అతను కనుబొమలు ఎగరవేసి ఊరుకున్నాడు.

"ఏం గొలుసు?" అని కపూర్ నెమ్మదిగా అడిగాడు.

"అదే, ఎమర్జన్సీ. " అని రామకృష్ణ మళ్ళీ మాట్లాడలేక ఊరుకున్నాడు.

రైలు ప్రయాణం

కపూర్ జేబులోనుంచి చిన్న రివాల్వర్ తీశాడు. "ఏ గొలుసూ లేదు," అన్నాడు కఠినంగా. రామకృష్ణ రివాల్వర్ ను చూస్తూ ఊర్కున్నాడు. బొమ్మలలో, సినిమాలలో తప్ప తనింతవరకూ రివాల్వర్ ను చూడలేదు. 'క్లిక్' అనే శబ్దంతో కపూర్ ఏదో మీటను నొక్కాడు. 'సేఫ్టీ కాచ్'ని వదిలించాడని రామకృష్ణ గ్రహించాడు

"కమల్ సింగ్! నువ్వైనా సరే" అన్నాడు కపూర్.

"ఫూల్ లాగ మాట్లాడకు. ఇప్పుడేం చేద్దాం?"

"అదే ఆలోచిస్తున్నాను."

కమల్ సింగ్ కొంతసేపు ఆలోచించి, "బయటపారేద్దాం" అన్నాడు.

"పక్కవారెవరైనా చూస్తే" కపూర్ కు అనుమానం వేసింది. కమల్ సింగ్ తలుపు తెరిచి చూశాడు "మనం బండి చివరున్నాం. లైటు ఆర్పేసి ఆపని చేస్తే భయం ఉండదు" అన్నాడు. కపూర్ ఒక క్షణం ఆలోచించి 'బాత్ రూమ్' తలుపు తెరచి, "ఈ లైట్ చాలు మీరెమైనా కోతి పనులు చేయకుండా చూడటానికి" అన్నాడు కమల్ సింగ్ లైట్లు ఆర్పేసి రామకృష్ణతో శవం కాళ్ళు పట్టమన్నాడు

"ఉండు! జేబులన్నీ ఖాళీ చెయ్యాలుందు' అని కపూర్ అనడంతో లైట్లు మళ్ళీ వేసి బాత్ జేబులలో ఉండేవన్నీ తీసివేశారు. మళ్ళీ లైట్లు ఆర్పి తలుపు తీశారు. బండి వేగానికి గాలి పెద్ద హోరుతో లోపల పేకముక్కలన్నిటినీ చిందరవందర చేసింది. బాత్ శరీరాన్ని బయటకు తోసివేసి తలుపు మూశారు. మళ్ళీ లైట్లు వేసిన తర్వాత రామకృష్ణ సీటుమీద కూలిపోయాడు. కడుపులో కొంచెం తిప్పడం మొదలుపెట్టింది

"సీటుని శుభ్రం చేయాలి" అని కమల్ సింగ్ ఒక చిన్న గుడ్డతో రక్తపు మరకలను తుడిచి కిటికీలోనుంచి పారవేశాడు. కంపార్ట్మెంట్ లోని సామానులన్నిటినీ సద్దారు. కపూర్, కమల్ సింగ్ లు తమలో తాము ఏదో మాట్లాడుకోవడం రామకృష్ణ గమనించాడు గాని ఏమిటో అర్థం కాలేదు. కపూర్ నవ్వుతూ, ఇంగ్లీషులో "మళ్ళీ పేకాడదాం, వేరే పనేముంది? ఇతన్ని కూడ పంపించేస్తే మన మిద్దరమే ఏమాడకుంటాం?" అన్నాడు

"మళ్ళీ ఆటా?" అని రామకృష్ణ అనగలిగాడు. కపూర్ అన్న మాటలు అతని తలలో సగం సగమే ఎక్కాయి.

"ఏం! ఆడలేవా? ఇది కొంచెం పుచ్చుకో" అని బాట్లేను కొట్టిన సీసాను అందిచ్చాడు

రామకృష్ణ, "నేను తాగలేన"ని తడబడుతూ చెప్పాడు. కపూర్ విరగబడి నవ్వాడు. కమల్ సింగ్ చిరునవ్వునవ్వుతూ సీసాను తీసుకొని గ్లాసులేకుండా నే తాగి రామకృష్ణకు అందిచ్చాడు. ఇష్టంలేకపోయినా అంగుకొని కొంచెం నోట్లోపోసుకుని మింగాడు. విస్కీ రుచి పోయేందుకు టీ ఫ్లాస్కులోనుంచి పోసుకుని త్రాగాడు.

కపూర్ కోటుమీద కొన్ని విస్కీ మరకలు రామకృష్ణకు కనుపించాయి సీసా పైకి ఎత్తినప్పుడు పడి ఉంటాయనుకున్నాడు. కపూర్ కి చెప్పాడు. అతడు పెట్టెలోనుంచి బట్టలుతీసి బాత్ రూమ్ వైపుకు వెడుతూ "పప్పిపను లేమీ చెయ్యక" అని తలుపు మూసుకున్నాడు. వెంటనే కమల్ సింగ్ సీటుకింద కపూర్ బట్టలు తీసిన పెట్టెపక్కన పెట్టెను తెరిచి కొన్ని నోట్లకట్టలను బయటకు లాగి గబగబ జేబులో పెట్టుకున్నాడు. రామకృష్ణవైపుతిరిగి చిరునవ్వుతో "నువ్విప్పుడేమీ చూడలేదు"అన్నాడు. రామకృష్ణ ఏమనాలో తెలియక తల అడ్డంగా ఆడించాడు. కపూర్ కూడా బయటకు వచ్చాడు.

"బాట్లే డబ్బంతా..." అని కమల్ సింగ్ అడిగాడు.

"ముగ్గురం పంచుకుని ఆడ్దాం!" అన్నాడు కపూర్.

"నాకక్కరలేదు. మీరిద్దరూ పంచుకోండి" అని రామకృష్ణ అనుకోకుండా పైకిఅనేశాడు. వారిద్దరూ అతనివైపు చూశారు.

"నీ ఇష్టం" అని కపూర్ సమాధానమిచ్చి కమల్ సింగ్ తో తనుభాషలో ఏదో చెప్పినవ్వాడు. కమల్ సింగ్ చిరునవ్వు రామకృష్ణకెందుకో భయంకలిగించింది.

మళ్ళీ ఆట మొదలు పెట్టారు. రామకృష్ణ రిస్టువాచీవైపు చూసుకొన్నాడు. ఒకటి ఇరవై అయింయింది. ఈమాటు కమల్ సింగ్ గెలవటం మొదలెట్టాడు. కపూర్ నవ్వు చిరాకుగా మారింది. సీసాఖాళీచేసి పారవేయడానికి తలుపుదగ్గరకి వెళ్లాడు. తిరిగివస్తూ, "పై స్టేషన్ ఏమిటి ?" అనిఅడిగాడు.

"గోధ్రా" అని రామకృష్ణ సమాధానమిచ్చాడు. కపూర్ కూర్చోబోతూ తన పెట్టెలవైపు చూశాడు. అలాగే నుంచుని, "కమల్ సింగ్, నా పెట్టెలోంచి ఏంతీశావ్ ? అన్నాడు నెమ్మదిగా.

కమల్ సింగ్ పేకముక్కలు పంచుతూం డడంచేత తలవంచి ఉన్నాడు. మెల్లిగా పైకిచూసి "ఏం పెట్టె? ఏం మాట్లాడుతున్నావ్?" అని అడిగాడు.

"పెట్టె ఇవతలకు జరిపి ఉంది—ఒకవైపు 'లాక్' వేయడం మర్చిపోయావ్." కపూర్ ఇంకా నెమ్మదిగా మాట్లాడుతున్నాడు

రైలు ప్రయాణం

గాని జేబులోనుంచి రివాల్వర్ను తీశాడు.

"రామకృష్ణా! నువ్వు చూశావా?"

రామకృష్ణకు నోటమాట రాలేదు. కపూర్ తనవైపు తిరగగానే కమల్ సింగ్ అతని మీదకు ఉరికాడు. కాని కపూర్ కొంచెం వెనక్కి జరిగి రివాల్వర్తో ఒకసారి కాల్చాడు. కమల్ సింగ్ రెండు చేతులతో పొట్టను పట్టుకొని కింపడిపోయాడు. రామకృష్ణ రాయిలాగ నుంచుని చూస్తున్నాడు. కపూర్ మళ్ళీ రెండుసార్లు కమల్ సింగ్ను కాల్చాడు. కంపార్ట్మెంట్ గుళ్ళమందు వాసనతో నిండిపోయింది. కమల్ సింగ్ శరీరం రైలు కుదుపుకి కొంచెం అదురుతూ ఉన్నది కాని ప్రాణంపోయి ఉంటుంది. రామకృష్ణ కలకంటున్నానేమో అనుకున్నాడు.

కపూర్ రివాల్వర్ తనవైపు గురిపెట్టి ఉండడం గమనించాడు. కాని మళ్ళీ ఏమనుకున్నాడో దించివేసి, "బయటకు తోసేద్దాం రా! ముందు వాడి జేబుల్లో ఏమైనా ఉంటే ఖాళీ చెయ్యి. పిచ్చివేషాలు వేశావంటే పందిని కాల్చినట్లు కాల్చేస్తాను" అన్నాడు ఇంగ్లీషులో. రామకృష్ణ కదలలేకపోయాడు. కపూర్ దగ్గరగావచ్చి చేతివెనుకతో రామకృష్ణ మొహంమీద కొట్టాడు. మెల్లిగానే కొట్టినా రామకృష్ణ పెదవి కొంచెం చిట్లింది. "విన్నా" అన్నాడు కపూర్ రివాల్వర్ పైకి ఎత్తుతూ.

రామకృష్ణ క్రిందికివంగి కమల్ సింగ్ శవాన్ని త్రిప్పాడు. కళ్లు తెరుచుకొని ఉన్నాయి. నోట్లోనుంచి కొంచెం రక్తం కారుతూ ఉంది. ఒకగుండు పొట్టలోనుంచి, తక్కినవి రెండూ వీపులోనుంచి దూసుకుపోయినాయి. నేలమీదకూడా కొంచెం రక్తం కారి ఉన్నది. రామకృష్ణ కాళ్లు కొంచెం వణకసాగాయి.

"వాడి జేబులోగుడ్డతీసి తుడిచెయ్యి" అని కపూర్ గొంతు వినిపించింది. వీలైనంతా బాడిగా తుడిచివేశాడు. కపూర్ ఆజ్ఞాపించి పట్టు శవంకాళ్ళు పట్టుకొని తలుపుదగ్గరకు లాక్కువెళ్ళాడు. కపూర్ తలుపుతీసి, "లైట్లు ఆర్పేస్తున్నాను. గొడవలేకుండా పనికానియ్యి," అని హెచ్చరించాడు.

తలుపు మూసినతర్వాత సామానంతా సర్దించాడు. కపూర్ కమల్ సింగ్ సామానంతా బయట విసిరిపారవేశాడు. నేలమీద రక్తపు మరకలు ఎండిపోతూ ఉన్నాయి. వాటిని తడిగుడ్డతో తుడవమని కపూర్ చెప్పాడు. రామకృష్ణ కపూర్ ఎదురుగానే గుడ్డను నీళ్ళతో తడిపి తుడుస్తున్నాడు. కపూర్ కాళ్ళుమాత్రం కనిపిస్తున్నాయి అతనికి.

"ఈ గుడ్డ నేం చేద్దామనుంటావ్?" అని తల పైకెత్తకుండానే అడిగాడు.

"చూద్దాం! అసలు నీసంగతేమిటా అని ఆలోచిస్తున్నాను."

"నన్నుకూడా కాల్చేస్తావా?" ఏదో కథలో పాత్రలాగ అడిగాడు ఈ ప్రశ్నను.

"ఎందుకూ! బులెట్లుదండగ?" కపూర్ నవ్వుతూ సమాధానమిచ్చాడు. "అంతా అయినతర్వాత చూద్దాంలే... ఈ రైలు స్పీడు ఏభై మైళ్ళుందా?" అని ఆలోచిస్తూ ఉండిపోయాడు.

రామకృష్ణ అమాంతంగా లేచి తనతలతో కపూర్ పొట్టలో కొట్టాడు. అతను బాగా అరిచి రివాల్వర్ను వదిలివేశాడు. రామకృష్ణ లేచి నుంచుని చెయ్యి వెనక్కిలాగి అతని మొహంలో గుద్దాడు. ఆ దెబ్బకి తన మోచెయ్యి అదిరిపోయింది. కపూర్ మూలుగుతూ వెనక్కి పడిపోయాడు. రామకృష్ణ మళ్ళీ రెండుమూడుసార్లు మొహంమీదా, పొట్టలోను బలంగా పిడికిలితో మోదాడు. కపూర్ ముక్కులోనుంచి రక్తంకారడం రామకృష్ణ చూశాడు. మళ్ళీ మళ్ళీ కొట్టాడు. వేళ్ళ కణుపులు వాచిపోయి నొప్పిపెట్టడం మొదలుపెట్టింది. రైలువేగం కొంచెంమారి కుదుపు ఎక్కువైపోయింది. కపూర్ తలుపువైపున్న సీటుమీద పడిపోయాడు. రామకృష్ణ ఇంకా ఒళ్ళు తెలియకుండా అతన్ని కొడుతున్నాడు. కపూర్ పెద్దప్రయత్నం చేసినుంచుని రామకృష్ణను తిరిగి కొట్టబోయాడు. ఆసమయంలో తలుపు విసురుగా తెరుచుకుని అతని తలకి వెనుక గట్టిగా తగిలింది. ముందుకు పడిపోతూ ఉండగా రామకృష్ణ ముందుకో బెట్టి మళ్ళీ కొట్టేందుకు చెయ్యి వెనక్కి తీశాడు. రైలుమళ్ళీ బాగా ఆడి కపూర్ వెనక్కి పడిపోయాడు, తలుపులోనుంచి బయటకి. రామకృష్ణ అతన్ని పట్టుకోబోయాడు కాని వీలులేకపోయింది. బయట చీకటిగా ఉన్నది. రైలు ఎత్తుగా ఉన్న కట్టమీద వెళ్తోంది. రామకృష్ణ బయటికివంగి రెండువైపులా చూశాడు. పక్కన పెట్టెలలో లైట్లువెలగడంలేదు. అంతేకాక రైలు వంపు తిరగడంలో అవతలవైపుకు వంగి ప్రయాణం చేస్తూ ఉన్నది. కపూర్ గట్టుమీదనుంచి దొర్లి కిందపడిపోయి ఉండాలి. తలుపుమూసి లోపలికివచ్చి కూర్చున్నాడు రామకృష్ణ. ఉద్రేకంలో కపూర్ను కొట్టాడుగాని ఇప్పుడు ఒళ్ళంతా వణుకు పుట్టింది. చేయి కొంచెం వాచి ఉన్నది. కొంతసేపటి తర్వాత బాత్ రూమ్లోకివెళ్ళి చన్నీళ్లతో చేతులూ మొహమూ కడుక్కుని వచ్చాడు. ఆముగురిని తక్కినవారి సామానూ బయటికి లాగాడు. ఒక్కొక్కటిగా బయటకు పారవేయడం మొదలుపెట్టాడు. లైట్లు ఆర్పిన తర్వాత. మళ్ళీ లైట్లువేసి కపూర్ పెట్టె మాత్రం తెరిచిచూశాడు. చిల్లర సామాను కాక, కొన్ని నోట్లకట్టలూ, పాత వార్తా పత్రికలలోనుంచి 'క్లిప్పింగ్సూ' కనుపించాయి. ఒకక్షణం ఆలోచించి ఆక్లిప్పింగ్స్ మాత్రం ఉంచుకొని తక్కినవాటిని పెట్టెలో పెట్టేసి బయటకు విసిరివేశాడు. ఆక్లిప్పింగ్స్లోని వార్తలన్నీ దోపిడీలకూ, దొంగతనాలకూ సంబంధించినవి. అన్నీ వీరు ముగ్గురూ కలిపి చేసినవయి ఉంటాయని నిశ్చయించుకున్నాడు.

కొంచెం నిద్దరావడం మొదలుపెట్టింది. లైట్లు తీసివేసి పడుకున్నాడు. జరిగినవన్నీ తను బయటపెట్టడమా వద్దా అని ఆలోచించాడు. అవసరంగా తను ఇబ్బందులలో చిక్కుకోవడం తప్ప వేరేమీ జరుగదని మాట్లాడకుండా ఊరుకోవడానికే నిశ్చయించుకున్నాడు.

రత్లాం స్టేషన్లో దిగగానే శ్రీనివాసరావు కనుపించాడు. "ఏమోయ్ ఒక్కడివే ప్రయాణం చేశావా?" అని అడిగాడు కంపార్ట్మెంట్లోకి చూస్తూ. ★



నక్షత్ర ఫలితాలు

[16-9-59 మొదలు 22 9 59 వరకు]

గ్రహ స్థితి.

శ			
	తే 17 దీని రవి కన్యలో ప్రవేశించి, బుధుడు కన్యలో ప్రవేశించును. కుంభ, మీన, మేష వృషభములలో చంద్రుడు.		
			ర బు శు
శ	గు		కు రా

* [అశ్విని చూ, చే, చో, లా] *

ఈ వారము మీరు తలపెట్టిన పనులలో జయము పొందుతారు. బంధుమిత్రులతో వినోదములలో పాల్గొని మృష్టాన్న భోజనము చేస్తారు. నీటిమీద ప్రయాణము చేయవలసి వస్తుంది విద్యార్థులు ఉత్సాహము గా చదువు కుంటారు. ప్రత్తి, దూది, నూలు, బట్టలు, వెండి, బియ్యము, ప్రత్తిపదార్థజనిత వస్తువులు క్రయ విక్రయములలో వర్తకులకు లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు మేలుకాలము.

* భరణి [లీ, లూ, లే, లో] *

ఈ వారము మీకు యోగప్రదము. ధన ధాన్యవృద్ధి కలుగుతుంది. ఇష్టవస్తులాభము పరోపకారమువల్ల కీర్తి కలుగుతుంది. వివాహాది శుభకార్యాలోచనలు ఫలప్రాప్తి పొందుతాయి విద్యార్థులకు చదువు బాగా సాగుతుంది ఖరీదైనవస్తువుల క్రయవిక్రయము లలో వర్తకులకు ఎక్కువలాభము కలుగుతుంది. ఉద్యోగస్థుల హోదా పెరుగుతుంది వాహనయోగము వుంటుంది. కవులకు గాయకులకు, కళాకారులకు మేలుకాలము. 17-న కుటుంబకలహము.

* కృత్తిక [అ, ఈ, ఊ, ఏ] *

మీకు ఈవారము కార్యభారముఎక్కువ. వింతమాటలు వినుట, పరాక్రమముచే ఘనత ప్రయాణము, ధనలాభము కలుగుతవి. అనారోగ్యసూచనలు కనబడగానే జాగ్రత్త పడుట మేలు. ఉద్యోగస్థులకు స్వల్పఅనుకూలత, విద్యార్థులకు చదువుసరిగా జరగదు రాజకీయవాదులకు ఆందోళనతో పాటు అనుకూలత. 17, 18 అనారోగ్యసూచన. 19,20,21పితృవర్గ సహాయము, కార్యలాభము ప్రయాణము

* రోహిణి [ఓ, వా, వీ, వూ] *

ఈ వారము మీరు చేపదలుచుకున్న పనులకు ఆలస్యము కలుగుతుంది. అన్ని విధాల నిరాశ కలిగినమీదట అజ్ఞాత మిత్రుని సహాయమువల్ల విచిత్రముగా కార్యలాభ మును పొందుతారు. వర్తకులకు లాభము తక్కువ. ఆత్మీయుల అనారోగ్యమువల్ల చికాకు కలుగుతుంది. ఉద్యోగస్థులకు వన పర్వత ప్రాంతములకు బదిలీ అయే సూచన లున్నవి. రహస్యములను కనిపెట్టుటకు నియో గించబడుతారు. వారమంతా చికాకుగా వున్నా వారాంతమునకు కార్యసిద్ధి కలుగు తుంది.

బి. నరసింగరావు

* మృగశిర [వే, వో, కా, కీ] *

ఈ వారము మీకు ధనాభావము ఎక్కువ. ఎవరిసహాయమువల్ల కార్యలాభము పొందుదామనుకున్నారో వారివల్లనే ఆటంకములు కలుగుతాయి. అయిననూ ఈశ్వరానుగ్రహమువల్ల క్రమేణా కార్యానుకూలత కలుగుతుంది. ఇంట్లో వారి ఆరోగ్యభంగముచే ఆందోళన చెందుతారు. ఉద్యోగస్థులకు ఒత్తిడి. వర్తకులకు నిరాశ వారమంతా ఆందోళనగా వున్నా సాధుసాంగత్యము, పుణ్యక్షేత్ర సందర్శనము, దేవతాదర్శనము, వింతలను చూచుట, నష్టద్రవ్య లాభము కలుగును.

* ఆరుద్ర [కూ, ఖ, జ, ఛ] *

ఈ వారము మీకు అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. శిరోధిక్యముతో యత్నకార్యములు ఫలిస్తాయి. కోర్టుదావాలు అనుకూలిస్తాయి. పరోపకారము చేయదలచుకొని సాగక నిందలు పొందుతారు. ఇచ్చిపుచ్చుకొనే వివాదాలు. ఉద్యోగస్థులకు అధికారుల ఒత్తిడివున్నా తోటివారి సహాయము కలుగుతుంది. భార్యకు అనారోగ్యము చేసే సూచనలున్నాయి. వారమంతా నిరాశగా వున్నా వారాంతమునకు కొంతవరకూ కార్యసిద్ధి అవుతుంది.

పునర్వసు [కే, కో, హా, హీ] *

ఈ వారము మీరు ఎన్ని ఆటంకములు కలిగినా నిరుత్సాహపడక పట్టుదలతో ప్రయత్నించి కార్యలాభము పొందుతారు. ఆశించిన సౌమ్య అనుకున్న వేళకు అందక అప్పు చేసినను, వారాంతమునకు సోదర సహాయమువల్ల తీర్చకలుగుతారు. ఆత్మీయులవల్ల నిందలు పొందుతారు. దెబ్బలు తగిలే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. గనుల యజమానులకు, ఇంజనీరింగుశాఖ ఉద్యోగులకు, రంగులు, లోహపు సామానుల వర్తకులకు శ్రమతో కూడిన లాభ యోగము. 17 న ప్రమాదసూచన.

* పుష్యమి [హూ, హే, హో, డా] *

ఈవారము మీకు యోగప్రదముగా వుంటుంది. ఆశించిన డబ్బు చేతికి వస్తుంది. కోర్టుదావాలు అనుకూలిస్తవి. బంధుసహాయమువల్ల అధికారుల సహాయమువల్ల ఆటంకములను గడిచి ఫలమును పొందుతారు. వైద్య జ్యోతిషశాస్త్ర ప్రసంగాలు చేస్తారు. ఈశాన్యదిక్కునుండి క్షేమవార్త తెలుస్తుంది. గణితశాస్త్రజ్ఞులకు, కవులకు, శిల్పులకు, నటీనటులకు యోగకాలము. 19, 20 ధనలాభము కార్యసిద్ధి

ఆశ్లేష [డీ, డూ, డే, డో]

ఈవారము మీకు యోగదాయకముగా వుంటుంది. భాగ్యలాభము, పుత్రసంతోషము కలుగుతవి. పండితగోష్ఠి జరిపి నూతన విష

ఈవారపు ధరలు:

నూలు, వస్త్రములు:—నిలకడగావుండును నూనెదినుసులు.—మందకొడిగా వుండును ఆహారధాన్యములు:-సమస్థాయినుండును బెల్లము, పంచదార, చింతపండు:- మార్పు లేదు.

పప్పుదినుసులు :—నిలకడగా వుండును. వెండి, బంగారము:-స్వల్పముగా తగ్గును. సువృష్టిగాను, సస్యానుకూలముగా వర్షించును.

జన్మనక్షత్రమును బట్టిగాని, జన్మనక్షత్రము తెలియనివారు నామనక్షత్రము (వారివారి పేర్లననుసరించి పేరు మొదటి అక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకోనువది. కృష్ణ అను పేరుగలవారు మృగశిరానక్షత్రమును, హృషీకేశ అను పేరువారు స్వాతియును, శ్రీనాథ అను పేరుగలవారు చిత్తయును, క్షేత్రపాలుడు అను పేరుగలవారు హస్తయును, భీముడు, భైరవుడు అనే పేర్లవారు పూర్వాషాఢయును చూచుకోనువది.

★ నక్షత్రఫలితాలు ★

యాలు తెలుసుకుంటారు. నూతన కార్యారంభమునకు ప్రయత్నములు చేస్తారు వారమంతా శుభయోగాలతో కూడివున్నా కొంత ఆందోళనకూడా వుంటుంది. 17, 18 అనుకోని అధిక ఖర్చులు. 19, 20, 21 ధనలాభము కార్యసిద్ధి, న్యాయవాదులకు, న్యాయస్థాన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పండితులకు మేలు కాలము. విద్యార్థులకు చదువు బాగా సాగుతుంది.

*** మఖ [మా, మీ, మూ, మే.]**

ఈ వారము వినోదములలో పాల్గొనుటవల్ల, క్షీర మధురపదార్థయుక్త భోజనము వెండిపాత్రలలో చేయుట, యత్న కార్యములలో జయము, నీటిమీద ప్రయాణము, తెల్లని వస్తువులు కొనుట, మొదలగు యోగములు కలుగును. ప్రత్తి, దూది, నూలు, బట్టలు, వెండి, బియ్యము. ద్రవపదార్థజన్యముల క్రయవిక్రయములలో వర్తకులకు లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు మేలుగా వుంటుంది. విద్యార్థులకు మంచి కాలము. 17, 18 అధిక ఖర్చులు. ఆందోళన. ఆపైని ధనలాభము, కార్యసిద్ధి.

*** పూర్వఫల్గుణి (పుబ్బ) ***
మో, టా, టీ, టూ

ఈ వారము మీకు ఇష్టవస్తులాభము. ధనధాన్యవృద్ధి, కృషి మూలకముగా లాభము. వివాహాది శుభకార్యముల గురించి ఆలోచనలు పరోపకారమువల్ల కీర్తివంటి రాజయోగములు కలుగుతవి. బంగారు నవరత్నములు మొదలగు విలువగల వస్తువుల క్రయవిక్రయములలో వర్తకులకు ద్విగుణీకృత లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము. ఆప్తులతో విందు, వినోదము. విద్యార్థులకు మేలుగా వుంటుంది.

*** ఉత్తరఫల్గుణి (ఉత్తర) ***
(టే, టో, పా, పీ)

ఈ వారము మీకు కార్యభారము ఎక్కువ. రాబడి తక్కువ. గృహావసరములు తీరక కలతలు. ఆరోగ్యము సరిగా లేని సూచనలు కనబడగానే ఔషధచికిత్స పొందడమే కాకుండా గ్రహరాజైన రవికి శాంతి చేయించుట మేలు. ఉద్యోగస్థులకు కొత్త సమస్యలు. అడవి పంటల క్రయవిక్రయములలో వర్తకులకు యోగప్రదము. 17, 18 అనారోగ్య సూచనలు 20, 21, 22 ప్రయాణము పితృవర్గ సహాయము, ధనలాభము.

*** హస్త [పూ, ష, ణ, ఠ] ***

ఈ వారము మీకు మిశ్రమయోగము. మొదట్లో నిరాశగావున్నా క్రమేణా మిత్ర సహాయమువల్ల కార్యలాభము పొందుతారు ధనలోపముచే ఆందోళన కలుగుతుంది. విద్యార్థులకు చదువు సాగదు. ఆప్తుల ఆరోగ్యము ఆందోళన కలిగిస్తుంది. వారములో అవయోగములున్నా మిత్రసహాయము కార్యసిద్ధి, అన్యులపరిచయము విచిత్రవస్తు సంపాదన వంటి శుభయోగములుకూడా వుంటవి.

చిత్త [పే, పో, రా, రీ]

ఈ వారము మీరు సహాయము పొందదలచుకున్న వ్యక్తి మూలకముగా కార్యహాని కలుగుతుంది. ధనాభావంకూడా ఎక్కువ. ఇంట్లోవారి ఆరోగ్యము ఆందోళన కలిగిస్తుంది. ఆధ్యాత్మిక చింతవల్ల దైవముపై భారము వేసి కార్యలాభము పొందుతారు. ఉద్యోగస్థులకు ఒత్తిడి. వ్యాపారస్థులకు నిరాశ. విద్యార్థులకు మంచికాలము. కాదు. పుణ్యక్షేత్ర సంచారము. దేవతాదర్శనము విచిత్రములను చూచుట జరుగును. వారమంతా అవయోగ శుభయోగ మిశ్రమముగా వుంటుంది.

*** స్వాతి [రూ, రే, రో, తా]***

ఈ వారము ఎన్నో ఆటంకములు వచ్చినను పట్టుదలతో ప్రయత్నించడమువల్ల కూడా లాభము అట్టే కలుగదు. తలపెట్టిన పనులు ఎక్కువ శ్రమతో ఫలిస్తాయి. కోర్టు దావాలు అనుకూలిస్తాయి. ఇతరులకు సహాయము చేయబోయి ఫలించక నిందలు పొందుతారు. లావాదేవీలలో వివాదములు కలుగుతాయి. ఉద్యోగస్థులకు అధికారుల అనాదరణ, తోటివారి సహకారము వుంటాయి. వర్తకులకు వారమంతా నిరాశ వారాంతమున మేలు. 18న భార్య అనారోగ్యముచే ఆందోళన, విద్యార్థులకు చదువు బాగా సాగదు.

*** విశాఖ [తీ, తూ, తే, తో] ***

ఈ వారము పట్టుదలతో ప్రయత్నించడమువల్లను కార్యలాభము పొందుతారు. ఆశించిన డబ్బు సమయానికి అందక అప్పు చేస్తారు. దెబ్బలు తగిలే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. రసాయనిక శాస్త్రజ్ఞులకు, లోహసామానులు, రంగుల వ్యాపారస్థులకు, కష్టముతో కూడిన లాభము, గనుల యజమానులకు యంత్రము నడుపు నిపుణులకు, ఇంజనీరింగు శాఖ ఉద్యోగులకు మేలు కాలము.

*** అనూరాధ [నా, నీ, నూ, నే] ***

ఈ వారము మీకు యోగకాలము. బంధు సహాయము, అధికారుల సహాయము కలుగుటచేతను అన్ని చిక్కులు వీడి కార్యసిద్ధి అవుతుంది. ఆదాయము వృద్ధి పొందుతుంది. శాస్త్ర ప్రసంగాలలో పాల్గొంటారు. కవులు నూతనరచనలు చేస్తారు. బంధువుల క్షేమవార్త తెలిసి సంతోషము పొందుతారు. విద్యార్థులకు ఉత్సాహముగా వుంటుంది. గణితశాస్త్రజ్ఞులకు, కవులకు, శిల్పులకు, నటీనటులకు మేలు కాలము.

*** జ్యేష్ఠ [నో, యా, యీ, యూ,] ***

ఈ వారము మీకు మీకు మంచి భాగ్యయోగము అనుకున్న డబ్బు చేతికివస్తుంది. ఇబ్బందులు తీరుతవి. దావాలలో గెలుపొందుతారు. పిల్లల అభివృద్ధికి చేసే ప్రయత్నాలు ఫలిస్తవి. నూతన గ్రంథములు చదువుటవలన విజ్ఞానాభివృద్ధి అవుతుంది. విద్యార్థులకు మేలు కాలము. న్యాయస్థాన ఉద్యోగులకు. న్యాయవాదులకు పండితులకు, ఉపాధ్యాయులకు యోగప్రదం.

*** మూల [యే, యో, బా, బి] ***

ఈ వారము మీకు యోగదాయకము. ధనయోగము కలుగుతుంది. సంగీతసభలు, కవితాగోష్ఠివంటి వినోదాలలో పాల్గొని మృష్టాన్న భోజనము వెండిపాత్రలలో చేసారు. శుభకార్యాలోచనలు చేస్తారు. నూలు, బట్టలు, బియ్యము, వెండి వర్తకులకు లాభము, విద్యార్థులు ఉత్సాహముగా చదువుకుంటారు. కవులకు, గాయకులకు, కళాకారులకు నటీనటులకు మేలుగా వుంటుంది.

పూర్వాషాఢ [బూ, ధ, భా, డా]

ఈ వారముకూడా మీకు గత వారమువలె నే యోగదాయకంగా వుంటుంది. అసంపూర్తిగా వుండిపోయిన పనులు లాభదాయకముగా ముగుస్తవి. పుణ్యకార్యాలలో పాల్గొంటారు. నూతన గృహనిర్మాణమునకు ఆలోచనలు చేస్తారు ఉద్యోగస్థులకు హోదా పెరుగుతుంది వర్తకులకు విలువగలవస్తువులు క్రయవిక్రయములలో ఎక్కువ లాభము. వారమంతా శుభయోగములతో కూడివున్నా వారాంతమున కుటుంబ కలహముచే ఆందోళన కలుగుతుంది. స్త్రీలతోనూ, ఆప్తులతోనూ విందు, వినోదము, విద్యార్థులకు మేలుగా వుంటుంది.

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

ఈ వారము రాబడి తక్కువ. ఖర్చులు ఎక్కువ గృహావసరములు తీరక స్పర్ధ వస్తాయి. అనారోగ్య సూచనలు కనపడగానే ఔషధ చికిత్స పొందడము, రవికి శాంతిచేయించ

డము మంచిది. ఉద్యోగస్తులకు కొత్త పను ల్యలు. వర్తకులకు ఆందోళన విద్యార్థులకు చదువు సరిగా జరుగగు. వారమంతా భయాందోళనలతో కూడివున్నా పితృవర్గ సహాయము, కార్యలాభము కలుగుతవి.

* శ్రవణము [జూ, జే, జో, ఘూ] *

ఈ వారము నిరాశగా వున్నా మిత్రుల సహాయమువల్ల ఆందోళన తొలుగుతుంది. ఉద్యోగస్తులకు స్వల్ప అనుకూలత, వర్తకులకు వారాంతమందు లాభం, వారమంతా ఉద్రేకముగా వుంటుంది. విదేశీయుల పరిచయము, అపురూప వస్తుసంపాదన కలుగుతాయి 18 న అధిక ఖర్చులు, మనోవ్యధ, విద్యార్థులకు బద్ధకమువల్ల చదువు సాగదు

* ధనిష్ఠ [గా, గీ, గూ, గే] *

ఈ వారము మీకు మిశ్రమయోగము. ఆశించిన సహాయము లభించక అవసరములు తీరక ఆందోళన కలుగుతుంది. అయినప్పటికీ దైవానుగ్రహమువల్ల కష్టములు గడిచి కార్యసిద్ధి పొందుతారు ఉద్యోగస్తులకు అధికారుల అనాదరణ, వర్తకులకు చాంచల్యము, పుణ్యపురుషుల సాంగత్యమువల్ల మనోవికాసము కలుగుతుంది. వారమంతా అశాంతిగా వున్నా సద్రవ్యలాభము పొందుతారు 18 న అధిక ఖర్చులు

* శతభిషం [గో, సా, సీ, సూ] *

ఈ వారము అనుకూలతకన్నా ప్రతికూలత యెక్కువ ఇచ్చిపుచ్చుకునేపట్ల వివాదాలు వచ్చి మనోవ్యధ కలుగుతుంది. కోర్టు వ్యవహారములు అనుకూలించినా అమిత ఖర్చులవల్ల ఆ సంతోషము వుండదు. భార్యకు అనారోగ్యము కలిగేసూచన లున్నవి మినుములు, కొర్రలు, రాగులు, ఉప్పు, నువ్వులు, నూనె వ్యాపారస్తులకు లాభయోగము. ఇతర జాతులవల్ల గౌరవము కలుగుతుంది 17, 18 భార్యకు అనారోగ్యము, బంధువుల రాక, అధిక ఖర్చులు.

* పూర్వాభాద్ర, [సే, సో, దా, దీ] *

ఈ వారము ఎంత ప్రయత్నించినా యత్నకార్యములకు ఆటంకములు కలుగుతునే ఉంటవి అయిననూ పట్టుదలతో యత్నించి కార్యలాభము పొందుతారు. సోదరసహాయమువల్ల ఒడిదుడుకులు సర్దుకుంటాయి దెబ్బలుతగిలే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. గనుల యజమానులకు, లోహ, ఖనిజ వ్యాపారస్తులకు, పోలీసుశాఖ వుద్యోగులకు మేలుకాలం. 17, 18 ప్రమాద సూచన, అధిక ఖర్చులు.

* ఉత్తరాభాద్ర [దూ, శం, ఝా, థా] *

ఈ వారము మీకు యోగకరము. ప్రయత్నించినపనులు నెరవేరుతవి. ధనలాభము కలుగుతుంది. ఈశాన్య దిక్కునుండి క్షేమ వార్త తెలుస్తుంది శుభ కార్యములలో పాల్గొంటారు. బంధుదర్శనము కలుగుతుంది. గణితజ్యోతిషశాస్త్ర చర్చలు జరుపుతారు. ప్రత్తి, దూది, నూలు, బటలు ఇత్తడ, కంచు వర్తకులకు లాభదాయకము. కవులకు శిల్పులకు, నటీనటులకు మేలుకాలము. 19, 25 న కార్యసిద్ధి 22 న అధికఖర్చులు

* రేవతి [దే, దో, చా, చీ] *

ఈ వారము మీకు శుభయోగము ఆశించిన డబ్బు చేతికివస్తుంది ఇంట్లో శుభకార్య ప్రయత్నములు చేస్తారు ధర్మకార్యాచరణ, ప్రభుత్వ సన్మానము. శాస్త్ర చర్చలు జరుగుతవి విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకుంటారు న్యాయవాదులకు న్యాయస్థాన ఉద్యోగులకు మేలుగా వుంటుంది. ఇంట్లో వున్న వారి అనారోగ్యమువల్ల కలిగిన ఆందోళన తొలగుతుంది. పిల్లల లాభక్షేమములకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి పండితులకు, ఉపాధ్యాయులకు యోగదాయకముగా వుంటుంది ★

బాల సాహితి

పరమానంద[illegible] విప్రుడు

భోగాది రామకృష్ణ

పూర్వం ఒక గ్రామంలో శివశాస్త్రి అనే యువకుడు ఉండేవాడు. అతడు వట్టి వెర్రివాడు, చదువు రానివాడు కావటంచేత అందరు అతనిని పరిహాసించేవారు. అతను అత్తవారింటికి వెళ్లినప్పుడు కూడ అంగరిచేత ఎగతాళి చేయబడటంచేత అతనికి కోపంవచ్చి, విద్యను నేర్చుకోవాలని బయలుదేరాడు

అతడు చాలారోజులు ప్రయాణం చేసి చేసి ఒక గ్రామం చేసుకున్నాడు. ఆ గ్రామంలో శంభుశాస్త్రి అనే పండితుడు వున్నాడు. ఆయనకు రాని సామెతంటూ లేదు ప్రపంచంలో లేదు. అందువలన ఆ గ్రామంలోని వారు శంభుశాస్త్రి గారిని సామెతలశాస్త్రి అని పిలిచేవారు. శివశాస్త్రి ఆయన కీర్తి విని శంభుశాస్త్రి దగ్గరకు వెళ్లి "స్వామీ నేను చాలా దూరంనుండి జ్ఞాన సంపాదనకొరకు వచ్చాను నన్ను మీ శిష్యునిగా చేసుకొని మీ సామెతలన్నీ నాకు నేర్పి నన్ను కృతార్థుని చేయండి" అని ప్రార్థించాడు

సామెతలశాస్త్రిగారు అందు కంగీకరించాడు ఆరు నెలల వరకు శివశాస్త్రి ఆయనవద్ద అన్ని సామెతలు క్షుణ్ణంగా కంఠస్థం చేశాడు.



"నే నేర్పినసామెతలు జీవితంలో ఉపయోగించుకొని సుఖపడు" అని ఆశీర్వదించి తనగురుదక్షిణతీసుకొని పంపాడు.

ఆరు నెలల పిదప సామెతలశాస్త్రి "నాయనా, నీ విద్య ముగిసింది నీ విప్పుడు పండితుడవు నే నిప్పుడు నేర్పిన సామెతలు జీవితంలో ఉపయోగించుకొని సుఖపడు" అని ఆశీర్వదించి, తన గురుదక్షిణ తీసుకొని పంపాడు.

శంభుశాస్త్రివద్ద సెలవు తీసుకొని, శివశాస్త్రి స్వగ్రామానికి బయలుదేరాడు అతని వేషం చూచి, ప్రజలు అతనిని గౌరవించి సాగనంపేవారు. ఆ విధంగా బయలుదేరి, శివశాస్త్రి ఒక అడవిగుండా ప్రయాణం చేయసాగాడు కొంత దూరం వెళ్లేసరికి అతనికి ఒక గాడిద శవం కనబడింది 'అనాధ ప్రేతానికి దహనసంస్కారం చేస్తే పుణ్యం వస్తుంది' అనేసామెత వుంది. అందువలన ఆశవానికి దహనసంస్కారం చేస్తే పుణ్యం వస్తుందని శివశాస్త్రి ఆ చచ్చిన గాడిదను బుజాన వేసుకొని బయలుదేరాడు. చివరకంత బరువు మోయటం కష్టమనిపించింది శివశాస్త్రికి. 'సర్వస్య గాత్రస్య శిరః ప్రధానమ్.' శరీరంలోకల్లా శిరం ముఖ్యము గదా! అనుకొని తల నరికి బయలుదేరాడు

కొంతదూరం పోయేసరికి ఆ తల కూడా బరువుగాతోచి, 'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం.' ఇంద్రియాల్లో కళ్లు ముఖ్యం కాబట్టి కళ్లు మాత్రం చాలు' అని ఆగాడిదకళ్లు తీసుకొని బయలుదేరాడు శివశాస్త్రి.

ఆ అడవికి ఒకరాజు వేటకు

(42 వ పేజి చూడండి)

ఆంధ్ర సచిత్ర వారపత్రిక: బాలల సంఘం

దసరా ప్రత్యేక సంచికలో

కథలపోటీ - వ్యాసాలపోటీ.

సెప్టెంబరు 21 లోగా రచనలు మాకు చేరాలి.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక "బాలల సంఘం" సభ్యులకు రెండవసారిగా రచనల పోటీ ఏర్పాటు చేస్తున్నాము. పోటీ ఫలితాలు దసరాకు వెలువడే ప్రత్యేక సంచికలో (14-10-59) ప్రకటిస్తాము. రచనలకు గడువు తేదీ (21 9 59) వ్యవధి తక్కువగా ఉన్నందున సభ్యులు త్వరపడాలని కోరుతున్నాము

ముఖ్య విషయాలు

ఈ క్రింది విషయాలు జాగ్రత్తగా చదివి మీ రచనలు పంపండి

(1) ఇప్పటవరకు సభ్యత్వపు కార్డులు అందినవారు మాత్రమే ఈ రచనల పోటీలో పాల్గొనాలి

(2) రచనమీద సభ్యుని పూర్తిపేరు, చిరునామా, సభ్యత్వపు సంఖ్య, పుట్టిన తేదీ, A వర్గమో, B వర్గమో స్పష్టంగా వ్రాయాలి.

(3) ఈ ప్రక్కన ఉన్న "కూపన్" (పోటీ చీటి) లో సభ్యుడు ...లన్నీ జాగ్రత్తగా నింపి, కత్తిరించి, రచనకు జతచేసి పంపాలి. ...టీ జతచేయని రచనను పోటీకి స్వీకరించేది లేదు.

(4) రచన చక్కగా విడివిడి అక్షరాలతో దూరపు పంక్తులలో ...ాలి. కాగితానికి ఒకవైపే వ్రాయాలి 'A' వర్గం సభ్యులు కథలు 4 అరటావులలోను, 'B' వర్గం సభ్యులు తమ వ్యాసాలు అరటావులోనూ వ్రాయాలి

(5) రచన పెట్టిపంపే కవరు వెనుకవైపు "సచిత్ర వారపత్రిక ...లసంఘం పోటీ రచన" అని వ్రాయాలి A, B వర్గాలలో ఏదో ...వ్రాయాలి

(6) సభ్యత్వపు కార్డులలో ఏ వర్గానికి చెందినట్లు ఉన్నప్ప... వచ్చే విజయదశమినాటికి (11-10-59) సభ్యుడు, లేక సభ్యురాలు పదేళ్లు దాటినట్లయితే A వర్గానికి చెందినట్లు, పదేళ్ళ లోపునే ఉన్నట్లయితే మామూలుగా B వర్గానికే చెందినట్లు గ్రహించి ఆ విధంగా పోటీచీటి పూర్తిచేసి, తమ వర్గాలకు పెట్టిన పోటీలో పాల్గొనాలి. 15 ఏళ్లు దాటినవారికి సభ్యత్వం రద్దయిపోతుంది గనుక, వారు పోటీలో పాల్గొనవీలులేదు.

(7) సెప్టెంబరు 21 తరువాత వచ్చేవాటిని పోటీకి స్వీకరించేది లేదు. పోటీలో నెగ్గని రచనలు తిప్పిపంపటం సాధ్యంకాదు. కనుక స్టాంపులు పెట్టవద్దు.

(8) A వర్గం పోటీకి ప్రథమ ద్వితీయ స్థానాలలో వచ్చిన వారికి రెండు బహుమతులు, అదేవిధంగా B వర్గానికి రెండు బహుమతులు ఇస్తాము. బహుమతి పొందిన రచనలను దసరా సంచికలో రచయితల ఫొటోలతో ప్రకటిస్తాము. ఏ బహుమతు లిచ్చినదీ ఆ సంచికలోనే ప్రచురిస్తాము.

(9) బహుమతుల విషయంలో అంతిమ నిర్ణయం పోటీ నిర్వాహకులదే. ఈ విషయమై ఏవిధమైన ఉత్తరప్రత్యుత్తరాలకు అవకాశం ఉండదు

★

పోటీ రచనాంశాలు

A వర్గం సభ్యులకు

మీ ఇష్టంవచ్చిన కథ

[రచన స్వతంత్రమైనదిగా ఉండాలి 4 అరటావులకు మించకుండా ఒకవైపునే వ్రాయాలి.]

★

B వర్గం సభ్యులకు

మీ స్కూలు

[ఒక అరటావులో ఒకవైపునే వ్రాయాలి]

పోటీ చీటీ

[సభ్యులు తమ రచనలకు దీన్ని జతపరచాలి]

వర్గము .. A లేక B

సభ్యత్వపు సంఖ్య

సభ్యుని లేక సభ్యురాలి పూర్తిపేరు

పుట్టిన తేదీ నెల సం॥

తరగతి లేక ఫారము ..

పాఠశాలపేరు ...

పూర్తి చిరునామా

పరమానందయ్య...

[40-వ పేజీ తరువాయి]

వచ్చాడు. శంభుశాస్త్రి నేర్పిన సామెతలలో మహారాజు విష్ణు స్వరూపంతో సమానమని ఒకసామెత వుంది అందుచేత శివశాస్త్రి రాజును చూడబోయాడు. కాని రాజువద్దకు, భార్యాబంధువుల వద్దకు ఉత్తచేతులతో పోకూడదని ఒకసామెతవుంది. అందుకని శివశాస్త్రి రాజువద్దకు వెళ్లి తన దగ్గరున్న గాడిద కళ్లు సమర్పించాడు.

"ఏమిటివి" అని మహారాజు ప్రశ్నించాడు. "గాడిదకళ్లు" అని జవాబిచ్చాడు శివశాస్త్రి మహారాజు కోపించి శాస్త్రిని సేవకుల తో కొరడతో కొట్టించాడు 'కష్టాలు మేలుకే వస్తా'యని ఒకసామెత వుండటం చేత శివశాస్త్రి ఆ దెబ్బలను ఓర్పుతో సహించాడు

తరువాత శివశాస్త్రి పండితుడని తెలుసుకొని రాజు జాలిపడి శివశాస్త్రిని తమ రాజ్యానికి ఆహ్వానించాడు అతనికి కొన్నిరోజుల పాటు ఒక విడిది ఏర్పరచాడు దెబ్బలకు పరిహారంగా శివశాస్త్రిసుఖంగా కొన్నిరోజులు గడిపాడు

ఒకనాడు శివశాస్త్రి రాజదర్శనం కోసం అంతఃపురానికి వెళ్లాడు. పండితుడని ఎవరూ అడ్డగించలేదు. ఆ సమయంలో మహారాజు రాణిగారి తొడమీద తలవుంచి నిద్రపోతున్నాడు శివశాస్త్రి నిర్భయంగా అక్కడకు వెళ్ళి, రాణిగారి రెండవ తొడమీద తలపెట్టి పడుకున్నాడు రాణి అదిరిపోయి మహారాజును లేపింది రాజు కోపంతో 'ఎందుకిట్ల చేశా'వని అడుగగా శివశాస్త్రి 'యథారాజా తథాప్రజా' 'రాజెట్లావుంటే ప్రజలట్లా వుంటారు అందుకు మీరున్నచో నేనున్నా'నని అన్నాడు మహారాజు వెంటనే శివశాస్త్రిని బయటకు గెంటించాడు.

శివశాస్త్రి తిరిగి యిల్లు చేరుకున్నాడు అత్తగారు అల్లుడు వచ్చాడని ఆనందంతో ఆహ్వానించింది గౌరవ మర్యాదల తర్వాత స్నానానికి నీళ్లుతోడి అల్లుడిని పిలిచింది బిందెలో నీళ్లు చూచి శివశాస్త్రి 'కదలని నీరుకంటె పారే నీరు మంచిద'ని ఆ బిందెడు నీళ్లు తూములో పోసి "హరహరా" అని దొర్లసాగాడు. అంతా అది శివశాస్త్రి కలవాటని ఊరకున్నారు.

స్నానం తరువాత భోజనానికని పీట వేశారు, కొత్తల్లునికి మెత్తని ఆసనం పనికి రాదని, శివశాస్త్రి పిడకల మీద కూర్చున్నాడు అక్కడికే అత్తగారు భోజనం తెస్తే, 'భోజనం కన్నా పిండి మంచి'దని శివశాస్త్రి అక్కడే పళ్లెంలో వున్న పిండి బొక్కసాగాడు 'ఒట్టి పిండి తింటావేం నాయనా' అని అత్తగారు నెయ్యి తెచ్చివేస్తే, నెయ్యికన్నా ఆముదం మంచిదని, ఆముదం పోసుకొని పిండినంతా ఆరగించాడు.



"ఇంకా రిపోర్టు కూడా ఎందుకురా అబ్బాయ్! నీ చొక్కా చూస్తేనే తెలుస్తున్నాయిగా మార్కులు"

—చిత్రం. జి. వినాయకమ్మ-హైదరాబాదు.

ఇదంతా శివశాస్త్రిపద్ధతి లెమ్మని అంతా అనుకొన్నారు.

భోజనం అయిం తర్వాత శివశాస్త్రి భార్య అతనివద్దకు వచ్చింది. ఆమె చాలా అందకత్తె 'భార్యా రూపవతీశత్రుః' అని ఒక సామెత వుంది 'ఈమె నాకు శత్రువ'ని కోపంతో ఆమె ఒక కన్ను పొడిచివేశాడు. ఒక కన్ను పోయిన స్త్రీ దేశసంచారం చేస్తుంది. 'ఏకాక్షీ దేశసంచారి' అని ఒక సామెత గురువుగారు శివశాస్త్రికి చెప్పాడు అందుచేత భార్య దేశాటన చేస్తుందని భయపడి శివశాస్త్రి ఆమె రెండవకన్ను కూడ పొడిచివేశాడు.

రెండుకళ్లూ పోవటంతో శివశాస్త్రి భార్య గగ్గోలు పెడుతూ అటూ యిటూ పరిగెత్తే సరికి, గూట్లో దీపం ఆమె చేతికి తగిలి క్రిందపడి క్రమేణా యిల్లంతా నిప్పు అంటుకొని వ్యాపించింది ఇంట్లోని వారంతా బయటకు పరిగెత్తి యిల్లు ఆర్ప సాగారు కాని శివశాస్త్రి యింటికి నిప్పంటుకోనిచోట్ల నిప్పంటించ సాగాడు బావమరదులంతా 'యిదేమిట'ని కోప్పడితే "ఉష్ణం ఉష్ణేన శీతలం." నిప్పుకు నిప్పు రగిలితే చల్లారుతుంది అని శివశాస్త్రి హితబోధ చేయసాగాడు బావమరుదులు ఆగ్రహంతో వాడిని తన్ని సాగనంపారు

చూశారా, మూర్ఖంగా సామెతలు తెలుసుకొని, వాటిని సరిగ్గా అర్థం చేసుకోకుండా ఆచరించటం వల్ల శివశాస్త్రి ఎన్ని బాధలు పడ్డాడో, ఎన్నిబాధలు పెట్టాడో. కాబట్టి మనం ఏవిషయాన్ని అపార్థం చేసుకొనకుండా ఆచరణలో పెట్టాలి. లేకపోతే ఆపదలు తప్పవు. ★

హార్నీ రామూ!

పాలడుగు వెంకటేశ్వరరావు

రాధా రమణా బళ్ళోంచి వొస్తున్నారు, గంతులేసుకుంటూ చెరువు కట్ట పక్కనే నిద్రగన్నేరు చెట్టువద్ద మలుపు తిరిగేసరికి, రమణకళ్ళకి ఏదో తళుక్కుమన్నట్టుయింది "ఏమేవ్! అటు చూడు!" అన్నాడు రాధారాణి పెద్దవయిన కళ్ళని అటు తిప్పి చూసింది మట్టిలో ఒకమూల తెల్లగా మెరుస్తూ ఏదో కనిపించింది గభాల్న అక్కడికెళ్ళి చూపుడు వేలితో కెలికి చూసింది రాధ గుండ్రంగా తెల్లగా మెరిసింది రూపాయి సూర్యకాంతిలో "అది నేను చూశాను నాది" అంది రాధ గర్వంగా.

"పాపం! ఎవరిదో పారేసుకున్నారు వాళ్ళకి ఇచ్చేదాం" అన్నాడు రమణ "మా ఆశ్మె ! పాపం! నాకు దొరికింది. నేను రోజూ ఈ డబ్బులు పెట్టి పువ్వులు కొనుక్కుంటాను" అంది రాధ కళ్ళుతిప్పుతూ.

"ఏమిటమ్మా! అది ముందర చూసింది నేను కాదా!" అన్నాడు రమణ. ఈలోగా అక్కడికి మాష్టారు వచ్చారు "ఏమిట్రా!" అంటూ

సంగతంతా చెప్పాడు రమణ. "నేను చూశాను గనుక అది నాదండీ! కదండీ. !" అన్న రమణని అవతలికి తోసి "దాన్ని తీసింది నేనూ అది దొరికింది నాకు" అని కళ్ళాడించింది రాధ.

"ఆగండి పిల్లలూ! నేను ఒక ప్రశ్న వేస్తాను దానికి సమాధానం చెప్పినవాళ్ళకి ఆ రూపాయి ఇస్తాను" అన్నారు మాష్టారు అల్లాగే నన్నారు ఇద్దరూ

"ఎదురుగా కాలవ ఉంది చూశారా? అందులో నీళ్ళు ఒక్క చుక్క లేకుండా ఎవళ్ళు తాగితే రూపాయి వాళ్ళకిస్తాను" అన్నారు మాష్టారు.

"ఆ నీళ్ళన్నీ ఒక్క చుక్క లేకుండా ఎల్లాగండీ!" అని ఇద్దరూ తెల్ల మొహాలు వేశారు.

ఇంతలో అక్కడికి రాము వచ్చాడు రాము పేదవాడు

చదువుకోటానికి పుస్తకం లేగు వాడికళ్ళు దేనో్న వెదుకుతున్నాయ్ "ఏమిట్రా!" అని అడిగారుమాష్టారు.

"మా అమ్మ ఇందాక రూపాయి తీసుకొస్తూంటే పోయిందటండీ! దాని కోసం వెదుకుతున్నాను అన్నాడు రాము

ఇల్లా రారా...! "ఈ కాలవలో నీళ్ళు ఒక్కచుక్క లేకుండా తాగితే నీకు రూపాయి ఇస్తాను" అన్నారు మాష్టారు క్షణం ఆలోచించిన రాము కళ్ళు సంతోషంతో మెరిశాయి "అల్లాగేనండీ" అని వాడు కాల్వదగ్గర కెళ్ళాడు.

రాధా, రమణా ఆశ్చర్యంతో చూస్తున్నారు "వాణ్ణి చూడు నీళ్ళన్నీ తాగేస్తాడా?" అనుకున్నాడు రమణ. మాష్టారు నవ్వుతూ నిలుచుని చూస్తున్నారు

రాము కాల్వదగ్గర వెళ్ళి నీళ్ళలో చూపుడువేలు ముంచాడు పైకెత్తి నోరు తెరిచాడు! అంతే! వేలి చివర్నించి ఒక్క చుక్క జారి అతని నోట్లో పడింది.

వచ్చేశాడు రాము. "ఇందాకటికంటే ఇప్పుడు ఒక్క చుక్క తక్కువండీ, ఒక్కచుక్క లేకుండా తాగేశాను" అన్నాడు రాము రాధా రమణా తెల్ల మొహాలు వేశారు "హార్నీ!" అని

"మాష్టారు నవ్వుతూ రెండు రూపాయిలు తీసి ఇచ్చారు. "అదేమిటండీ! మన మనుకున్నది ఒక రూపాయి గాదూ! అన్నాడు రాము. అవును రెండోది మీ అమ్మ పారేసుకున్నది ఆవిడ కిచ్చేసెయ్యి మొదటిది నీ బహుమానం. దాంతో పుస్తకం కొనుక్కుని రేపు నాకు చూపించు ఏం! అంటూ నడిచారుమాష్టారు. 'హార్నీ! రామూ' అని ఒక్కసారి ఆశ్చర్యంగా అన్నారు రమణా రాధా. ★

బాలల సంఘం

కొందరు సభ్యుల పేర్లు

అంగర వెంకట శివప్రసాద్ (విశాఖపట్నం) చావలి బాపూకుమారి (వసంతవాడ, ప. గో. జిల్లా) వేమూరి విజయలక్ష్మి (కటక్) కొల చినమురళీ ప్రసాద్ (పాలూరు, శ్రీకాకుళం జిల్లా) దంతుర్తి నిర్మల (ఢిల్లీ) అత్మకూరి పాండురంగ (విశాఖపట్నం) పైడిశెట్టి ప్రేమ కుమారి (సోంపేట శ్రీకాకుళంజిల్లా) రాజవరపు వాంచారిరావు (రాజవరం, తూ. గో. జిల్లా) యం. వెంకట కృష్ణారావు(గుంటూరు)

కోట అనంతలక్ష్మి (హైదరాబాదు) న్యాయపతి జగన్మోహన రావు (బాపట్ల, గుంటూరుజిల్లా) భాగవతుల సుబ్బారావు (బాపట్ల, గుంటూరుజిల్లా) కొత్తూరి మురళీ రామానుజరావు (తెనాలి, గుంటూరుజిల్లా) వేమూరి వీర వెంకట సత్యనారాయణ మూర్తి (కొవ్వూరు. ప. గో. జిల్లా) సూరపనేని సరస్వతీదేవి (పెదసనగల్లు,కృష్ణాజిల్లా,) గుడిమెళ్ళ శివరామకృష్ణశాస్త్రి (గుంటూరు) వాలిశెట్టి వెంకటకనకదుర్గ శీతారత్నమాల అకేరత్నమాణిక్యం (విజయవాడ) ప్రయాగ చంద్రశేఖర్ (కాకినాడ, తూ. గో. జిల్లా) మండలపురంగారావు(లబ్బీపేట,కృష్ణాజిల్లా) తాడినాగేశ్వరమ్మ (పెరికీడు, కృష్ణాజిల్లా) అబ్దుల్ రషీద్ (మైలవరం, కృష్ణాజిల్లా) వంక శ్రీ నాగేశ్వరి (రాజమండ్రి తూ. గో. జిల్లా) గూడ వెంకట అప్పారావు (ఏలూరు ప. గో. జిల్లా) కోసరాజు సుధీంద్రకుమారి (తురుమెళ్ళ, గుంటూరుజిల్లా) బి. లక్ష్మి నారాయణ (హనుమకొండ, వరంగల్ జిల్లా) పరాశరం కోదండపాణి (చేరుకలపూడి, గుంటూరుజిల్లా) ఎ. శోభ (మచిలీపట్నం, కృష్ణాజిల్లా) మంగిపూడి పద్మావతి (కలకత్తా) యాజమిల్లి చెల్లాయి (కాకినాడ, తూ. గో. జిల్లా).

శ్రీపతి మురళీకృష్ణ (నూజివీడు, కృష్ణా జిల్లా) లంకా విజయ బాబు (గుంటూరు) లంకా జయశ్రీ (గుంటూరు) అంగులూరి విజయలక్ష్మి (నిడుబ్రోలు, గుంటూరుజిల్లా) కోసరాజు శేషగిరిరావు (గుడ్లవల్లేరు, కృష్ణా జిల్లా) భమిడి లక్ష్మీనారాయణశాస్త్రి (అమలాపురం, (తూ. గో. జిల్లా) వలివేటి గిరిజ కుమారి (కాజ, గుంటూరుజిల్లా) ప్రత్తిసర్మారావు (ఇచ్ఛాపురం, శ్రీకాకుళం జిల్లా) యాండపల్లి ఈశ్వరప్రసాద్ (మచిలీపట్నం కృష్ణాజిల్లా) న్యాయపతి రామదాస రవీంద్రనాథ్ (బరంపురం, గంజాంజిల్లా) ఆర్. రఘునాథస్వరూప్ రెడ్డి (విజయవాడ) ఆళ్ళ నాగోజిరెడ్డి (మున్నంగి గుంటూరుజిల్లా) విడతనపల్లి సూర్యప్రకాశ్ రావ్ (నిజామాబాదు) సి. వెంకటయ్య (జడచర్ల, మహబూబ్‌నగర్ జిల్లా) పి. సుధాగోపాల్ (గుంటూరు) శాంతలూరు సుభద్రాదేవి (సర్పవరం, తూ. గో. జిల్లా) కమలాబాయి (గార్ల ఖమ్మంమెట్టుజిల్లా) యాజమిల్లి ఉదయ భాస్కర్ (ఆవడి, చెంగల్పట్టుజిల్లా) గోకవరపు సుబ్బాచార్యులు (జగన్నాథపురం, ప. గో. జిల్లా) కూచిభొట్ల శివాజీ (తెనాలి గుంటూరుజిల్లా).

జంజనం సాంబశివరావు (చిలకలూరిపేట, గుంటూరుజిల్లా) భమిడిపాటి వెంకటసత్యనారాయణ (ఆకివీడు, ప. గో. జిల్లా) మానేపల్లి అన్నపూర్ణాదేవి (ఏలూరు, ప. గో. జిల్లా) అడవికొలను రుక్మిణి (హైదరాబాదు) జవ్వాది భాస్కరరావు (విశాఖపట్నం) దిక్కుల సుగుణవతి (చిన్నబాడాము, శ్రీకాకుళంజిల్లా) విన్నకోట జయమీనాక్షి (చెన్నూరు, కృష్ణా జిల్లా) యం. సుబ్రహ్మణ్యం (నాగలదిన్నె, కర్నూలుజిల్లా) కాపు సత్యనారాయణ (రేవిడి, విశాఖజిల్లా) చిదురాలరాములు(రాయపర్తి.వరంగల్ జిల్లా) యర్రగుంట్ల జానకిరామయ్య (మండపేట, తూ. గో. జిల్లా) చింతలపూడి రాజేంద్రబాబు (పెండ్యాల, కృష్ణాజిల్లా) కునుంపూడి సోమేశ్వరరావు (ఆకివీడు, ప. గో. జిల్లా) యన్. వేణుకుమార్ (గుంటూరు) యజ్. చంద్రమౌళి (గుంటూరు) పోలదాసు జయశ్రీ (ఏలూరు. ప. గో. జిల్లా) గుక్కపాటి లీల (డోకిపర్రు, కృష్ణా జిల్లా) కంటకం జోగేంద్రరెడ్డి (రాజమండ్రి, తూ. గో. జిల్లా) కట్టా సుధాకర్ (విజయవాడ) శ్రీకాకర్లపూడి వెంకటరమణయ్య రాజు (నీలపల్లి, తూ. గో. జిల్లా)

గ్రంధి నరేంద్ర (ఏలూరు, ప. గో. జిల్లా మండవిల్లి సీతారామమూర్తి (గుడివాడ, కృష్ణాజిల్లా) గోవిందరాజు ఆనంద్ (విజయవాడ) బండారు సూర్యకుమారి (తాడేపల్లిగూడెం, ప. గో. జిల్లా) టి. హరిహర గోపాల్ రెడ్డి (విజయవాడ) చింతలూరి విజయలక్ష్మి వెంకటరమణ (రాజమండ్రి, తూ. గో. జిల్లా) యాజంశెట్టి పవన కుమారి (విజయవాడ) కోమాండూరి సువర్ణలక్ష్మి (నొడ్డిపట్ల, ప. గో. జిల్లా) కోతారు కృష్ణకుమారి పాకాలపాడు (గుంటూరుజిల్లా, కిడాంబి శ్యామసుందర్ (గుంటూరు) చతుర్వేదుల జయరామ్(హైదరాబాదు) కందర్ప మురళీకృష్ణ గాంధి (చోడవరము, విశాఖ జిల్లా) అట్లూరి శరత్ బాబు (విజయవాడ)

భర్త: "మీ అమ్మను నీతో తీసుకురావద్దని నేను ఉత్తరం రాస్తే మరెందుకు తీసుకు వచ్చావు?"

భార్య: "అది కాదండీ. మీరలా ఎందుకు రాశారో కనుక్కోవాలని ఆవిడే వచ్చిందండీ.

సంపర బాలశంకరరమణ (కిర్లంపూడి, తూ. గో. జిల్లా) ముసునూరి వెంకట గోపాల కృష్ణమూర్తి (విజయవాడ) ఘంటసాల సూర్యకాంతం అనకాపల్లి, (విశాఖ జిల్లా) చోడిశెట్టి జ్ఞానశంకర్ (కాకినాడ, తూ. జిల్లా) కరణం జానకి (కర్నూలు) ఉప్పరపల్లి కృష్ణకుమారి (ధర్మవరం, అనంతపురం జిల్లా) పొదర్తి వెన్నెల (గుంటూరు).

తుమ్మలపల్లి లక్ష్మీ సావిత్రి (కడప) పింగళి పార్థసారథి (కలకత్తా) అబ్దుల్ రజాక్ (కరివెన, మహబూబ్ నగర్ జిల్లా) వి. రాజశేఖరరావు (విజయవాడ) మద్దూరి శ్రీరామ చంద్రమూర్తి (కణుపూరు, తూ.గో. జిల్లా) జమ్ముల పురుషోత్తమరెడ్డి (వైరా, ఖమ్మం జిల్లా) వింజనంపాటి ఇందిరాదేవి (నర్సరావుపేట, గుంటూరు జిల్లా) చింతలపూడి కనకం (పెండ్యాల, కృష్ణాజిల్లా) చింతలపూడి లక్ష్మీదేవి (పెండ్యాల, కృష్ణా జిల్లా) గుడిమెట్ల సత్యనారాయణరెడ్డి (వెలగలేరు, ప. గో. జిల్లా) యం. జి. శ్రీదేవి (చేబ్రోలు, ప.గో. జిల్లా) పి. కమల (హనుమకొండ, వరంగల్ జిల్లా) పోపేటి శాంతారావు (జలుమూరి, శ్రీకాకుళం జిల్లా) మొదలి సూర్యారావు (కొత్తఢిల్లీ) గంగవరం ప్రమునరావు(హైదరాబాదు). లొక్క అరుణాదేవి(హైదరాబాదు) సాధు కోదండరామయ్య (జగ్గయ్యపేట, కృష్ణాజిల్లా), బండారు వెంకటసూర్యనారాయణరావు (అనకాపల్లి, విశాఖజిల్లా), అల్లాడి రుక్మిణి (కర్నూలు), బండారు సూర్యప్రకాశరావు (అనకాపల్లి, విశాఖ జిల్లా).

కొలుసు మీనారాణి (గుంటూరు), వ్యాకరణం లక్ష్మణమూర్తి (సికింద్రాబాదు) తిరుపతి దేవనాథ్ (విశాఖపట్నం), యర్రమిల్లి లీలాపార్వతి (తణుకు, ప. గో. జిల్లా) దోనేపూడి జానకిరాం (రేపల్లె, గుంటూరు జిల్లా), అద్దంకి లక్ష్మీబాయి (నర్సాపురం, ప॥ గో॥ జిల్లా), కందాళ సూర్యకుమారి (మద్రాసు), పరమాత్ముని ఉషారాణి (తిరుపతి, చిత్తూరుజిల్లా), తురగా రాజారాం (కలకత్తా), ఎన్. సరసిజాతమ్మ (పెంగరగుంట, చిత్తూరుజిల్లా), మద్ది మల్లిబాబు (యానంపేట, శ్రీకాకుళంజిల్లా), పెద్దిసెట్టి ట్యానియాకస్తూరి దేవికారాణి (నెల్లూరు), ★

★ అన్వేషణ ★

(30-వ పేజీ తరువాయి)

మని విపులీకరించాడు. ప్రముఖులు పరమహంస పేరు వినిఉండడంవల్ల తప్పక సహాయంచేస్తామని వాగ్దానాలు చేశారు.

రెండు రోజుల కొక్కొక్క ప్రదర్శన పరమహంస ఏర్పాటుచేస కోగలిగాడు. ఏఆఫీసులోనో, ఏ పాఠశాలలలోనో, ఏ నగరక సంఘ ఆధ్వర్యానో తన ప్రదర్శనలను జరిపించసాగాడు. వాగ్దానంచేసిన ప్రకారం రాణికి ధనసహాయం చేస్తుండడంవల్ల పుష్కలమయిన ధనం చూచిన ఆశతో శ్రమ అనక పరమహంసబసకు వెళ్ళి రిహార్సల్సు వేసుకుంటూ గడుపుతోంది రాణి.

రాణి యిచ్చిన ప్రదర్శనలకు నవయువక మండలి అంతా మొదటిదినాలలో హాజరయేది. కాలక్రమంలో పరమహంసతో రాణికి పరిచయం పెరుగుతున్న దన్న విషయం కనిపెట్టి అతని ప్రదర్శనలకు హాజరుకావడం మానేశారు. రెండేసిరోజులకు ప్రదర్శనలు యిస్తున్న పరమహంస రాణిని నవయువకమండలికి ఏ విధంగానూ ఉపకరించకుండా ఆటంకంగా కనిపించాడు కృష్ణమూర్తికి. నాటకరంగంలో ప్రవేశ మిచ్చి, అభివృద్ధికితెచ్చిన తన్ను తృణీకరించి, మరచి ఎవరో ఒక ముసలినటుడితో కాలం అంతా గడుపుతున్న రాణిమీద విపరీతమైన కోపం వచ్చింది కృష్ణమూర్తికి.

పరమహంస ప్రదర్శనలవార్తలు, రాణి నటనాచాతుర్యము పత్రికలలో పెద్దస్థాయిలో ప్రచురించబడాయి. పరమహంస యిచ్చే ప్రచారకరపత్రాలు క్రొత్తరీతిలో క్రొత్తభంగిమల్లో ఉన్న రాణిఫోటోలు నిండి ప్రజలకు నూత్న ఆకర్షణ కలిగించాయి. పరమహంస ప్రదర్శనలపై ప్రజలకు మోజు పెరిగింది.

ఒక రోజు కృష్ణమూర్తి తిన్నగా రాణి యింటికి వచ్చాడు. పరమహంస బహుమతిగా యిచ్చిన నిలువుటద్దంలో తలదువ్వుకుంటోంది రాణి. అద్దంలో ప్రతిబింబంగా ప్రవేశించిన కృష్ణమూర్తిని చటుక్కున తిరిగి పలకరించి క్షేమం ప్రశ్నించింది రాణి.

కృష్ణమూర్తి ముఖం కోపంతో ఎర్రబడిపోయింది. చీకాకుతో ముడుచుకుపోయింది.

"రాణీ...నువ్వింత విశ్వాసం లేకుండా ప్రవర్తిస్తావనుకో లేదు!"

రాణి కృష్ణమూర్తి మాటలకు ఆశ్చర్యపోయి అమాయికంగా చూసింది.

"అయితే...నువ్వు మా నాటక సమాజాన్ని వదులుకున్నట్టేనా?...!" తలవంచుకుని ప్రశ్నించాడు కృష్ణమూర్తి.

"మీరు కావాలంటే ఎందుకువెయ్యను మీ నాటకాల్లో!"

"అయితే పరమహంసనాటకాల్లో పాల్గొనడం నాకిష్టంలేదు... యీ వేళ ఉండి రేపు పోయేవాడు అతను... చిరకాలం నగరంలో ఉండేది మన సంస్థ... ఆలోచించుకో!"

"ఏమిటి మీరనేది?" రాణి కోపం చూపింది చీకాకుగా. రాణిలో ఆస్వరూపం ప్రథమంగా చూశాడు కృష్ణమూర్తి. గదిలో టేబిలుమీద వైనా బేగ్...నల్లకళ్ళజోడు, నేలకు వారగా బంగారురంగు క్రొత్తఎత్తు జోళ్ళు, చిలకొయ్యకు వేళ్ళాడుతున్న పూరిచేతుల పులెన్ జుబ్బా, రంగుల సిల్కు చీరలు, రకరకాల భంగిమల్లో రాణిఫోటోలు ...ప్రక్కనే పరమహంస జిజ్ఞాసలో ఉంటున్న ఫోటో... చూసి కృష్ణమూర్తి అర్థం చేసుకున్నాడు రాణిలోని మార్పు.

"నేననేది నీకు తర్వాత అర్థమౌతుంది!" గబుక్కున లేచి రివ్వన వెళ్ళిపోయాడు కృష్ణమూర్తి.

మరియమ్మ వేళ్ళు చిట్లించుకుని మూతి వంకరగా త్రిప్పి నవ్వింది.

రాణి సంఘర్షణలో పడింది.

వెళ్ళిపోయే కృష్ణమూర్తివైపు వీధిలోకి విచిత్రంగా నవ్వుతూ చూసింది.

వీధిలో కోడిపుంజులు దెబ్బలాడుతున్నాయి. గోళ్ళతో రాజుకుంటూ ఎగురుతూ, శరీరాలు గీరుకుంటూ రక్తం చిమ్ముతూ, నెత్తిమీది అందమైనజూలు కొరుక్కుంటూ, సౌందర్యవంతమైన ఈకలు విరుల్చుకుంటూ, భయంకరంగా కోడిపుంజులు కొట్లాడుకుంటున్నాయి. జనం చుటూ చోద్యంగా నిలబడి ప్రతీ ఎగురుకు, ప్రతీ దెబ్బకు హుషార్ గా నవ్వుతూ, విడ్డూరంగా చూస్తున్నారు.

7

సికిందరాబాదు, హైదరాబాదు నగరాలను జంటగా బంధిస్తూ మంగళసూత్రంలా ఉంది హృదయంగమమైన హుస్సేనుసాగర్ వంతెన. ఆ వంతెన కమ్మీల కానుకుని సరస్సుతరంగాలకు నీలాకాశానికి మధ్యనున్న శూన్యంలోకి వింతగా చూస్తూ సిగరెట్టు కాలుస్తూ నిలుచున్నాడు శివరాం. సూర్యాస్తమయం తర్వాత ఏర్పడిన సంధ్యారుణిమలు నల్లమేఘాల చారలమధ్యనుంచి ద్విగుణీకృతంగా మెరుస్తూ ఆవలితీరంలోని కొండలమీద విప్లవ ధ్వజాలు ఎగురుతూన్నట్లు కనిపించాయి. సిగరెట్టు పొగలు రింగులరూపం దాల్చి ఆ సౌందర్య దృశ్యాన్ని సరిగ్గా చూడమంటూ శివరాంను



సోమర్ సెట్ మామ్ ప్రతిమను శిల్పిస్తున్న ఎప్ స్టీన్.

"మనిషిముఖంకంటె ఆసక్తి కలిగించేది ఏముంది?" ... ఈ దృక్పథంతో ప్రపంచ ప్రసిద్ధవ్యక్తుల ప్రతిమల ననేకం శిల్పాలుగా తయారుచేసిన శిల్పి జేకబ్ ఎప్ స్టీన్ ఇటీవల తన 78 వఏట కీర్తిశేషులయ్యారు. ఆధునిక శిల్పచరిత్రలో నూతనాధ్యాయం ప్రారంభించి, దాదాపు ఒక యుగప్రవర్తకుడుగా ప్రత్యేకస్థానం ఆక్రమించుకున్న ఈయన ఐన్ స్టీన్, షా, మామ్, నెహ్రూ మొదలైన ప్రసిద్ధుల శిల్పాలు తయారుచేశారు.

కళ్ళజోడుగా ఏర్పడ్డాయి. కెరటాల తరగల ధ్వనులు ఏకాంతంగా నిలుచున్న శివరాంను పలకరించాయి కెరటాలమీదనుంచి వచ్చే పిల్లగాలులు శివరాం ప్రశాంత ఫాలభాగం మీదకి క్రాపును గువ్వుతూ మెదడులోకి ఆలోచనల గిలిగింతలు జొనుపుతున్నాయి.

వంతెన కమ్మీలకు నడ్డి ఆన్చి రహదారి వైపు చూచేడు. మేడల భవనాల్లాగా డబుల్ డెక్ బస్సులు జనంతో పరుగెత్తుతున్నాయి. ఒగరుస్తూనడుస్తున్న సైకిళ్ళతో అన్యాయంగా కార్లు పందెంవేస్తున్నాయి వంతెన కావలివైపు ఏపుగా ఎదిగిన సీమతంగేడు చెట్లు ఎర్రనిపుష్పాలు విచ్చుకుని నీలాకాశపు వెనుక రంగులో నీలమేఘశ్యాముని దొండపండు పెదాల నవ్వుల కాంతుల్లా గోచరించాయి. ప్రకృతిసౌందర్యంలో మానవాతీతమయిన శక్తి ప్రస్ఫుటమౌతూ దైవత్వం పొడసూపుతున్నట్లు అనిపించింది శివరాంకు.

కోమటి యజమాని ఇల్లుమార్చి, హైదర్ బస్తీలో క్రొత్తయిల్లు చూసుకుని పదిరోజులయింది. ఇరుగు పొరుగు స్నేహాలుమారాయి కాని, జీవితంలో నూత్నశక్తి ఇచ్చే క్రొత్త వాతావరణం ఏర్పడలేదు. ఆఫీసుగొడవలు, సినిమాచర్చలు, దారినపడిచే అమ్మాయిల గురించి కబుర్లు, ఉబుసుపోక పేకాటలు తప్పించి శివరాంకు ఆ క్రొత్తబస్తీలో ఏమీ కనిపించలేదు. [ఇంకావుంది.]

కాల్గేట్‌తో దంతక్షయం కాకుండా కాపాడుకోండి రోజంతా నోటినుంచి దుర్వాసన రాకుండాకూడా చేసుకోండి!



ఎందు చేతననగా: ఒకసారి తోముకుంటేనే


కాల్గేట్ డెంటల్ క్రీమ్ నూటికి 85 వంతుల వరకు దంతక్షయము లేకుండా చేసి, దుర్వాసన పోగొడుతుంది

భోజనం చెయ్యగానే కాల్గేటును ఉపయోగించి బ్రష్‌తో పళ్ళు తోముకొన్నట్లయితే అనేకమందికి దంతక్షయం కావడం ఆగి పోతుందనీ దంత వ్యాధుల చరిత్రలో ఇది అపూర్వ విషయమనీ, శాస్త్రీయ పరిశోధన వల్ల ఋజువైంది అంతేకాదు నోటినుంచి దుర్వాసన వచ్చేవారు దీనిని వాడినట్లయితే 10 మందిలో 7 మందికైనా వెంటనే గుణమిస్తుందనికూడా ఋజువైంది ఒక్క కాల్గేట్ విషయంలోనే ఇవి ఋజువైనవి

కాల్గేట్‌నుంచి నురసురమంటూ వచ్చేనురగ పళ్ళ సందుల్లోకి లోపలికంటా చొచ్చుకుపెళ్ళి అక్కడ ఇరుక్కుపోయి ఉండే ఆహార పదార్థాల నలుసులను బయటికి గిలా వేస్తుంది పళ్ళు బాగా చెడి పోడానికి దుర్వాసన రావడానికి కారణం ఆ నలుసులే

కాల్గేట్‌తో పళ్ళు తోముకోవడమంటే ఎల్లలకు చాలా సరదా! ఎందుకంటే దానినుంచి వచ్చే చాలా సేపు ఉండే పిప్పరమెంటు వాసనంటే వారు చెవి కోసుకుంటారు

మీకు పళ్ళపొడి అలవాటైతే, కాల్గేట్ పళ్ళపొడివల్లకూడా ఇన్ని లాభాలూ ఉన్నాయి ఒక డబ్బా కొన్న నెలలు వస్తుంది!



కాల్గేట్‌తో నిత్యమూ పళ్ళు తోముకొంటే

- ✓ దంతక్షయం కాదు
- ✓ దుర్వాసన ఉండదు
- ✓ దంతాలు మల్లె పువ్వుల్లాగ ఉంటాయి

తెల్లని పళ్ళకోసం, నోటి శుభ్రత కోసం, ప్రపంచంలో మరే టూత్ పేస్టుకంటె కాల్గేట్‌నే హెచ్చుమంది కొంటారు

DCS. 1907 ...

వనితాలోకం



మీ అమ్మాయి పెళ్లెప్పుడు?

అమ్మాయిల పెళ్లిళ్ల గూర్చి అమ్మానాన్నల కంటె పైవాళ్ళకు చాల ఆలోచనగా వుంటోంది! "ఫలానా వాళ్లింట్లో ఆ అమ్మాయి పెద్దదయి ఇన్నేళ్ళయింది" అని జాబితా లెక్క పెడ్తూ—'ఆ! ఇంకేం పెళ్ళవుతుంది? ఎవరికో ఒకరికి ఇచ్చేయరాదూ? యింకా చదివిస్తున్నారూ? గొప్పవాళ్ళు దొరకాలంటే ఎలాగూ?' యిత్యాది ప్రశ్నలు తమంతకు తామే వేసుకుంటూ విప్పుకుంటూ వుంటారు. అంతటితో ఆగక అమ్మాయిలు వారి ఎదుట కనిపిస్తే సరి, ఏదో ఖులాసా విచారిస్తున్నట్లుగా కబుర్లాడి, 'ఎవరైనా వచ్చారా నీకు? పాపం, ఏం పెళ్ళికి? ఏదో చదువుకున్నావ్. సంపాదించుకు తింటావే? కదమ్మాయ్? పెళ్ళిచేసుకుని మేం ఏం సుఖపడ్తున్నాం లే? ఇలాగే వుండిపో?" యిలాంటి కుతంత్రపు మాటలు క్రుమ్మరిస్తూ వుంటారు. మరి ఇలాంటి మాటలకు ఎలాంటి జవాబులివ్వాలో తెలియదు! నిజంగా తెలియదనటానికీ వీలు లేదు. ఒక వేళ ఏదైనా అన్నామా—"పెళ్ళికానమ్మాయ్ ఎలా మాట్లాడుతూందో చూశారా? ఏళ్ళున్నాయ్. ఈ

ఆర్. లక్ష్మీదేవమ్మ

వయసుకునాకు నలుగురు పిల్లలు. తొమ్మిదో యేట పెళ్ళయింది. పదకొండో యేట అత్తారింట అడుగుపెట్టాను, పండ్రెండో యేట పిల్లాడు చంకలో. మాకసలు లోకమంటే తెలిసి ఏడిస్తేగా? ఇప్పటికింకా సరిగా తెలియదు. ఈ కాలంవాళ్ళు ఎద్దుల్లా ఎదిగి ఎన్నో మాటలు మాట్లాడుతరు" అని మొగాన మొత్తిపోతారు. కోపం వస్తుంది! చదువూ సంస్కారం ఆకోపాన్ని చవటల్ని చేయటం మూలాన 'కిం' అనకుండా వుంటే—"నన్న మాటలకు నోరు తెరిస్తే ఒట్టు" ఇలా ప్రగల్భాలు. ఇలాంటివి పెళ్ళికాని అమ్మాయిలు ఈ కాలంలో పడ్తున్న మాటలని అనుభవపూర్వకంగానే వ్రాస్తున్నాను. అన్ని స్థలాల్లో ఇలాంటి బాధ అమ్మాయిలకుందో లేదో నాకు తెలియదు.

ఒకసారి మా ప్రక్కింటి స్నేహితురాలింట్లో కూర్చున్నాం మధ్యాహ్నం. వాళ్ళ స్నేహితుల కుటుంబం ఒకటి 5, 6 పిల్లలతో వాగన్‌తో వచ్చినట్లువచ్చి యిల్లంతా తెగ 'గత్తిబిలి' చేసేస్తున్నారు. యిల్లంతా సొంత యిల్లులా తిరుగుతూ వస్తువులు చిందరవందర చేసేస్తున్నారు. మా స్నేహితురాలికంటె నాకే కోపం వచ్చింది, 'క్రమశిక్షణ' లేని పిల్లలని. సరే.

ఆయన ఒక ఆఫీసరు యింటిని పరకాయించి చూస్తూ మావైపు చూశారు. వాళ్ళ మామ్మగారిని ఉద్దేశించి "ఆ అమ్మాయి ఏమౌతుందండీ?" అన్నారు. మంజరీ, సరోజినిని చూపిస్తూ మామనుమలండీ, మా చిన్నాబ్బాయి కూతుళ్లు. ఆ అమ్మాయ్ పక్కింటమ్మాయ్. మా అమ్మాయిల క్లాస్ మేటు అంది. అంతతో ఆగక "మంజరి M A. చదివింది. సరోజినీ B. A చదివింది" అని వాళ్ళమ్మాయిల్ని గూర్చి చెప్పుకుంది. దాని మీద ఆ ఆఫీసరుగారు "యింకా పెళ్లి కాలేదాండి మామ్మగారూ?" అని అనేశారు అందరిలా మామూలుగా. దానికి మామ్మగారు "కాలేదండి! ఎక్కడైనా చూడండి తగినవరుణ్ణి" అంటూ ఆదేశం మొదలెట్టింది. (ఇక ఈ సంభాషణ మొదటికి వస్తుందనుకుంటూవున్నా నేను. అనుకున్నంతజరిగింది.)

"ఆడపిల్లల్ని యిన్నేళ్ళు యింట వుంచుకోటం బాగుండదు." అని పెత్తనం దొరికినవాడల్లే ఆరంభించారు. "అమ్మాయిలకు ఈడు రాగానే పెళ్ళిచేయటం చాల సబబు. ఎందుకైనా మంచిది. పూర్వం యింతవరకు వుంచేవాళ్ళా? చిన్నపిల్లలకే కదా చేసేవారు. అంతెందుకు; మీ పెళ్ళి ఎన్నేళ్లలో అయిందో ఆలోచించండీ?" లాంటి మాటలు మెలికలు లేకుండా మాట్లాడుతున్నారా ఆఫీసరుగారు.

'పూర్వం' అనంగానే మా మంజరికి ఏం కోపం వచ్చిందో అందుకుంది.

(53-వ పేజీ చూడండి)




"అరతం చీరే కొనమని మొన్న మీతో చెప్పాను."

చిత్రం: ఎమ్. వి. సీతాపతిరావు—భువనేశ్వర్.



మీరు పొదుపు మనిషా?



వెనకటికో బంగారుతండ్రి చాటుబిడ్డ చాలా ఆయాసపడుతూ పెద్దపెద్ద అంగలేస్తూ పోతున్నాట్ట. అదేమిటిరా అని తండ్రి అడగ్గా జోళ్లు అరిగిపోతాయనీ జవాబిచ్చాడు. అదే బాగుగాని, అంత పెద్ద అంగలేసేవు, లాగు చిరిగేను జాగర్త అని హెచ్చరిక చేశాడు తండ్రి. లోభులగురించి ఈ కథ చెబుతారు. అయితే ఇంత ప్రజ్ఞ కడించడానికి పూర్వం వాళ్ళ అసలు వూహ మంచిదే—పొదుపుగా ఉండాలి అని. పొదుపుగా ఉండి, ఉన్నదానిలో కాలక్షేపం చేస్తే అప్పులపాలయి ఆర్చేవా తీర్చేవా అని అంగలార్చ నక్కరలేదని, అవసరానికి ఆదుకోవడానికి, కష్టాల్లోంచి బెగుకోడానికి డబ్బు దాచుకోవాలనీను. అయితే పొదుపు ముదిరితే లోభం అవుతుంది. యాత్రాపికి పరాకాష్ఠ, లోభి కక్కుర్తిపక్కవా అన్నారు. కూడని చోట్ల లాభం చేస్తే, కూడిక చేసుకొన్న పాపలాకి పదింతలు మరోకందుకవుతుంది. ఇవన్నీ ఇలా వుండగా 'మన పక్కింటివా కొప్పుడూ' తప్పులో కాలేస్తూ ఉంటారు. వాళ్ళకి పొదుపుకీ, లోభానికీ సరిహద్దు ఏదో తెలీక మీరు పొదుపుగా ఉంటే లోభులని ఆడిపోసుకుంటారు. పోతే మరికొందరు, ఎంత పొదుపు చేసినా, డబ్బు చాలటంలేదనీ అప్పులు తీరటంలేదని మధనపడతారు. మీమటుకు మీరు మీ యిల్లు తీర్చిదిద్దుకోడంలో పొదుపుగా ఉంటారా? మీది దుబారా చెయ్యా? లోభత్వమే మీవాని ఎక్కువా?— మాకు చెప్పనక్కరలేదు. సరదాకి మీరే ఓసారి తేరిజువేసి చూసుకోండి. ఈ క్రింది ప్రశ్నావళి చిన్న తెల్లని అద్దంలాటిది. తెల్లని అద్దాలు అబద్ధాలు చెప్పవు. సాధ్యమయినంత వరకూ నిజాన్ని నిష్కర్షగా చెబుతాయి. ఒకొక్క ప్రశ్నలోనూ రెండేసి అంశాలున్నాయి. మీకు ఏది నప్పితే, ఏది సబబని తోస్తే దాని ప్రక్క అవును అని రాసుకోండి. నప్పనిది వదిలేయవచ్చు. కాదు అనే జవాబు అవసరం లేదు. అన్ని జవాబులు వ్రాశాక, 'అ'-ప్రశ్నకి ఎన్ని అవునులు వచ్చాయో, 'ఇ' ప్రశ్నకి ఎన్ని అవునులు వచ్చాయో వేరుగా వ్రాసుకుని, 64 వ పేజీలోని జవాబులతో పోల్చి చూసుకోండి.

(1) మీ పొరుగామె, ఎదురింటావిడా మీ మాట వచ్చినపుడల్లా 'మీ రెలాగైనా బహు పొదుపరులు' అన్నపుడు మీ కామాట—

అ. ఎత్తిపొడుపులా వినిపిస్తుంది.

ఇ. పొగడ్త అని తోస్తుంది.

(2) మీ యింటిపనిమనిషి పనిలోకి వచ్చినప్పుడల్లా—

అ. రుసరుసలాడుతుంది.

ఇ. అన్నం తక్కువ పడ్డప్పుడల్లా గిన్నెల మీద కోపం చూపిస్తుంది.

(3) కూరలు ఇంటిదగ్గిర అమ్మొచ్చేవాటి కన్న బజార్లో చౌక అని ఊరంతా కోడై కూస్తోంది. అయితే ఇలాటి వాటిలో మటుకు "నేను ఆదర్శ భర్తగా ఉండను" అని మీ వారు దీక్షపట్టి పేపరు చదువుకొంటారు. అప్పుడు—

అ. మీరే బజారుకెళ్ళి, పిల్లల్ని పంపి కూరలు కొంటారు.

ఇ. ఇంటికి అమ్మొచ్చేవాటితోనే సర్దుకుంటారు.

(4) రోజూ వాడిగ్గా కొనేవాళ్ళకి తూకందగ్గిర, ధరలదగ్గిర మోసం చెయ్యరట కూరలవాళ్ళు అని కూరలవాళ్ళంతా చెప్తున్నారు.

అ. ఇందులో నిజానిజాలు మీకు నిర్ధారణగా తెలుసు.

ఇ. కూరలకే కాదు అసలు దేనికీ బేరాలు ఆడటం తప్పు. అది ఎదటి మనిషి నిజాయితీని శంకించి అవమానించడం. దానివల్ల వాళ్ళు బాధపడవచ్చు. తప్పటుకోవచ్చు.

(5) నవనవలాడే లేతకూరలు నాలుగైదు రకాలు చవగ్గా వచ్చాయి.

అ. కూరలవాడు, పొరుగింటికి వెళ్ళాక మిమ్మల్ని గురించి ఏం చెప్పినా సరే, మీరు మటుకు నిలవుండని కూరలు నాలుగేసి ఒక్కమారు కొనరు.

ఇ. చవగ్గా వచ్చినపుడు కొనకపోడం తెలివితక్కువతనం. ఎంత వాడిపోయే కూరలైనా వాడేలోగా వాటిని ఖర్చు చెయ్యడంలో మీకు మెళుకువ తెలుసు మరి.

(6) కొందరు అనవసరంగా ఇతరులగొడవల్లో జోరబడతారు.

అ. మీరు మీ యింట్లో అందరికీ విధిగా వారం వారం తలంటిపోసుకోవాలనీ, ఆర్నెల్లకోసారి ఆముదం తాగాలనీ, రెండ్రోజులకోసారి బట్టలు ఉతుక్కోవాలనీ శాసించి పిల్లలకీ, మీవారికీ ప్రాణం విసిగిస్తారు.

ఇ. మీ హద్దుల్లో మీరుండి ఇలాటి వాటిలో ఒకళ్ళ జోలికి పోరు.

(7) బాకీలు తీర్చగా మిగిలేడబ్బుని నెల పొడుగునా సర్దుకోవాలి కాబట్టి ఎవరో ఒకరు అలగక తప్పదు.

అ. ఎంత ఇబ్బందైనా పొరుగావిడ, మొగుణ్ణిలా ప్రతిదానికి నిగ్గదీసి లెక్క చెప్పమనడం, కాఫీఖర్చులకని పావలా డబ్బులు అడిగి చేత పెట్టడం చాలా తప్పు అని మీరు మీ వారూ అనుకుంటూ ఉంటారు.

(8) మీవారికి రేపు జీతం వస్తుందిగా ఎల్లుండి మళ్ళీ బాకీలు సర్దేచికాకుల్లో తీరిక ఉండదు కాబట్టి. నేను సర్దుతాను సినిమాకిరా, రేపివ్వచ్చులే అని స్నేహితురాలు బలవంతపెడితే—

అ. కాదంటే బాగుండదు అని వెళ్తారు మీరు.

ఇ. అందులో తప్పేముంది గనక ఆలోచించడానికి. మళ్ళా రేపిచ్చెయ్యొచ్చుగా.

(9) అరువులు తగవని కబుర్లు చెప్పేవాళ్ళు చెబుతూనే ఉంటారు. కాని నెల జీతంమీద జీవితం గడిపేవాళ్ళకి తప్పుతుందా.

అ. అయినాసరే మీరు కిరాణాకొట్టు మీద అరువు పెట్టనివ్వరు.

ఇ. ఒకవేళ అక్కడ అరువు పెట్టకపోతే డబ్బు మరి చేతిలో అట్టే ఉండదు కాబట్టి బట్టలకొట్టుమీద కొంత ఉండడం పెద్ద తప్పేమీ కాదు.

(10) ధరలూ, ఖర్చులూ కూడా పెరిగిపోయిన రోజుల్లో ఇన్ష్యూరెన్సులూ, బాంకులో దాచుకోడాలూ సాధ్యపడవు.

అ. ఇది ఉట్టి చాదస్తపు నమ్మకం.

ఇ. ఇది చాదస్తపు నమ్మకం అనుకోడం చాదస్తపు నమ్మకం.

(11) కుంపట్లో నిప్పులు ఊరికే పూసిపోతున్నాయి.

అ. అలా జరగదే!

ఇ. కాసిని వేణ్ణీళ్ళు పడేస్తే సరి. ★

ఉన్నమాటలు:

"పెళ్ళిళ్ళు కావలసినవాళ్ళు హాళ్ళా పెళ్ళా!"

రచన:
దర్భా అన్నపూర్ణాదేవి

(సినిమా లొచ్చి పాడుచేస్తున్నయ్యంటూ మాటివిగుచుకోనడం మనకు పరిపాటి అయిందిగానీ, అసలు లోపం మనలోనే ఉంది. ఇది ప్రత్యక్ష సత్యం. కాగా అతి ముస్తాబులకు పోయి సహజ సౌందర్యం తామే మాపుకుంటూ కృత్రిమ రూపం అభిలషిస్తున్న యువతులకు ఈ విషయంలో చెప్పవలసిన మాటలు చాలా వున్నాయి. మరీ వెగటు కలిగిస్తున్న ఈ ముస్తాబులను గూర్చి రచయిత్రి ఈ వ్యాసంలో స్థాలీపులాకన్యాయంగా వివరించారు.)

ఈమధ్య ఒకస్నేహితురాలు నాతో 'ఏమోయ్ నన్నంతా 'పారూ' అని పిలుస్తున్నారోయ్! నాలో సావిత్రి పోలికలుగానీ, సుచిత్రా సేన్ పోలికలుగాని ఏమైనా ఉన్నయ్యంటావా? అని ప్రశ్నించింది! ఏం చెప్పను నేను? నాలో నేనే నవ్వుకొని నిన్ను అలా పిలిచినంతమాత్రాన అసటీ మణుల పోలికలు నీలో ఉన్నయ్యనుకోవాకు! నీ పోలిక నీదే, అనుకున్నాను. ఆ అమ్మాయేం అమాయకురాలు కాదు. నేను కాలేజిలో చదివేరోజుల్లో నాతోపాటు చదువుకున్నదికూడాను. మరి చదువుకున్న పిల్ల ఇలా అడిగిందేమిటా? అని ఆలోచించి 'ఔను చదువుకున్న పిల్ల కాబట్టే ఇట్లా అడిగింది' నిర్ణయించుకున్నాను.

ఈనాడు బజార్లో చాలామంది యువతులు నడిచిపోతున్నప్పుడు వాళ్ళని చూస్తే హీరోయిన్‌మార్కు అమ్మాయిల్లాగా కనిపిస్తారు. ఆ తలకట్టూ తిరుకుబొట్టూ, నడకలూ, కులుకులూ, అచ్చం, సినిమాతారలా కన్పడాలని వారి ఆరాటమూ, చూస్తుంటే చాలా బాధ కల్గుతుంది. ఇందుకు ప్రధాన కారణం ఈనాడు చలనచిత్రాలు ప్రజాజీవితంలో పెరుగుతుంగా ఇంత సంచలనం కల్గిస్తున్నాయి. సినీతారలపేరు చెబితే నేగాని ఏ సరుకూ అమ్ముడుపోనిస్థితి వచ్చింది. 'గోజులు మారాయిగాజులు' అని చెబితే నేగాని వాటిని ఎవ్వరూ కొనరు. సువర్ణసుందరి చీర అంటే' గాని వాటికంత గిరాకీ.

సావిత్రి ఇట్లు చెప్పుచున్నది ..అంటే నేగాని పబ్బుకు గొప్పతనం రాదు. ఇవన్నీ సరే చివరకు భీడిలపైన జమున బొమ్మ, సబ్బుపై అంజలిబొమ్మ వేస్తేనే గాని ఆ వస్తువులకు సైతం విలువలేదు. ఈ విధంగా సినితారలకే క్యాలండర్లకే పూజలు సల్పుతున్న ఈ యుగంలో ప్రతి అమ్మాయి తాను ఆ రాత్రిసినిమాలో చూచినహీరోయిన్‌లా తయారు కావాలనీ, తన ప్రియుడు తన్ను సినిమాలో లాగా అనునయిస్తూ 'ఇది నా హృదయాంతర్గోళాల నుండి బయలువెడలుతున్న బాధకు ప్రత్యక్ష ఆతుర స్వరూపం. నిన్ను నేను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నాను. నీవు లేకుంటే క్షణమైనా బ్రతకలేను, నీ వెంటే వస్తాను..' అని వారు డైలాగులు చెప్పాలనీ, సినిమాలో లాగా ప్రేమ్యాయణం తనకున్నదని నేను తెలుసుకోవాలని ఒక డ్యూయట్‌సాంగ్ కూడా ఉంటే బాగుండునని కోరుకుంటున్నారంటే, ఇందులో అతిశయోక్తి ఏమీలేదు.

ఈమధ్య నేనొక ధనవంతురాలైన స్నేహితురాలింటికి వెళ్ళాను. వాళ్ళనాన్నకు ఆమె గారాబు బిడ్డ. ఆమె కోరికపైన మూడు బొమ్మపుస్తకాల్ని తెప్పించి పెట్టాడు. మానవ మాత్రునికి సృష్టించబడిన అనుభవాల్ని ఇంట్లో రాణీవాణీ, కాని అక్కడ పేర్లతో ఆ పుస్తకాలు మహావైభవం అనుభవిస్తున్నాయి. నేనామెను చూడటంకోసం వెళ్ళే సరికల్లా పైఅంతస్తులో కూర్చొని ఏదో డిటెక్టివ్ నవల 'చీరవిడిచినవీరవనిత' కాబోలు చదువుతూవుంది. ఆనవాలపేరుతోనే కాడలిపోయిన నేను ఆమెవంక చూద్దును కదా, మరీ అసహ్యం వేసింది. 'ఏమిటీ వేషం' అని ప్రశ్నించాను. 'ఓ! ఇదా! జంబోలో 'చిత్ర' వేషం! చీరవిప్పి పాంట్ వేసుకోడం నాకూ తమాషాగానే వుందోయ్—మా నాన్న మద్రాసు పోతున్నాడు. పెద్రోలాంటి చక్కని కోతిని తెమ్మన్నాను కూడాను' అని చెప్పుకుపోతున్నది. కోతికోసం మద్రాసెందుకు, వందలకొద్దీ ఊరకనే దొరుకుతాయి కదా అనే ఉద్దేశ్యంతో 'తిరుపతికి వెళ్తే సరిపోలేదా?' అన్నాను. దానితో పాపం ఆమెకు నామాటలలో వాచ్యాన్ని మించి, లక్షణంగాని, వ్యంజనంగాని ఏమన్నా స్ఫురించిందేమో ముఖం మాడ్చుకుంది.

ఈ తరహా వనితలు ఈనాడు దేశమంతా

సరళ సలహా!

మొన్న మా స్నేహితురాలు చెప్పింది. వాళ్ళ మేష్టారు అన్నారట. అతి వాగుడుతనం ఎక్కువ ఉండటంవల్లనే స్త్రీని 'అతివ' అన్నారని—'వ' వదరుబోతుతనానికి గుర్తు అని ఆయన చమత్కారంగా అని ఉంటారు.

ఈ అతివాగుడుతనము నేది ఒక పెద్ద జబ్బు. చిన్నప్పటినుంచి అదుపూ ఆజ్ఞా ఉండి 'ఊఁయ్' అనే వాళ్లు లేకపోతే అది అలవాటు అయిపోతుంది.

చెవులూ, కళ్ళూ, మొదలైన ఇంద్రియాలు రెండేసి ఇచ్చిన భగవంతుడు మనిషికి నాలుక ఒక్కటే ఇచ్చాడు. ఆ ఒక్క నాలుకతో మాట్లాడటం, రుచిచూడటంలాంటి పనులుకొన్ని కల్పించాడు. ఇందులోగల అంతరర్థం ఏమిటి? మాటలు ఆ నిష్పత్తిలో తగ్గించమని!

కాలు జారితే తీసుకోవచ్చుగాని మాటజారితే కష్టమంటారు పెద్దవాళ్ళు. అసలు మన ఆంతర్యం, మనోభావాలూ ఊరకే చెప్పుకుపోతుంటే మన వ్యక్తిత్వరలో లోతు, గుంభనా పోతాయి. దానితో వ్యక్తిగతంగా మనకు విలువ వుండదు.

మౌనం అంటే మాటివిగించుకుపోవటమని అంతా అపోహ పడతారు. మితభాషిత్వమే మౌనం. అది ఆడవాళ్ళకేమిటి, మగవారికేమిటి పెట్టని ఆభరణం.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

దసరా ప్రత్యేక సంచికలో

[14 అక్టోబరు, 1959]

వనితాలోకం రచనల పోటీ

మొదటి బహుమతి: రూ. 50/-

రెండవ బహుమతి: రూ. 30/-

"ప్రేమ వివాహాలు"

ప్రేమించి పెళ్ళిచేసుకోవడం ఆనాడూ ఉంది, ఈనాడూ ఉంది. అన్నగార్ల కిష్టంలేకపోయినా సుభద్ర అర్జునుణ్ణి, రుక్మిణి శ్రీకృష్ణుణ్ణి ప్రేమించి పెళ్ళిచేసుకున్నారు. దమయంతిని సాక్షాత్తూ దిక్పాలకులేవచ్చి మధ్యపెట్టినా నిరాకరించి, నలుణ్ణి పెళ్ళాడింది. ఆయా నాయికలు ఆయా నాయకులను ప్రేమించటానికి బలవత్తరమైన ఆకర్షణలు బోలెడున్నాయి. ప్రేమవివాహాలు ఈనాడూ జరుగుతున్నాయి. తల్లిదండ్రులు యువతీయువకుల ఇష్టానిష్టాలతో ప్రమేయం లేకుండా చేసే పెళ్ళిళ్లు క్రమంగా తగ్గుతున్నాయి. ముందుముందు ఇంకా తగ్గుతాయేమో! ప్రేమించి పెళ్ళాడే స్త్రీలు పురుషులలో ఏయే గుణగణాలు చూసి ప్రేమిస్తున్నారు? స్త్రీ ప్రేమించడానికి ముఖ్యాకర్షణ అందమా, ధనమా, గొప్ప ఉద్యోగమా, తెలివితేటలా, స్వభావం తనకనుగుణంగా ఉండడమా? ఇంకా ఇతర కారణాలున్నాయా? తీరా ప్రేమించి పెళ్ళాడితే దాంపత్యం సుఖంగా ఉంటుందని హామీ ఏమిటి? మొదలైనవాటిని స్త్రీదృష్ట్యా చర్చిస్తూ "ప్రేమవివాహాలు" అనే విషయమై వనితాలోకం రచనల పోటీ నిర్వహించదలచాము. ఈ పోటీలో స్త్రీలు మాత్రమే పాల్గొనాలి. ఫలితాలు దసరా సంచిక (14-10-59) లో ప్రచురిస్తాము.

రచన వార పత్రికలో రెండు పేజీలకు మించకుండా (అంటే సుమారు 4 అరటావులలో కాగితానికి ఒకవైపే) ఉండాలి. పోటీలో నెగ్గని రచనలను తిప్పి పంపగోరేవారు రచనలతోపాటే తగినన్ని స్టాంపులు పంపాలి. రచనపై "వనితాలోకం రచనల పోటీకి" అని స్పష్టంగా వ్రాయాలి.

రచనలు సెప్టెంబరు 21 లోగా మాకు చేరాలి.

వున్నారు. వీళ్ళల్లో సినిమాతత్వం ప్రతి అంగుళానా జీర్ణించుకొని పోయివుంది. వీళ్ళ వేషాలు సెకండుకోతీరున మారుతుంటాయి.

ప్రామాణికంగా ఒకరకం జడ వీళ్లు వేసుకోరు. పాముల్లాగా, జెర్రుల్లాగా, అల్లుతున్న మంచంలాగా, చిక్కుపడ్డ నులక ఉండలుగ నిమిషానికోతీరుగ మారుతూ ఉంటాయి.

మేకప్ చూద్దామా — తెల్లగా ముఖంనా పౌడర్ ఒకకోటా కొట్టుకొని, ఎఱ్ఱగా పెదిమలనిండా లిప్‌స్టిక్ పట్టించి, నల్లగా, కనుబొమ్మలకూ, కనురెప్పలకూ రంగుపట్టించి తోలుపెట్టె నొకదాన్ని (హ్యాండ్ బ్యాగ్) చేత పట్టుకొని బొచ్చుకుక్క నొకదాన్ని వెంటపెట్టుకొని అద్భుతంగా తానిప్పుడు సినిమా తార పద్ధతిలోనే ఉన్నానని భావించుకుంటూ, పోతుంటే ఎంతమందిని మనం వీధి భాగవతుల పగటి వేషాలను చూస్తున్నట్టు వింతగా చూడటంలేదు! ఒళ్లంతా గుడ్డల్లో దాచుకోకుండా నెక్సప్పీలు పోజులో ఎవరిని ఆకర్షించడం కోసమో అన్నట్టు నడుస్తూ కూడా తమను పతివ్రతలనీ, బుద్ధిమంతులనీ అనుకోవాలని. శ్రీరంజనిమార్కు ముఖాలు పెట్టేవారు కొందరైతే, 'రాత్రి చూచిన హిందీ చిత్రంలో ఆ హీరోయిన్ ఇట్లాగే నడిచిందికదూ' అని ఆమెను అనుకరించబోయి పర్యవసానంగా మాయాశశిరేఖ మార్కు అడుగులతో బజార్లో నడుస్తుండే వారు కొందరూ కనపడతారు.

ఈ అనర్థాలన్నీ కూడా సినిమాల్లోని హీరోయిన్లని అనుకరించడం కోసం వీళ్ళు అవస్థపడటంవల్ల వచ్చిన వికృతరూపాలే — (ఇక హీరోమార్కు అబ్బాయిల విషయం — జగద్విదితం — ఆ నగ్నసత్యాలను గూర్చి వ్రాయడం అనవసరం.) నిజానికి ఈ అనుకరణ ధోరణి నశించిననాడే స్త్రీలు, మామూలు ఆడవాళ్లలాగా లోకం కండ్లకు కనపడతారు — అంతేగాని, సినిమాల్లోని ప్రేమలూ, సన్నివేశాలూ, నటనలూ, వేషాలూ, భాషలూ, వాస్తవజీవితంలో ప్రతిబింబించుకుంటున్నంత కాలమూ, అంతా కృతకంగానూ, వారి ప్రతి పనీ కృత్రిమంగానూ, లోకం కంటికి కనపడుతుంది. ఈ అనుకరణ ధోరణి మాని ఎవరి అందానికి తగ్గట్టు వారు సాధారణ పరిమితి మీరకుండా అలంకరించుకుంటే అప్పుడే సహజ సౌందర్యం శోభిస్తుంది. శ్రీమతి లీలావతి మున్షీ సినిమాలు వ్యక్తులను పాడుచేస్తున్నాయంటే ఆమెతో 'పూర్తిగా' ఏకీభవించనక్కరలేదు గాని ఇటువంటి హీరోయిన్‌మార్కు అమ్మాయిలు కొందరు తయారుకావడానికి తోడ్పడుతున్నవని మాత్రం అంగీకరించి తీరాలి. కాకపోతే మరేమిటీ హాట్లూ పెట్లూ విగ్లూను!

★


ఆమె సౌందర్యవతి...
ఆమె పాండ్స్‌ను ఉపయోగిస్తుంది



మీ ముఖమును మృదువుగా మరియు మనోహరముగా ఉంచుకొనుటకు

పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్‌ను వాడండి

తేలికైన మరియు మంచువలెనున్న పాండ్స్ వ్యానిషింగ్ క్రీము చర్మమునకు రక్షణనిచ్చి దానిని చక్కగా మరియు మనోహరముగా ఉంచుతుంది. అది జిగురుగా ఉండదు మరియు రాసుకొన్న మరుక్షణము లోనే కనపడకుండాపోతుంది. పాండ్స్ వ్యానిషింగ్ క్రీము పౌడరు అద్దుకొనే ముందు వాడితే పౌడరును గంటలతరబడి అంటుకొని ఉండేలా ఉంచుతుంది.



చర్మమును శుభ్రపరచే క్రీమ్
ప్రతి రాత్రి మీ ముఖమునకు పాండ్స్ కోల్డ్ క్రీమును రుద్ది రాసుకోండి. అది చర్మమును శుభ్రపరుస్తుంది మరియు మీ లావణ్యమును కాపాడుతుంది.

చీస్‌బ్రొ-పాండ్స్ ఇన్‌కార్పొరేటెడ్ (పరిమితమైన బాధ్యతతో యు.ఎస్.ఎ.లో స్థాపించబడినది)

"కావ్యలోకంలో కాంతామణులు"

శ్రీమతి కె. లక్ష్మిగారు "కావ్యలోకంలో కన్నీరు పెట్టి కార్యాలుసాధించిన కాంతామణులు" అనే వ్యాసాన్ని చాలా చక్కగా చిత్రించింది. శృంగార నైషధ కావ్యకర్త అయిన శ్రీనాథునివదిలివేస్తే, ముక్కు తిమ్మన, అల్లసాని పెద్దన, భట్టుమూర్తిఅనే రామరాజభూషణుడు, యీ ముగ్గురు శ్రీకృష్ణదేవరాయల ఆస్థానకవులు. మనుచరిత్ర, వసుచరిత్ర, పారిజాతాపహరణ కావ్యాలనుగురించి శ్రీకృష్ణదేవరాయలు, తన ఆస్థానపండితసభలో తెనాలి రామలింగని ఉద్దేశించి నీ దృష్టిలో ఏది ఉత్తమకావ్యమో నిర్ణయంచేయమన్నాడట. అంతట తెనాలిరామలింగడు వెంటనే యీ మూడు కావ్యాలు ఏడ్పినట్టే వున్నవి కాని దానిలో తరతమభేదాలు వున్నవని సమాధానమిచ్చాడట. ఏమిటా భేదాలు అని రాయలవారు ప్రశ్నిస్తే తెనాలిరామలింగడు ముక్కు తిమ్మన చాలా ముద్దుగా ఏడ్చాడు. అల్లసాని పెద్దన అటూ యిటూ ఏడ్చాడు. భట్టుమూర్తి మాత్రం గావురుమని ఏడ్చాడని, యీ మూడు కావ్యాలలోని మూడు ఏడ్పు పద్యాలు తీసి రాయలవారిముందు పెట్టాడట. జనపథంలో మామూలుగా అలుకుపోయిన తెనాలి రామలింగని హాస్యరసాన్ని కుమారి కె. లక్ష్మిగారు సోదాహరణంగా, కావ్యరసగ్రాహ్యముగా కల్పించగలుగుట ఉదాత్తమైన రచనాప్రతిభ

పూర్వకవుల రచనా సరంతిలో ఇమిడియున్న భావసంచయం ఎప్పటికప్పుడు ఎవరికి వారికి సరిక్రొత్తగా కనపడటం ప్రత్యేక

కొల్లిపర విజయేశ్వరి

విశిష్టత. ఇలాంటి సాహిత్య రచనలు వనితాలోకంద్వారా అప్పుడప్పుడూ అందింపబడటం చాలా అవసరం.

పారిజాతాపహరణంలో సత్య, వసుచరిత్రలో గిరికాదేవి కన్నీటితో ప్రయోజనాన్ని సాధించగలిగారు. కాని మనుచరిత్రలోని వరూధిని, విఫలమనోరథయైనది. అల్లసాని పెద్దనను, రామలింగడు అన్నట్లు వరూధినియొక్క ఏడుపు ప్రవరాఖ్యునకు శ్రోత్రపేయంగా లేకపోయిందేమో? "వేదన నెపంబడి ఏడ్చె కలస్వనంబుతో." కలస్వనం అనగా అవ్యక్త మధుర స్వరం. అంటే వ్యక్తము గాని, లేక తెలియబడనటువంటి తియ్యనిస్వరం. మొత్తంమీద తేటతెల్లంగా భావాన్ని చెప్పాలంటే కూనిరాగమన్నమాట. "బుద్ధిజాడ్య జనితోన్మాదముల్ గదా శ్రోత్రియుల్", అని అనటంలో, వేదవేదాంగ పారంగతులును, నిత్యానుష్ఠానపరులు మాగ్నిహోత్ర తత్పర కర్మిష్ఠులైన శ్రోత్రియులు, బుద్ధిమాంద్యమువలన ఏర్పడిన పిచ్చివారనిగదా భావము. దాంపత్యసౌఖ్యము కొంతకాలమనుభవించి జీవయాత్ర కొంతకాలము సాగించి శ్రోత్రియుడైన ప్రవరాఖ్యుని ముందు, నవవయోవిలాసినియైన వరూధిని, మనోవేదన కూనిరాగాలాపనతో ప్రయోజనాన్ని పొందలేకపోయింది.

అయినా అన్యోన్యానురాగప్రేమానుబద్ధులయిన యువతీ యువకులలో, కాంతల కన్నీరు అభిమతాన్ని సాధిస్తుంది. కాని ప్రేమానురాగశూన్యులైన పురుషుల చెంత కాంతల కన్నీరు, ఎంత మున్నీరుగా ఏర్పడినా, కాలక్షేపానికి ఉపకరిస్తుంది గాని, పురుషులహృదయకాఠిన్యాన్ని కరగింపలేదు. అంగువలన ఒక్కొక్కప్పుడు కాంతల కన్నీరు పాడుబోతుంది గూడాను. ★

★ మా అమ్మాయి పెళ్ళెప్పుడు ★

(48 పేజీతరువాయి)

అవునండీ! 'పూర్వం' అన్నారే ఎంత వరకు? 'పూర్వం అన్న పదానికి, దానికి 'పూర్వం' వుంటుందికదా? మరి కొంచెం ముందుకి వెళ్ళండి. మా పూర్వంలో చిన్న పిల్లలకి పెళ్ళిళ్ళు చేసేవాళ్ళు నిజమే. దానికి కారణం వూహించరేం? దానికి పూర్వం 'స్వయంవరం' వుండేదని గుర్తుందా? పురాణాల్లో రుక్మిణీ, సీత మొదలైనవారికి స్వయంవరాలు వుండేవికావా? చరిత్రల్లో రాకుమార్తెకు స్వయంవరాలున్నట్టు చదువుతుంటాను. 'స్వయంవరం' అంటేతనంతటతా మేభర్తల్ని నిర్ణయించుకోటమనేగా అర్థం. ఆనిర్ణయానికి అమ్మాయిలకు పద్దెనిమిదేళ్ళైనా వుండాలి దా? పృధ్వీరాజును ప్రేమించి పూలహారం వేసి, గుర్రం స్వారీ చేసుకు వెళ్ళింది అంటే అప్పటికి ఆమెకు అంతటి సాహసం కల్గటానికి కారణము వయస్సు అని గ్రహించలేరా?

మహమ్మదీయుల పాలన వొచ్చాక హిందువుల్ని మహమ్మదీయులు పెళ్ళాట్టం హిందువుల కిష్టంలేక మొరపెట్టుకున్నారు. దానికి పెళ్ళయిన వారిని తప్ప యితరుల్ని, చెరపట్టయినా పెళ్ళాడ్తామని శాసించారుట. ఆ శాసనప్రకారం పిల్లలు పుట్టగానే ముప్పయి యేళ్ళవాడైనా సరే మూడు రోజాలు పిల్లల్ని అంటగట్టి పెళ్ళయిందనిపించి, ముస్లింబాధ తప్పించుకునే వారట, అది అదిగా అలాగే చిన్నపిల్లలకి పెళ్లి చేయటం వస్తూ వస్తూ శారదాచట్టం తెచ్చేదాక అమల్లో వుండేది. రాను రాను ఆ పెళ్లి మరీ ఆ గంతుకంగా—అంటే అమ్మాయికి యుక్తవయస్సు రాకపూర్వమే పెళ్లి చేయాలన్న, తొందరలో ఏకాటికి కాలు చాచిన కాసదగ్గ తాతయ్యలకిచ్చి పెళ్ళయిందనిపించేవాళ్ళు. వనితకు యుక్తవయస్సు వచ్చేలోపుగా నే విధవయై ఆజన్మాంతం జీవచ్ఛవంగా జీవించేవారి బాధలు, గాథలు మీ రెరుగనివా దాని కినిమ్మలకులు కీ. శే. శ్రీ వీరేశలింగం పంతులు గారిని యెవరెరుగరు? వారు మొదలు నేటివరకు చిన్నపిల్లలకు పెళ్లిమాని చదువు సంస్కారానికి తావిచ్చి, తెలివిమంతులైనపిదప—(పూర్వం రాకుమార్తెలకు శాస్త్ర విద్యలు నేర్పినతరువాత స్వయంవరాలతో వివాహాలు జరిపించిన రీతిగా) పెళ్ళిళ్లకు పూనుకోటం ఈ కాలంలో జరుగుతోందంతే! ఆ ఆలోచన లేకుండా అజ్ఞానంగా అమ్మాయిల్ని అందరూ పిచ్చిగా మాట్లాడుతూంట ఏమి సబబుగా వుందో వూహించండి?

ముఖ్యంగా చట్టం కాలాన్ని బట్టి మారుతూ వుంటుంది. కొన్ని యేండ్ల వరకు ఒక చట్టం అమల్లో వుంటూ మళ్లీ మారుతూ వుంటుంది. ఆ చట్టాల మార్పుకు అమ్మాయిల్ని అనటం, ఆ అన్న వాళ్ళకు అజ్ఞానాంధకారం ఆవరించివుందా? అని ఆలోచనకొస్తుంది కదాండి? అని చిన్న వుపన్యాసం దంచింది మంజరి మంచిగా.

పై వుపన్యాసం వినటంలో ఆ ఆఫీసరు గారు వూపిరి వదిలినట్లు లేదు గట్టిగా నిట్టూర్పు వదిలాడు. "అవునమ్మాయ్ నీవన్నది నిజమే! కాలం మార్పులు గమనించక మీ అమ్మాయికింకా పెళ్లి కాలేదా" అని అడిగే దాన్లో అర్థముండదు. ఈ రోజు మిమ్మల్ని ఈ మాట అడిగాను. రేపు మా అమ్మాయిని గూర్చి నన్ను ఎంతమంది అడుగుతారో గదా? అందరినీ కాదని నేను మాత్రం మా అమ్మాయిలకు చదువు-సంధ్య చెప్పించక ఈ రోజే పెళ్లి చేసి కూచుంటానా? ఆ కాస్త S. S L. C అయిందంటే 'కాలేజ'ని అడుగుతారు అమ్మాయిలు. కాదనలేక చెప్పించవలసే వస్తుంది. విజ్ఞానార్జన వదలటం ఎవరికిష్టం? అవీ ఇవీ చదివేలోపుగా 'యేళ్ళు' (వయస్సు) రాక ఏంచేస్తాయ్. అప్పటికి మిమ్మల్ని అడిగినట్టే నన్నూ అడక్క పోరు. మీరైనా ఈ మాత్రపు 'ఉపదేశం' చేశారు అన్నారు ఛలోక్తిగా! ★



అత్యంత సొగసు
మీరు "'హేజ్‌లైన్' స్నో" వాడుతుంటె అత్యుష్ణ
ప్రాంతపు ఎండ, గాలి లేక వర్షము మీ సొగసును
కళంక పర్చజాలవు. చర్మ సౌందర్యమును
గలిగించుటకు దివ్యమైన "'హేజ్‌లైన్' స్నో"
మీ చర్మమును మృదువుగాను సొగసుగాను వుంచును.
ఇది తెల్ల-ఎర్రరంగు ప్యాకింగుతో వచ్చుచున్నది
"'HAZELINE' SNOW"
"'హేజ్‌లైన్' స్నో"
ట్రేడ్ మార్కు
- బరోస్ వెల్కమ్ ఉత్పత్తి
For the Skin
HAZELINE SNOW
BWY-4

★ ఉత్తరాలు ★

(2-వ పేజీ తరువాయి)

వనితాలోకం

2-9-59 సంచికలో "గృహ రామాయణం" శీర్షిక చదివేను. ఎంతో చక్కగావుంది. ఆ, కాలేజీ ఉపాధ్యాయునిలా, నాలోకూడ, అపారకమైన, 'సంచలనం' బయలుదేరింది.

కర్రి శంకరం (మదరాసు)

"కావ్యలోకంలో..." వ్యాసం చాల బాగున్నది. దాన్ని చదువుతున్నంతసేపు నేనుకూడా కావ్యలోకంలో విహరించు చున్నట్లనిపించింది నాకు. రచయిత్రికి నా అభివందనలు.

ఆర్. వి. ఆనందరావు-(మదరాసు)

ప్రబంధనాయికల సంగీతాన్ని నేర్చి తమ తమ యేడ్పులో సరస, సార, సాహిత్యాలు చూపి కార్యాలు సాధించారు. నాటి పద్మినీ స్త్రీలకు నేటి స్త్రీలకు యేడ్పులో తార తమ్యాలు వున్నాయని చెప్పడంలో సందేహం లేదు. ప్రతి చిన్న విషయానికి యేడ్పునే మూలసాధనంగా వుపయోగించుకొనుటచేత నేమో నేటికవులు నేటి స్త్రీలయేడ్పులకు ప్రాధాన్యత యివ్వక వర్ణించుట మాను కున్నారు.

యస్. యస్. మూర్తి (కలకత్తా.)

కె. లక్ష్మిగారు చాలాచక్కగా వ్రాశారు. సహజపాండిత్యుడు పోతనామాత్యుడు, భాగవతాన్ని రాజునకు యెక్కడ అంకితము గావించునోయని భారతికూడా కన్నీరు మున్నీరుగా యేడ్చి, అది రాజునకు అంకితము గాకుండునటుల చేసుకొన్నది.

అల్లు చెర్వు వెంకటరంగయ్య (గుంతకల్లు)

"లేమావి చిగుళ్ళు మేసి జీరవారినకంఠంతో గానంచేసే ఆడుకోయిల అవ్యక్తమాధురీ స్వనం" అని అన్నారు. అసలు ఆడుకోయిల గానం చేస్తుందా?

"లేతహృదయం, కరుణ స్వభావం, అంటూనే "స్త్రీ లేతగా ఉండిపోవడం సహజసిద్ధ స్వభావమా?...అని ప్రశ్నించు కున్నారు. స్త్రీల సహజస్వభావం స్త్రీలకే తెలియదేమో!...

పి. ఎం. నారాయణ, (ధర్మాబాదు)

చాలా మనోహరంగావుంది. ఇది విమర్శక వ్యాసాలను మించివుందనటంలో సందేహము లేదు. 'సన్నివేశం మధురాతి మధురంగా మలుస్తూ శ్రీనాథుడు, చదువుతూ మనమనుభవించినంత ఆనందాన్ని పొంది వుంటాడాఅని సందేహం నాకు" అన్న వ్యాసకర్త్రివాక్యం నాకుఆశ్చర్యాన్ని కలిగించింది. ఇంత చక్కటి వ్యాసాన్ని మలచగలిగిన ఆమెకు శ్రీనాథుని రసజ్ఞత అ మాత్రం తెలియక పోతుందా అని. ఆ వాక్యం వ్యంగ్యార్థ సూచకమయితే మాత్రం పరవాలేదు.

ధూళతా ఖుందూరు, చినవాల్తేరు.

సాంఘిక సమస్య కాకుండా అప్పుడప్పుడూ యిలాంటి 'కావ్య కన్యక'లకు స్థానమిచ్చెద రని ఆశించుచున్నాను.

పుష్పానాయుడు (చిత్తూరు)

రేవతి గారి "పేరంటం" స్కెచ్ చదివి చాలామంది విద్యార్థినులు సాంసారిక విధానంలో వుండే బాధ్యతలను గుర్తుకు తెచ్చు కుంటారు. మర్యాదలూ, మంచి చెడ్డలూ తెలుసుకుంటారు. ఇలాంటి శీర్షికలు, స్కెచ్‌లు ఎంతో ఉపయోగకరమైనవి.

పి. వి. ఎల్లయ్యమ్మ (కేకిశెట్టిపాలెం)

"స్త్రీ బుద్ధి ప్రళయాంతకః" అన్నది కాలదోష మెరుగని మహా సత్యప్రవచనం" అన్న వారికొక్క ప్రశ్న: మిమ్మల్ని నవమాసాలు మోసి, కని, వడిలో పెట్టుకుని లాలించి పాలిచ్చి మీ తప్పుల్ని ఓర్పుతో, నెమ్మదిగా సరిదిద్దుతూ, మిమ్మల్ని పెంచి పెద్ద చేసిన మీ తల్లి, మీకు చిన్న ఎదురు దెబ్బ తగిలితే, గిలగిల్లాడిపోయే మీ తల్లి ఆ స్త్రీ గాదా! మీ సుఖసంతోషాల్ని అనుక్షణమూ కాంక్షించే మీ అక్కచెల్లెళ్లు— స్త్రీలు గారా?

తాతినేని హేమాదేవి, (మద్రాసు.)

శ్రీ 'రామరాజామాత్య' గారు వ్రాసిన "స్త్రీబుద్ధిః ప్రళయాంతకః" చాలా బాగుంది. అందులో ఒక జీవితగాథని పొందుపరుస్తూ చక్కగా మూడు ముక్కలలో ప్రస్ఫుటం చేశారు. వారికి నా ధన్యవాదాలు—

ఈ వారము స్వరలహరి వ్యాసము చాలా బాగుంది.

కె. పి. ప్రభాకర్ రావు, (అనంతపురం)

* * *

చేమంతుల పెంపకం

మా ఇంట్లో ఎంతో ఖరీదుపెట్టి కొన్న చేమంతి మొక్కలు కుళ్లిపోయి చచ్చి పోతున్నాయి. వాటికి ఏమి ఎరువు వెయ్యాలో, చెట్లు బాగా ఎదగడానికీ పువ్వులు పెద్దవిగా పుయ్యడానికి ఏమి చెయ్యాలో తెలిసిన సోదరి ఎవరైనా పత్రిక ద్వారా తెలియజేస్తారని ఆశిస్తున్నాను.

కుమారి కె. లక్ష్మిగారి వ్యాసం బాగుంది. గళ్లనుడికట్టుతో మాకు మంచి కాలక్షేపమవుతోంది.

అమ్మాజీ (ఖరగ్ పూర్.)

రంగుటద్దాలు

"మనసులో వొకటి అనుకొని పై వొకటి రాసినట్టున్నారు, నాగేశ్వరంగారు" ('మనస్సు', 'వ్రాసి'. 'రావు. గారు', అచ్చు పొరపాటా లేక.......) అని శంకరంగారు వ్రాశారు. అట్లు వ్రాయుటకు 'రంగు టద్దాలు' కల్పితకథ కాదనియు, జీవితములో జరిగిన ఒక సన్నివేశమనియు వ్యాసమునుబట్టి గుర్తించాలి.

కే. హేమాద్రిగారు 'రంగుటద్దాల వ్యాసానికి నాలుగు పేజీలు దండుగనిపించి నది' అని వ్రాశారు. వ్యాసం రెండు పేజీలు వుంటుందని గుర్తించాలి.

టి. వెంకట్రావు, (ఏలూరు.)

మనసులో వొకటి అనుకొని పైకిఒకటి వ్రాసినట్లగుపడదు, నాల్గు పేజీలు దండుగ కాలేదని నిష్కర్షగ చెప్పవచ్చు పైనవ్రాసి నట్లు విమర్శించినవారు తొందరగ చదివి నట్లగుపడుచున్నది. నిజమున ఆ వ్యాసము హర్షించతగ్గ.

కొరటమద్ది సత్యాగ (అయిజ-గద్వాల తా॥)

* * *

రమణారెడ్డి మ్యాజిక్

"రమణారెడ్డి-మ్యాజిక్" అనే వ్యాసం చాలా బాగుంది. 26 జనవరి, 1956 న వెంకటగిరిలో శ్రీ రమణారెడ్డిగారు, జిల్లా ప్రముఖులు, వేలాది ప్రేక్షకుల సమక్షములో మాజిక్ ప్రదర్శనం ఇవ్వటం జరిగింది. ఆనాటి ప్రదర్శనాన్ని నేను కూడా చూడటం తటస్థించింది. ఆ ప్రదర్శనములో రమణారెడ్డి గురువైన శ్రీ శేషాద్రి అయ్యంగారు (మెస్ట్రో) కూడ పాల్గొని ప్రేక్షకులు ఆశ్చర్యపడేలా అనేక అద్భుతాలను చేసి చూపించారు. రమణారెడ్డిగారు హాస్యాన్ని, మాజిక్ ను మేళవించి ప్రదర్శనాలివ్వటం వారిలోని ప్రత్యేకత. వారికి నా ధన్యవాదాలు.

మహంకాళి కృష్ణమూర్తి (గూడూరు)

ఆయన తనవిద్యను వృద్ధిచేసుకుంటూ, ఇంకనూ ఆంధ్రలో పెక్కుపట్టణములలో ప్రదర్శనలిచ్చి పెక్కు సంస్థలకు విరాళములు సమకూర్చెదరని తలంస్తున్నాను.

చించినాడ పోతనాచారి. (నర్సీపట్నం)

రమణారెడ్డిగారు అక్కచెల్లెళ్ళ సినిమాలో మ్యాజిక్ చేస్తూ – చెవులపిల్లిని చూపుతానంటు, బుటలోనుంచి కుక్కపిల్లను తీసి చూపిస్తారు. కావాలని అలాచేశారా? లేక ఆ సమయంలో మంత్ర తంత్రాలు మరచిపోయారా?

జేవి (పేటపాలెం)

* అది చెవులపిల్లే. పెంకితనానికి కుక్కపిల్లలా కనబడి ఉండవచ్చు. ★

సినిమా

వార్తావరణం

వ్యాపార జగతి ప్రగతిరీతినిబట్టి అనేక అనివార్యకారణాలను బట్టి, చాల మంది నటీనటులు, దర్శకులూ తమిళ చిత్రసీమ వైపు ఎక్కువ మొగ్గుచూపుతున్నారు. తమిళ చిత్రాల మార్కెట్ పెద్దది కాబట్టి వారికి ఇచ్చే రుసుములు కూడా తెలుగు చిత్ర నిర్మాతలు ఇచ్చుకోగలవాటికి, నూటికి యాభై నుండి నూరుపాళ్ళు ఎక్కువగా ఉంటున్నాయి.

ఇప్పుడున్న రుసుముల స్థాయి ప్రకారం, తెలుగులో పెద్దనటులు కనీసం ఆరడజను మందిని వేసుకు చిత్రం తీయాలంటే ఏడు లక్షల రూపాయలదాకా అవుతోంది. ఇందులో నటీనటుల (పెద్దా చిన్నా కలిసి) రుసుములే నాలుగూ నాలుగున్నర లక్షల రూపాయలదాకా ఉంటున్నాయి. ఒక తెలుగు చిత్రం చెప్పుకోతగ్గ విజయం సాధించి శతదినోత్సవం జరుపుకుంటే (శతదినోత్సవాలు జరుపుకొన్నవన్నీ అఖండ విజయం సాధించినట్లూ లెక్క కాదు) వాటి వసూళ్ళు ఏడూ ఏడున్నర లక్షల దగ్గర ఆగుతాయి. పదీ పద్నాలుగూ గడించేవి తక్కువ. సంసారం, రోజులు మారాయి, మిస్సమ్మ, జయసింహ, ఇలవేల్పు, సువర్ణసుందరి, మాయాబజార్, తోడికోడళ్లు, మాంగల్యబలం, ఇటీవలి ఇల్లరికంవంటి కొన్ని చిత్రాలే ఈ శ్రేణికి వస్తాయి. నాలుగు పాతిక చిత్రాలు తీసే 'తెలుగు సినిమా'లో మిగతా చిత్రాల కథ ఏమిటి?...అది ఇంత ఉత్సాహంగా ఉండదు.

మన హద్దులు

(ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ సుందర్ లాల్ హార దత్తులూ, అనుపమసంస్థ అధిపతిలా సాంకేతిక విషయ పరిజ్ఞానం, పథక నిర్మాణ సామర్థ్యం కలవారూ మార్కెట్ అవధులను బట్టి చిత్రం స్వరూపస్వభావాలకు పరిమాణాన్ని ఏర్పరచుకొని పొదుపుగా చిత్రాలు తీస్తారు. ఇలా తీయడానికి స్టార్ వాల్యూ [illegible]వర్గం అంతా సమకూరదు. అది కావాలనుకున్నవారు తెలుగులోనూ తమిళంలోనూ తీస్తున్నారు. అంత ఎత్తున పెట్టుబడికి తూగలేనివారు చివరకి ముందు తమిళంలో తీసే మంచిదన్న తాత్పర్యానికి వస్తున్నారు.

ఈవిధంగా నటులే కాక, నిర్మాతలూ, దర్శకులూ కూడా తమిళ చిత్రాలవేపు జరుగుతున్నందువల్ల కొన్నాళ్ళకి తెలుగు ప్రేక్షకులు కూడా తమిళ చిత్రాలకే వెళ్తారు కాబోలు అంటూ ఒక నిర్మాత ఇటీవల ఛలోక్తిగా అన్నారు.


అందుకు తమిళంనుండి వచ్చే తర్జుమా చిత్రాలు ప్రజలకి రిహార్సలు కాబోలు అని ఒక నటుడు చమత్కరించాడు.

విడుదలకై

సెప్టెంబరు తొలివారం, 4వ తేదీన రెండు కొత్త చిత్రాలు శభాష్ రాముడు, కట్టబ్రహ్మనలతో ఆరంభమైంది. 11న చందమామావారి 'సిపాయికూతురు' విడుదల అవుతోంది. ఇప్పటికి తేదీలు నిర్ణయం కాకపోయినా భాస్కర్ వారి [illegible]నోగము, సారథీవారి భాగ్యదేవత, పొన్నలూరివారి దైవబలం, శంభువారి నమ్మినబంటు (ఈ మూడూ నవయుగావారు విడుదల చేయవలసినవి కాబట్టి ఒకటి కొద్దిగా జరుగవచ్చును), వెంకటరమణావారి బాలనాగమ్మ, పద్మశ్రీవారి జగన్నాటకం, పద్మశ్రీ పిక్చర్స్ వారి వెంకటేశ్వర మాహాత్మ్యం, ఎ. పి. ప్రొడక్షన్స్‌వారి తొలి చిత్రం, భరణీవారి [illegible] కొంత అటూ ఇటూగా రావలసి ఉన్న చిత్రాలు.

కొత్త చిత్రాలు

నేషనల్ ఆర్ థియేటర్స్‌వారి 'సీతారామకల్యాణం' నిర్మాణం ఈనెల మూడో వారంలో ఆరంభమవుతోంది. సెప్టెంబరు 19న పాటల రికార్డింగ్ (నాలుగు) ప్రారంభిస్తున్నట్లు నిర్మాత త్రివిక్రమరావు చెప్పారు. రామారావు ఇందులో రావణ



యం. ఎ. వి. వారి "ఆలుమగలు" చిత్రంలో జానకి, జగ్గయ్య.

బ్రహ్మ పాత్రను నిర్వహిస్తారని వినికిడి. సీతారాములకై పరికొత్త చిన్నదాన్ని, చిన్నవాడినీ ఎన్నిక చేసి పరిచయం చేయబోతున్నారు.

ఈ చిత్రం సంగీతదర్శకుడయిన సాలూరి రాజేశ్వరరావు, రావణబ్రహ్మ స్తుతికై రుద్రవీణ వాయించడానికి ప్రసిద్ధ వైణిక విద్వాంసులు ఈమని శంకరశాస్త్రి గారిని ఆహ్వానించారు.

* * *

మధుర కవి, గాయకుడు, భక్తుడు, ప్రేమికుడు అయిన జయదేవుడి కథను వెండితెరకెక్కిస్తున్నారు. సముద్రాల రాఘవాచార్య గారు చిరకాలంగా ఈ కథపై పరిశ్రమచేసి చలన చిత్రగాథను రూపొందించారు. భరణీ సంస్థలో, దర్శకుడు రామకృష్ణవద్ద కొంతకాలంగా పనిచేస్తూ వచ్చిన రంగూన్ రామారావు ఈ చిత్రానికి దర్శకుడు.

భక్త జయదేవుడి భూమికను నాగేశ్వరరావు నిర్వహిస్తారు.

* * *

బి. ఎ. (వెంకటలక్ష్మి) సుబ్బారావు కొత్త చిత్రం త్వరలో ఆరంభించబోతున్నారు. ఇది కూడా జానపదమే. అంజలీదేవి, ఎన్. టి. రామారావు, రేలంగి నటిస్తారు.

విజయగోపాల్ (గంగా గౌరీ సంవాదం) ప్రొడక్షన్స్‌వారు, డికెన్స్ నవల ఆలివర్ ట్విస్ట్ కథావస్తువుగా ఒకచిత్రం నిర్మిస్తున్నారు. కొండేపూడి (సద్దరికొలు) లక్ష్మీనారాయణ కథ మాటలూ వ్రాస్తున్నారు. పెండ్యాల సంగీతం సమకూర్చుతారు.

ఈ చిత్రానికి కె. బి. తిలక్ దర్శకత్వం నిర్వహిస్తారు

* * *

ప్రభా (ఆహూతవం) ప్రొడక్షన్స్‌వారు 'కృష్ణప్రేమ' అనే చిత్రం నిర్మిస్తున్నారు. ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వాన ఈ చిత్రం హైదరాబాదులోని సారథీ స్టుడియోలో తీస్తారని నిర్మాత రాముదాసు చెప్పారు.

* * *

జోషీ ఫిలింస్‌వారి తొలిచిత్రానికి తల్లి-బిడ్డ అని పేరుపెట్టారు.

* * *

జి. వి. ఎస్. (వలటూరు) ప్రొడక్షన్స్‌వారు, తమ రెండవచిత్రం 'భక్త రఘునాథ్' నిర్మాణానికి ఆగస్టు 28న వాహినీలో ప్రారంభోత్సవం జరిపారు. జమున, కాంతారావు, రేలంగి, సూర్యకాంతం, పేకేటి ముఖ్యపాత్రలుగా ఇందులో పాల్గొంటున్నారు. దర్శకుడు సముద్రాల రాఘవాచార్య; సంయుక్తదర్శకుడు హరినారాయణ. సంగీతదర్శకుడు ఘంటసాల. కెమెరా కమల్ ఘోష్. నిర్మాత జి. సదాశివుడు.

కొత్త యముడు

పంపడిగురించి వరసగా ఐదారువాక్యాలు రాయాల్సి వచ్చినపుడు ఉత్సాహవంతంగా, చైతన్యవంతంగా, ఆపైన పొంకంగా వగైరా మాటలు వాడేవాళ్ళ. ఇంకా కావాల్సి వచ్చినపుడూ, ఈ మాటలు వాడడం వచ్చాక కొత్తగా వాడాలనుకున్నపుడూ ఎన్. టి. రామారావు అనే మాటను వాడుకోవచ్చునని రామారావును సెట్ మీద చూసినవాళ్ళంతా అంటూఉంటారు. గత వారం సి. పి. ప్రొడక్షన్స్‌వారి సెట్ మీద అయినా, ఆయన ధరించిన అల్లరిఘట్టం కూడా జమిలిగానూ విడివిడిగానూ కూడా చాలా అల్లరి చేశారు.

గాబర్డిన్ పాంటు, అందులోకి టక్ చేసిన పాప్లిన్‌షర్టు, తూలికలమర్చిన శిరోవేష్టనం, కాబూలీజోళ్ళు, జనకాల రాజాలు వేసుకునే పాదూగు చెంగూ-గమ్మత్తుగా ఉంది వేషం, బాలకయముడు. ఓనిమిషం క్రితం, చోటు ఖాళీచేసి హడావుడిగా వెళ్ళిపోయిన యముడు కూడా ఆమాటే అనుకుని ఉండాలి. యమభటులు భూలోకం వచ్చి ఓమనిషిని తీసుకుపోబోయి ఇంటిపేరుల్లో తభావతువల్ల పొరబాటున ఈ మనిషిని తెచ్చేశారు. పైకివచ్చాక తప్పులో కాలేసిన వైనం బయటపడింది. వింభటులయ్యా. యమభటుల్లా ఉన్నారే అని ఆ నరుడు వాళ్ళందర్నీ బుకాయించి కూడలేసి పరిహారం అడిగేదాకా వెళ్ళాడు. వానరుడిలా అల్లరి చేస్తున్న ఈ నరుణ్ని శాంతింపచేయడంకోసం యముడు యమకంగారుపడి, ఆ హడావుడిలో మళ్ళీ తప్పులో కాలేసి, అతని కింకోవరం ఇచ్చాడు. అది కాస్తా దొరకబుచ్చుకుని నరుడు పుంజుకుని నరకాన్ని, నరకలోకవాసు లందరికీ యమవరకంగా తయారుచేశాడు. యముణ్ణి, చిత్రగుప్తుడినీ తరమగొట్టాడు. ముసలాయన ఎప్పుడు ఖర్చవుతాడా, తానెపుడు ఆ పెద్ద పదవిలోకి జమపడతానా అని నిమేషాలు యుగాలుగా మీనమేషాలు లెక్కపెడుతూ మూడుకోట్ల సంవత్సరాలనించి పడిగాపులుపడి ఉన్న విచిత్రగుప్తుకి ప్రమోషనుఇచ్చాడు. సంస్కరణలు ఆరంభిస్తున్న వేళ, నారదుడు వచ్చాడు. నారదు-పాట కొత్త యముడికి నచ్చలేదు. అలా పిల్లల్ని కూడలగొట్టకపోతే సినిమాపాటలు పాడరాదా అని కూకలేశాడు.

"సినిమానా?" అన్నాడు నారదుడు రఘురామయ్య తెల్లబోయి.

ఎరగనట్టు మాటాడతావే. ఎన్నిసార్లు జాళ్ళో నిన్ను సినిమాలో! అన్నాడు యముడు.


నన్నా అనబోయాడు.

కలియుగనరుడు అయిన కొత్తయముడు ఘుడుసుకుని, ఎదటివాళ్ళంతా ఘుడుసుకు

(63-వ పేజీ చూడండి)



భాస్కర్ వారి 'మనోరమ' లో కృష్ణకుమారి.



సారథివారి 'భాగ్యదేవత'లో రేలంగి, బాలయ్య, రాజసులోచన.

చిత్రసమీక్ష:

రాజశ్రీవారి 'శభాష్‌రాముడు'

షేక్, వాలకం మాని, 'శభాష్ రాముడు' అనేది డబ్బింగు సినిమా అనుకునేవారు పందెం కడితే చిత్తుగా ఓడిపోతారు. నిజానికిది డబ్బింగ్ చిత్రం కాకపోవడమే కాక, ఉత్సాహకరమైన, కాలక్షేపానికి యోగ్యమైన తెలుగు చిత్రం. మీకు అభిలాష ఉంటే, కాయకష్టం పట్ల గౌరవం గట్రా పెంచుకోడానికి పనుపాయం కలిగించే చిత్రం. ఇందులో రిక్షారాముడు నిజంగా రిక్షారాముడు కాడు. పూర్వాశ్రమంలో లాల్చీ పంచె కట్టుకుని తిరిగిన సోషల్ హీరో. గోదావరి వరదలవల్ల ఆస్తి పోగొట్టుకుని, పెళ్ళాం బిడ్డలతో హైదరాబాద్ చేరి, గౌరవప్రదమైన జీవనోపాధికి సైకిలురిక్షా తోలడం అంత మంచిమార్గాంతరం లేదని ఆపని చేస్తాడు. అందులో మిగిల్చిన డబ్బుతోనే తమ్ముడికి చదువు...(రైటే మీరు ఊహించినట్లు ఫ్లాష్‌బాక్‌లో వాళ్ళమ్మకి ఒట్టేసి చెప్పాడు తమ్ముణ్ణి చదివిస్తానని) కు. టెన్నిస్ ఆటకూ పనుపాటూ చేస్తాడు. భూపతి అనే దొంగలదొర, హాలీవుడ్ అపరాధ చిత్రాలు మాని అవన్నీ కత్తిలేని నిజాలని పారబడిలక్కీ స్టార్ కార్నివల్ అని ఒకటి ఏర్పాటుచేస్తాడు. దాని చాటున ఉంటూ ఘరానా దొంగతనాలుచేస్తూ ఒక గుహలో భూగర్భమందిరాలూ మీట నొక్కితే ద్వారాలు తెరుచుకోడాలూ వగైరాలతో ఆధునిక బాలనాగమ్మలో మాయలఫకీరు పెట్టుకట్టుకుని ఉంటేగా, ఒకానొక రీలులో రిక్షారాముడు భూపతికి సవారీకట్టి అతని ఆటపట్టు సంగతి తెలుసుకోవడం జరుగుతుంది. భూపతి ముఠావాళ్ళు అతన్ని గాయపరచి, తమ గుట్టుబయటపెడితే 'నీ పెళ్ళాం బిడ్డల్ని' ఖర్చు రాయిచేస్తాం అని భయపెట్టి తప్పుకుంటారు.

రిక్షారాముడి తమ్ముడు ఆపూరి పోలీసు కమీషనరీ గారి అమ్మాయితో టెన్నిస్ ఆడి, డూయెట్లు పాడి అన్నగారు ఆస్పత్రిలో ఉన్నప్పుడు రిక్షాలాగి డబ్బు గడించబోయి కమీషనర్ గారి అనుగ్రహాన్ని, గౌరవాన్ని, వారి అమ్మాయి అనురాగాన్ని సంపాదించుకుంటాడు. ఈలోగా అతని పరీక్షకి డబ్బు కట్టడంకోసం, రిక్షారాముడు డాక్టరు మాట వినకుండా, రక్తం కారుతున్న కాలుతో, సైకిలురిక్షా పందెంలో పాల్గొని రెండువందలు బహుమానం గడించి...

...చూడగా ఇదంతా పచ్చిసినిమాకథలా ఉందని మీరు అనుకుంటే, రైటేనని దర్శక నిర్మాతలు కూడా తంగున ఒప్పేసుకుంటారు. పూర్వాశ్రమంలో ఇది బడాభాయ్ అను హిందీ సినీకథ...

...తరవాత తమ్ముడు మోహన్, బియ్యే పరీక్షయిచ్చి యూనివర్సిటీ మొత్తం మీద ఫస్టున వచ్చేస్తాడు. ఇటు ఈ సంఘటనా, మరోవంక తన కుమారుడు కుమార్, బుద్ధిగా దొంగల్ని పట్టుకొచ్చి ఖైదులో పోయ్యడానికిమారు, వాళ్ళతో కలిసి తిరుగుతున్న వైనం తెలియరావడం, ఇవన్నీ చూసి. అపరేషన్ స్పెక్టర్లు కూర్చునే ఇరుగ్గదిలో చిక్కుగా ఉన్న కమీషనరు గారి ప్రాణం ఖంగారై 'మోహన్ బియ్యే'కు గబుక్కుని ఇన్‌స్పెక్టరు ఉద్యోగం ఇచ్చేసి ఖూనీ దోపిడీ నేరాల కేసులన్నీ అతనికి ఒప్పగించేస్తాడు! ఎవర్నడిగిచ్చావుఅని గవర్నమెంటువాళ్ళు గట్టిగా అడిగితే, 'నాబిడ్డనే ఇచ్చాను నీ ఉద్యోగం ఇవ్వడానికేం?' అని జవాబిచ్చేందుకువీలుగా కూతుర్నిచ్చి అతనికిచ్చి పెళ్ళిచెయ్యడానికి ప్రధానం ఏర్పాటు చేస్తాడు.

ఈలోగా దొంగలముఠావాళ్ళకి పోర్చును వచ్చినప్పుడు వాళ్ళు ఒక ఖూనీ నేరం ఒక ఘోర నేరంచేసి ఆ రెండూ రిక్షారాముడికి అంటగట్టే ఏర్పాటు చేసిపెడతారు. ఎదురుగా ఉన్న సాక్ష్యాన్ని బట్టి ఇన్‌స్పెక్టర్ మోహన్, అన్నగారి చేతికి బేడీలు వేసి ఖైదుకు తీసుకెళ్ళాడు.

చూడ్డానికి సినిమాకథే అయినా, ప్రతివాడికీ కంట నీళ్ళు తిరిగేలా ఉద్వేగభరితంగా ఈ సన్నివేశాన్ని దర్శకుడు నిర్మించాడు. ఎన్. టి. రామారావు, రమణమూర్తి, కుమ్మడి ఇందులో అతిసమర్థంగా నటించారు. ముఖ్యంగా రామారావు నటన విశేషించి మెచ్చుకోవలసి ఉంది.

తరువాతికథ మీరు ఊహించుకోగలిగినా వెంటనే తెరమీదకూడా ఒకసారి చూడదగిన విధంగాఅందమైనసినీ మెలికలతో నడిచింది. తమ్ముడు దొంగలముఠా ఉచ్చులో చిక్కుకున్నాడనివిని,అంతవరకు దొంగలకునిక్కపట్టు గుట్టుగా దాచిన రిక్షారాముడు, (పోలీసుల సహాయంతో) ఖైదునుండి పారిపోయి సరాసరి గుహకు వెళ్ళాడు. ఉత్సాహకరమైన యుద్ధం జరిగిన పిమ్మట దొంగలు దొరికిపోతారు. చివర్న సన్మానసభ, పెళ్ళి, గ్రూపుఫోటో ఉన్నాయి. ఖైదునించి పారిపోయినా, దొంగల్ని పట్టుకున్నందుకుగాను రిక్షారాముడిని అభినందించిన కమీషనరు గారిని, సెన్సార్ వారినీ అభినందిస్తూ మనము ఇంటికి వెళ్ళాం. దారిలో పదేపదే చెప్పుకునే అంశాలలో రిక్షారాముడుగా రామారావు ఉత్సాహభరితమైన నటన, అతనికి ప్రతిగా రమణమూర్తి పాత్ర నిర్వహణ, పాకెట్ మార్ గా రేలంగి పాత్ర చిత్రణ, అందులో ఆయనా దర్శకుడూ కలసి చేసిన సున్నితమైన నగిషీలూ మరీమరీ చెప్పుకుంటాం. లోటుకూ

ది ఓల్డ్ మాన్ అండ్ ది సీ

'చచ్చిపోవాసరే, మనిషి ఓడిపోవడం మాత్రం జరగ'దన్న మహావాక్యాన్ని, సార్వకాలికమైనదాన్ని స్థాపించిన హెమింగ్ వే నోబెల్ బహుమతి కథ "ది ఓల్డ్ మాన్ అండ్ ది సీ" చలనచిత్రానువాదం గతవారం మద్రాసు న్యూ ఎల్ఫిన్‌స్టన్‌లో ఆడివెళ్ళింది. స్పెన్సర్ ట్రేసీ ఈ చిత్రాన్ని నటించాడు. సంగీత దర్శకుడు డిమిత్రీ (హైనూన్, ఓల్డ్ మాన్) టియోంకిన్ వ్యాఖ్యానించాడు. దర్శకుడు జాన్ స్టర్జెస్ దృశ్యాలు నిర్మించాడు.

సినిమా అన్న మాటకి చెలామణీలో వున్న అర్థాన్నిబట్టి కొన్ని చలనచిత్రాలను ఆ పేరుతో పిలుచుకోవడం మంచిది కాదు.

'ఓల్డ్ మాన్ అండ్ ది సీ' సినిమా కాదు. హెమింగ్ వే చిన్నమాటల, చిన్న వాక్యాల కావ్యానువాదం. ఒక్క భావానికి రూపకల్పన. అందువల్ల దర్శకుడు దీనిని కథా ప్రకారంగానే ఆవిష్కరించారు. మనం కథ చదువుతున్నప్పుడు చతురశ్రుర సంయోగంలోంచి పుట్టే బొమ్మలనే వరసగా పేర్చుకొచ్చారు. ఆరంభంలో పది నిమిషాలపేపు క్యూబన్ పల్లెటూరిలో తెల్లవారుఝాము దృశ్యాలను ఘనీభవించిన సౌందర్యంలా చూపించారు. ఆ తరువాతదంతా సముద్రంలో పడవలో జాలరిలో కిటకిటలాడుతున్న ఆత్మవిశ్వాసం, విజయాకాంక్షను. అతను వయసుమీద ఉన్నప్పుడు గట్టివాడని అందరికీ తెలుసు. ఇప్పుడు వయసు అతనిమీద పడడంతో అతనిమీద అతనికీ, ఇంకో చిన్న కుర్రాడికీ తప్ప మిగతా వాళ్ళకి గురిలేదు. ఎలాగైనా ఓ పెద్దచేపని పట్టితేవాలని బయలేరాడు. అతని ఎరకి ఒక పెద్ద చేప పడింది. కాని, దానికీ బోలెడంత ఆత్మవిశ్వాసం, మొండితనం, బతకాలన్న ఆశాను. అందుకని అది 'పైకి తేలకుండా' గుట్టుగా గంభీరంగా సముద్రం అడుగున ఉంటూనే సమరం సాగించింది. అతను దానివెంట అలాగే మొండిగా మూడు రాత్రింబవళ్లలోకి. సముద్రంమీద చాలదూరంలోకి చొచ్చుకు వెళిపోయాడు. ఎవరు చేపకి ఎవరు ఎరకి అన్న భ్రమానంలో మలిగే పర్యంతం వెళ్లాడు. చివరకి చేప ప్రాణం ఒడ్డి ఓడిపోయినా వచ్చి సాధించబోయింది. తిరుగు ప్రయాణంలో, అదే సొర చేపల నాకర్షించిన ఎరచేపగా తయారైంది.

ముసలిజాలరి, తన విజయఫలాన్ని సొరచేపలు కబళిస్తూ ఉంటేగా, కష్టించిన ప్రాణాన్ని ఆశను కూడదీసుకుని కాళ్ళా చేతులా పెద్ద సొరచేపల మందతో పోరాడి వాటిని తరుముగొట్టాగా. చివరికి మిగిలింది అతని విజయం తాలూకు అస్థిపంజరమే అయినా మొత్తానికి అది విజయమే. ముసలివాడిలో శక్తి సామర్థ్యాలను చూపి మిగతావారిని సంభ్రమ చకితులను చేసిన విజయమే.

సముద్రంలో మూడురోజులు పోరాడి, మానవుడికి పరాజయం లేదని ధైర్యం చెప్పే మహావాక్యాన్ని, గట్టున తెచ్చి పడేసిన ఘనత అతనికే దక్కింది.

కాని, ఆ ముక్క అతనే చెప్పుకోవడం ఏమంత అద్భుతంగా ఉండదు. పలకని స్వరంలా, అర్థోక్తిలా, ఎదటివాడిలో రాబలసిన ఊహ వచ్చేవిధంగా విషయాన్ని చెప్పడం కళాత్మకమైన శిల్పం లక్షణం. ట్రేసీ ఎంతబాగా నటించినా, స్టర్జెస్ ఎంత జాగ్రత్తగా చిత్రించినా ఆ భావం మనలో కలగదన్న భయం చేతనో, ట్రేసీ ఎరతాడు బిగలాగే నావాపుడిలో ఉన్నప్పుడు, విశ్రాంతి తీసుకున్నప్పుడూ అతని కథను నేపథ్యంలో నుంచి మనకి వివరిస్తూ వచ్చిన అసామి కామెంటు ఇవ్వకనో, దర్శకుడే "మానవుడు మరణించవచ్చుగాక, పరాజయం మాత్రం పొందడు" అనే నీతిమాటని, ఈ కథకు ముడిసరుకే తప్ప 'ఆలోచన' ఏమాత్రం కాని జాలరి నోటనే అనిపించేశాడు!

వారుణం. ★

వెణుకూ లేకుండా నిండుగా స్థిమితంగా నటించిన ప్రమీలను దేవికనుకూడా ప్రశంసిస్తాం. కనిపించిన కాసేపూ అతి సహజంగా కనిపించి అతను దొంగల్లో చేరుతాడో, పట్టుకుంటాడో తెలీకుండా నటించిన కాంతారావును కూడా మెచ్చుకుంటాం. కె. వి. యస్ శర్మ, లోగడ తన వేషాలు బాగా వేశాడు కాబట్టి, మనకి అతనిమీద గౌరవం కాబట్టి ఇందులో అతన్ని గురించి అట్టే మాటాడుకోము.


దొంగలముఠాలో కే. శే. ఆర్. నాగేశ్వరరావు, విగ్రహంలోనూ, నటనలో నిగ్రహంతోనూ కూడా రాణించాడు. హైటక్ క్లబ్ ఏర్పాట్లు డాన్సులూ లేకపోతే అతనిపాత్ర ఇంకొంత బాగుండేదనిపించింది.

పాత్ర మాటలలో చేతలలో దర్శకులు దాచిపెట్టిన లోపాలు లేకుండాపోతే గుమ్మడి, పాత్రకు గల హోదాను, తరహాను సముచితమైన పద్ధతిలో సాక్షిగా పోయిగా, సౌలభ్యం తెలిసినవాడిలా నటించాడన్న సంగతి బాగా తెలిసింది.

ఈ కథలో ఆస్పత్రివాళ్లుకూడా, పోలీసు వాళ్లలాగే చాలా మంచివాళ్ళు. సుశీలకంఠం ఎరువు తెచ్చుకుంటే, 'లేయిమింపనోయి బాబా' అనే పాటను ఆస్పత్రిలో పాడనిస్తారు. చాలా మంచిపాట. హాయిగా ఉంది. ఇదీ, కలకల విరిసి జగాలే పులకించెనే అనేపాటా, (సంగీతం ఘంటసాల) రమణమూర్తి మాలినిలతో ఆ పాట చిత్రణాకూడా ఆహ్లాదకరంగా ఉన్నాయి. మరొకటి, ఒక అరవ పాటకు అనుకరణ అయితే అయిందిగాని వినడానికి బాగుంది. కాలక్షేపానికి కావలసిన అన్ని హంగులూ ఉన్నచిత్రం. ★



శోభా ఫిలింస్ వారి తొలిచిత్రం 'తల్లి - బిడ్డ' ప్రారంభోత్సవానికి వచ్చినవారు: నాగయ్య, లింగమూర్తి, యామినల్లి.



జి. వి. ఎస్. ప్రొడక్షన్స్‌వారి రెండవ చిత్రం 'భక్త రఘునాథ్'కు ఇటీవల ప్రారంభోత్సవం జరిగింది. (కుడినుండి) ఘంటసాల, కాంతారావు, రేలంగి, చక్రపాణి, సముద్రాల, కృష్ణన్ (వాహిని), జమున, లీల, ఎస్. శ్రీనివాసరావు.

★ బొంబాయి లేఖ ★

ఛోటీ ఛోటీ బాతేఁ

జీవితం చూపినవాడు అంటారు మోతీలాల్‌ను చూసినవాళ్ళు. నిజంగా జీవితాన్ని చూసి, చూసినదాన్ని ఆకళింపు చేసుకున్నవాడు కాబట్టే మోతీలాల్ ఎప్పుడూ సంతోషంగా ఉంటాడు. చికాకులు ఎరగనట్టూ, ఉన్న వాటిమధ్య తను తామరాకుమీద నీటిబొట్టు మట్టుకే అయినట్టూ ఉంటాడు. జార్జి కాంపెర్న్ సినీవేషాలను గుర్తుకు తెస్తాడు.

ఏభైసంవత్సరాల భవానుభవానికి, పాతికేళ్ళ సినీభవానుభవాన్ని జోడించి ఇంతవరకూ మనం కనీ వినీ ఎరగని పద్ధతిలో రోజూ కనే వినే విషయాలగురించి ఆయన తెరమీద ఒక కథ చెప్పబోతున్నాడు. ఆరురీళ్ళు (అంటే సగం) షూటింగ్ పూర్తి అయిన ఆ చిత్రంపేరు "ఛోటే ఛోటే బాతేఁ" కథ, మాటలూ ఆయనే రాశాడు. ముఖ్యపాత్ర, దర్శకత్వం ఆయనే నిర్వహిస్తున్నాడు.

"ఏమిటా కథ" అని అడిగాను ఒకరోజున మోతీలాల్ ఇంటికివెళ్ళి — చెబితే విందామన్న ఊహతో. "చూపిస్తానురండి" అన్నాడాయన. లేబొరేటరీకి వెళ్ళి అప్పుడే తీసిన ప్రింటు తెప్పించి వేశాడు. ఆరురీళ్ళు.

తొందరపాటు, అయితే కావచ్చుగాని, ఇది ఇంతవరకూ తెరమీద ఎవరూ చూపి ఉండని తరహా కథ అని అనుకోవలసింది. నిజానికదికథ కానేకాదు. సినీకథాలక్షణాలు బొత్తిగా లేవు. ఇందులో మనుష్యులూ వాళ్ళ స్థితిగతులూ మనకి నిత్యజీవితంలో తటస్థపడడం జరుగుతూనే ఉంటుంది. అయినా ఇందులో ప్రాణానికి హాయిగొలిపే ఇంద్రజాలం ఏదో ఉంది.

మోతీలాల్ మధ్యతరగతి సంసారి. లీలామిశ్రా అతనిభార్య. ఇంకా, నదీరా, మంజు, సంగీతా అనే కొత్తనటి, మోతీసాగర్, మొదలైనవారున్నారు. సంగీతం వసంతదేశాయ్‌ది.

నైనా

'ఆహా' (అతిశయపేర్ హిందీ ప్రతి) చిత్రం మీరు చూసిఉంటే, అందులో నైనా అనే చక్కని అమ్మాయి గుర్తుండేఉంటుంది. ప్రాణ్ చేతిలో మోసపోయిన పిల్ల వేషం వేసింది. కాలీటోపీ లాల్ రుమాల్ చిత్రంలోకూడా ఈ మొకనిపిస్తుంది. పేరు నైనా. చాలా బావుంటుంది. (పేరుకాదు; అమ్మాయి.) తెలివైనది, చురుకైనది.

రెండు సినిమాలలో వేషం వేశాం కాబట్టి, ఇక ఫరవాలేదు వాళ్ళే పిలుస్తారనుకుని, ఇంటిదగ్గర కూచుని హాయిగా పుస్తకాలు చదువుకుంటూ ఉండిపోయిందిట. కొన్నాళ్ళయినా ఎవరూ టెలిఫోన్ చెయ్యలేదు. కార్లు పంపలేదు. నైనా ఆశ్చర్యపోయి, సినిమాలు తియ్యడం మానేశారు అనుకొని, నిజమో కాదో తేల్చుకోడానికి పాతనేస్తాలను పలకరించి రడానికి స్టుడియోలవేపు ఒకరోజు షికారు వెళ్ళింది.

సినిమా తీసేవారు తీస్తున్నారు — వేషాలు వేసేవారు వేస్తున్నారు. నైనాని చూడగానే ఎరిగినవారంతా ఆప్యాయంగా పలకరించారు.

"నువ్వింకా ఇందుమ్మటే ఉన్నావా! ఎక్కడా పత్తా తెలీకపోతే, బొంబాయి పొలిమేర దాటేసి మీవూరికెళ్ళిపోయావనుకున్నాం" అన్నారు వారంతా.

సినిమాలు తీసేవారు కొందరు పలకరించి, "సరిగ్గా కనుక్కనిపించావు. సరిగ్గా నీకు స్వెటర్‌లా అమరే వేషం ఉంది. వేస్తావా?" అన్నారు.

తప్పకుండా అంది నైనా ఆశ్చర్యంగా సంతోషంగా.

నాలుగురోజులు తిరిగేసరికి, ఆమె ఫైల్‌లోకి 18 కాంట్రాక్టు కాగితాలు ఎక్కాయి. ఇన్‌స్పెక్టర్ దిలీప్, ఆలమ్ ఆరాకీ బేటీ, జిందగీ ఔర్ హమ్, ఛోటా సా సంసార్, పీరకాసం, నకాబ్‌బాజ్, అప్సర, బాక్ ఫ్లోర్, మాకటీ మొదలైనవి. రెండు మూడి



'మనోరమ' చిత్రంలో రమణారెడ్డి, సూర్యకాంతం.

టీలో సైరా హీరోయిన్‌గా బుక్ అయింది. వీటిలో చివర పేర్కొన్న చిత్రానికి సైరా తల్లి (ఒకప్పుడు నటి) కృష్ణకుమారి అనే ఆమె నిర్మాత.

హాటాక్స్!

బొంబాయి శివారులలో ఉన్న తాణా లోని ఒక డాన్సింగ్ 'స్కూల్ మాస్టరి' కొత్తగా సినిమాలో చేరింది ఈ అమ్మాయి పేరు అమ్మాయిలాగే వింతగానూ, ఆకర్షణీయంగానూ ఉంటుంది. —హాటాక్స్ డి. రిపోర్టర్. పార్సీల అమ్మాయి అని ఈపాటికి పసిగట్టి ఉంటారు. ఈమె మంచి నర్తకి. శాస్త్రీయనృత్యాలూ, క్యాబరేలూకూడా బాగా తెలుసు. చంగులాల్ షా దర్శకత్వాన తయారవుతున్న "జమీన్ కే తారే" అనే చిత్రంలో ఇప్పుడు నటిస్తోంది.

అప్నా ఘర్

కైజర్ ఫిలింస్ వారి 'అప్నా ఘర్' కొంతభాగం చూశాము. అందులో కొంత భాగం, మొదటి ఒకటి రెండు రీళ్ళు, నిరుత్సాహం కలిగించినా, పోనుపోను కథ చిక్కబడి చక్కబడి బాగా రక్తికట్టింది. ప్రేమ్‌నాథ్, శ్యామ, నంద నటిస్తున్నారు. మంచికథావస్తువు, దర్శకుడు శ్రద్ధగా ఆలోచించి అవలంబిస్తున్న చిత్రణ విధానాలూ ఈ చిత్రాన్ని (అక్కడక్కడ మేకప్ వగైరాలోపాలూ అవీ సర్దుకుంటే) చాలా అందంగా రూపొందిస్తాయని ఆశించవచ్చు. ఇంతమంచికథ దొరికినపుడు ఇంకొంత కష్టపడడం అనవసరం కాదు.

మద్రాసు పోలీసుదళంపై చిన్న చిత్రం

మద్రాసు పోలీసు వ్యవస్థ శతవార్షికోత్సవం గతవారం మద్రాసులోనూ, వివిధ జిల్లాలలోనూ భారీఎత్తున జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని, మద్రాసులోని చలనచిత్ర నటీనటులు - దక్షిణభారత కళాకారులసంఘంవారు - పోలీసుదళం సేవపై ఒక చిన్న (మూడు రీళ్ళ) చలనచిత్రం నిర్మించి సమర్పించారు. కృష్ణన్, పంజుల దర్శకత్వాన ఎ. వి. ఎం. స్టుడియోలో తీసిన ఈ చిత్రంలో శివాజీగణేశన్, తంగవేలు, చంద్రబాబు, ఎం. ఎన్. రాజమ్ మొదలైన వారంతా కనుపిస్తారు. ఉత్సవసమయంలో నటీనటులతరఫున, సంఘం అధ్యక్షురాలు అంజలీదేవి, పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్‌కు నిలువెత్తు రజతఫలకం సమర్పించి అభినందించింది. అంజలీదేవి, సావిత్రి, రాజం, ఎ నాగేశ్వరరావు, ఎన్ టి. రామారావు, రంగారావు, రేలంగి, జెమినీ గణేశన్, టి. సుబ్రహ్మణ్యం మొదలగు వారంతా పోలీసుదళం సేవానిరతిని, వారు నెలకొల్పిన ఉత్కృష్టసంప్రదాయాలను ప్రశంసించి, కృతజ్ఞ

స్మృతి

ఆరడుగుల భారీ విగ్రహం, పచ్చని మొహం, సుర్మా వేసిన నల్లటికళ్లూ, మడత నలగని దుస్తులూ, హైదరాబాదీ ఆర్. నాగేశ్వరరావును తొలిసారి సినిమా సెట్‌మీద చూసిన ఆసామి ఒకతను అలాగే కళ్ళప్పగించి, ఒక నిముషంసేపు చూసి "సినిమాకి బ్రహ్మాండమైనవాడు దొరికాడు" అన్నాడు.

నాగేశ్వరరావు, అంతక్రితం హైదరాబాదులో సినిమాహాలు మేనేజరుగా ఉన్నప్పుడూ, పూర్ణాపిక్చర్స్‌లో ఉద్యోగం చేసినప్పుడూ, ఇతను ఇంతకన్న విశాలమైన పరిధిలో రాణించగలడని, చూసినవారంతా అనేవారు. 1951 లో రాజనాల నాగేశ్వరరావు (మరొకనటుడు రాజనాలకు బంధువు కాదు). సినిమాలో చేరడు. ఒక్కొక్క చిత్రంలోనూ అతను వేసిన వేషానికి మంచి పేరు తెచ్చుకుంటూ క్రమంగా పెరిగి, దాదాపు 80 పైచిలుకు చిత్రాలలో నటించాడు. కన్నతల్లి, పరోపకారం, నిరుపేదలు, రాజాపేద, రేపునీదే, ఆడబిడ్డ, దొంగరాముడు, దొంగల్లోదొర, మాయాబజార్, ముందడుగు, రాజనందిని, పెళ్ళిసందడి, పెళ్ళినాటిప్రమాణాలు, ఇల్లాలి అదృష్టమే ఇంటికిభాగ్యం, ఇల్లరికం అతని చిత్రాలలో ఎన్నతగ్గవి. దొంగరాముడులో రౌడీబాబులు, ఇల్లాలిఅదృష్టమే (తమిళంలో కూడా) లో రౌడీ, ముందడుగులో మేనేజరు, పెళ్ళిసందడిలో తాగుబోతు తండ్రి, ఇల్లరికంలో తండ్రిచాటున ఉండి దౌష్ట్యంచేసినవాడు విశేషంగా ప్రశంసలందుకున్నాయి. పెళ్ళిసందడిలో పదారు నిముషాలపాటే కనిపించినా ఆ కొద్దిలోనూ అతను ప్రదర్శించిన నటన, తెలుగు సినిమాలోనే ఉత్తమశ్రేణిలో నిలువగలదని అప్పట్లో అంతా ప్రశంసించారు.

నాగేశ్వరరావు, తెరమీద ఎంత నీటుగా గోటుగా కనిపిస్తాడో జీవితంమీదా అంతే. అతని జీవితంకూడా, చూసేవారికి ఇస్త్రీ మడతలా కంటికి నదరుగా కనిపించేది. తల్లి, భార్య, ఐగురుగుబిడ్డలూ ఉన్నారు. ఇద్దరు ఆడపిల్లలు. ఎవరైనా మాటతూలితే ఒక్కసారి కోపంతో లేచిపోతాడు, అంత మంచివాడని మంచితనానికి అర్థం తెలిపినవారంతా నాగేశ్వరరావును మెచ్చుకుంటారు. అతని దూకుడు అలాటిది. ముందూవెనకాల ఎరగడు. ఒకసారి, కారులో వెళుతుండగా పెద్దపులి ఎదురైతే ఉట్టిచేతులతో దాన్ని ఎదుర్కొని, తనమీద పంజాదెబ్బతిని, దాన్ని పదితన్నులు తప్పించుకున్న నాగేశ్వరరావు ఇటీవలగుండెజబ్బుని ఎదుర్కోవలసి వచ్చింది. తాను జబ్బేమిటి నాన్సెన్స్అని దాన్ని త్రోసి రాజనబోయాడు. గతవారం జబ్బు హఠాత్తుగా దండెత్తింది. ఒక [illegible] ఎక్కువ [illegible]చింది. సెప్టెంబరు 5 సాయంకాలం జనరల్ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తీసుకువెళ్లారు మిత్రులు. కారులో భార్యమాత్రం పక్కన కూర్చుంది.

కారు, మౌంట్‌రోడ్‌లోని జీవితభీమాభవన ప్రాంతం చేరేసరికి, రాజనాల నాగేశ్వరరావు భార్యచేతిని తనచేతుల్లోకి తీసుకొన్నాడు. మెల్లిగా కళ్ళు తెరచి ఆమె వంక ఒక్కసారిచూశాడు. తెరమీదకాని, జీవితంమీదగాని ఎన్నడూ కంట నీరుపెట్టి ఎరగని అతనికళ్ళలో తొలిసారి ఆఖరుసారి, గిర్రున నీరుతిరిగింది...

ఒక్కక్షణంతరవాత అతని సుప్తనేత్రాల మీద రెండుకన్నీటిబొట్లు నిలిచాయి. ★



ఏ. సి. ఇ. వారి "వీరపాండ్య 'కట్టబ్రహ్మన'"

బ్రిటీషు వారి సింహం, ఈస్టిండియా కంపెనీముల్లె ఫ్రాన్స్ డెస్సు చేసుకొచ్చి గద్దెనెక్కడానికి గొంతుసవరించుకొని సామ్రాజ్య వర్ణింపు పాంచాలియన్ కురిచ్చి కోటబురుజు మీదనుంచి ఆంధ్రకేసరి ధాటిగా ప్రతిగర్జన చేసేవరికి తగ్గి తమాయించుకుంది.

జగవీరపాండ్య బిరుదాంకితుడు కట్టబొమ్మ కరుత్తయ్య, అతని తమ్ములు శివత్తయ్య (కుమారస్వామి), ఊమదొరై (సుబ్బయ్య) వంటివారు ఉండగా తను తిరుచుగా జూలు విదల్చుకుని గర్జిస్తూ తిరగడం ఏమంత తప్పని సరి పనికాదని, అంతకోవాని సానిరకం జంతువులపద్ధతుల్లో వ్యవహరించడంతప్పేమీ కాదనీ నిశ్చయించుకుంది. లొంగిన వాళ్ళ నెత్తికెక్క వంగనివాడి జుట్టు పట్టుకోడం లో సుళువు తెలుసుకుంది.

ఆ రోజున కుంపిణీవారి ఆగ్రహానికి భయపడ్డ పాళయంగాళ్లూ, అనుగ్రహానికి కక్కుర్తి పడ్డవాళ్ళూ లొంగివచ్చారు. పిట్టపోగుల్లో పిల్లి తగవు సామెతమీద గురిలేనివారు కూడ తెల్లదొరలతో లాలూచీ అయి సాటి నల్ల దొరమీద పగబట్టారు. ఈవిధంగా అయిన వాళ్ళ ద్రోహం, కానివాళ్ళ కుట్ర తల పెట్టినా వారిమధ్య కటబొమ్మ నాయకుడు పరిమితసహాయశూరుడై నిలబడి పోరాడి, మగసిరిగల మనిషనిపించుకున్నాడు. అతన్ని అతని తరవాత అంతగానూ, అంతకన్న ధాటి గానూ ఆత్మగౌరవం పేరిటా, దేశ స్వాతంత్ర్యం పేరిటా బ్రిటిష్ బలాన్ని, వారి భారతీయ బలగాన్నీ ఎదిరించి తిప్పలుపెట్టిన ఊమదొరనీకూడా, వారిసెంతో ద్వేషించిన తెల్లదొరలే మెచ్చుకున్నారు. భారత స్వాతంత్ర్య సమరానికి ప్రారంభోత్సవం జరిపిన తొలి వీరులలో కటబొమ్మ సోదరులను చెప్పుకోవాలి. కట్టబొమ్మ నాయకుడి పూర్వీకులు, రాయలసీమ వాసులనీ తిరునల్వేలికి పొట్టచేతబట్టుకు వలసపోయి, నుగటిమి మాటి పాళెయంగారులైపోయారనీ, కాబట్టి వారు తెలుగువారేననీ, తెలుగువారు అనగా కాదు తమిళులేనని తమిళులన్నారు. అని పూగకోక కరుత్తయ్య వీరగథను నాటక ప్రదర్శనల ద్వారా బహుళ ప్రచారంలోకి తెచ్చి, జాతివెలుగులలా నిలిపి పూజించారు. తమిళనాడులో రెండు నాటకాలు బహుళ జనాదరణ పొందాయి. ఒకటి టి. కె. ఎస్. బ్రదర్స్ (భగవతి, షణ్ముఖం) వారిది. మరొకటి శివాజీ గణేశన్ (రచయిత శక్తి కృష్ణస్వామి)ది గణేశన్ నాటకం ఇటీవలే మద్రాసులో నూరవ ప్రదర్శనోత్సవం కూడా జరుపుకొంది.

ఈ నాటకాన్నే (దాదాపు యథాప్రకారం) పద్మినీ పిక్చర్స్ పేరిట బి. ఆర్. (స్కూల్ మాస్టర్) పంతులు గేవాకలర్ లో కంటికి నదరైన విధంగా సినిమా తీశారు. శివాజీ గణేశన్, జెమినీ గణేశన్, ఎస్. వరలక్ష్మి, పద్మిని, రాగిణి మొదలయిన వారు నటించిన ఈ చిత్రాన్ని ఏ. సి. ఇ. వారు తెలుగులో విడుదల చేశారు. మాటలు డి. వి. నరసరాజు, పాటలు ఆరుద్ర, సముద్రాల జూనియర్, కొసరాజు వ్రాశారు.

కట్టబొమ్మ కరుత్తయ్య నాయకుడు ఉచితంగా తమిళుడే కనడానికి కొండగుర్తుగా "కట్టబొమ్మన్" అన్నారు తమిళ నాటక కర్తలు; అంతమాట అంటారా, అతను పచ్చి తెలుగువాడు అని నిరూపించేందుకు ఇప్పుడు అనువాదకులు ఆ పేరు బద్దలుకొట్టి, అసలు వారింటిపేరు కట్టా వారనీ, మనిషి పేరు బ్రహ్మన్న అనీ తేల్చారు. ఆ పైన, నకింద తీసేసి ఆ చివర అక్షరాన్ని కూడా తేల్చి పల్నాటి వీరుల్ని తలపుకు తెచ్చే బాక్సాఫీసు వర్ణక్రమం ఏర్పరిచారు. ఈ విధంగా కొంతకాలంనాటి వంశనామం కట్టబొమ్మ కట్టబ్రహ్మన అయినందువల్ల మరి కొంత కాలానికి, మలయాళీ దర్శకు లెవరయినా దీనిని మహారాష్ట్రంలోకి డబ్ చేసినపుడు, 'కట్ట బ్రహ్మన'కి తమిళంలో అర్థం 'చెడ్డ బ్రాహ్మణుడు' అని పసిగట్టి, మహారాష్ట్రంలోకి 'ఖోటా బ్రహ్మణ' అని అనువదించుకొని నామకరణం చేసే అవకాశం వుందని, ఒక హిస్టరీస్టూడెంటు దురాశ పడుతున్నాడు.

అమెన్య తమిళులలో కే ఒక వర్గంలో చిన్న తగాయిదాలాటిది రేగింది. ఆంధ్రులు మా వాళ్ళంటున్నారు గాబట్టి కట్టబొమ్మను వాళ్ళకే ఇచ్చేయాలనీ, అసలు నిజానికి అతని అనుయాయి పులి తేవన్ అనే అతనే నిజంగా బ్రిటిష్ వారి నెదిరించిన వీరుడనీ కట్టబొమ్మ నిష్కారణం పబ్లిసిటీ చెక్కేసి హిస్టరీ పుస్తకాల్లో అచ్చయి ఊరుకున్నాడనీ కూడా ఒక సవర్గకవాం.

* * *

ఇవన్నీ ఎలా ఉన్నా ఏ. సి. ఇ. వారి కట్టబ్రహ్మన చూడవలసిన చిత్రం. ఒక ఉత్తమ పురుషుడిని, వీరుడిని, ఉదారుడిని, దేశభక్తుడిని, గౌరవపురస్సరంగా నిలిపి అతని కథను నిండుగా చిత్రించారు. మన్ననచేయ తగిన చారిత్రక చిత్రంగా రూపొందించారు. మెచ్చుకోతగ్గ అభిరుచితో అందమైన సన్నివేశాలు కల్పించి వాటిమధ్య కట్టబొమ్మన్‌ను ఠీవిగా నిలిపారు. శివాజీ గణేశన్ అతిసమర్థంగా పాత్రను పోషించాడు. కొన్నిచోట్ల మటుకు అవసరమైనదానికన్న ఎక్కువ సమర్థంగా నటించడం జరిగింది. అలాగే అతని సంభాషణలూను. వేషం కట్టినవాడు గణేశన్ కాబట్టి, కట్టబొమ్మ అనర్గళంగా ఉపన్యాసాలు ఒపరవలసివచ్చింది. అతని స్థాయినీ ధాటినీబట్టి, మిగతా పాత్రలు కూడా అవకాశం (అరుదుగానే) దొరికినపుడల్లా ఒళ్ళు దాచుకోకుండా రీలూ అరరీలూ మాట్లాడే శాయి. అయితే మూగవాడైన ఊమదొరై, విదారు గజాల పొడుగున మాటాడినపుడు, మాట తెలిసినవాళ్ళు ఆపాటి మాటాడడం చేసబబు కాదు.


నటీనటు లందరూ (హాస్యగాళ్ళు రాజగోపాల్, కరుణానిధి మినహా) పాత్రలను కథను న్యాయంచేసే విధంగా నటించారు. సేనాని జెమినీ గణేశన్ యుద్ధానికి బయల్దేరే ఘట్టంలో, అక్కడి ఉద్వేగాన్ని ప్రేక్షకులు కూడా అనుభవించే టంత గొప్పగా నటించాడు. అతని భార్య (పద్మిని) కన్న పీడకలను వివరించే పాటతో చిత్రించిన ఈ సన్నివేశం ఈ చిత్రంలోని గొప్ప ఘట్టాలలో ఒకటి. పాటా, నరసా కూడా బాగున్నాయి.

కట్టబొమ్మన్ భార్య జక్కమ్మగా మధుర స్వరలక్ష్మి ఎస్. వరలక్ష్మి నటించింది. ఆమె పాట, రికార్డింగ్‌లోనో మరే సాంకేతిక కార్యక్రమంలోనో జరిగిఉండగల లోపం వల్ల ఆశించినంత మధురంగా భాసించలేదు.

ఈ చిత్రం మొత్తంమీద మొదటినుండి చివరిదాకా రాజఠీవితో పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ నడచిపోయేవాడు శివాజీ గణేశనే. ఉరికంబానికి పోయే ఘట్టంలో నిర్వికారవదనంతో ఆయన నడచి వెళ్ళిన తీరు ఈ చిత్రానికే భూషణప్రాయం. కాని, అంత కోరీలుముందు, బానర్ మాన్ విచారణ జరుపుతున్నపుడు కట్టబొమ్మన్ అంతగా నోరు పారేసుకోవడం, (ఉమ్మివేయడం కూడా) పాత్రకు ఉచితంఅనిపించదు. అతని ప్రబలవిరోధి, అతనికి మరణదండన విధించినవాడూఅయిన తెల్లదొర బానర్ మానే, కట్టబొమ్మన్ తొణుకూ బెణుకూ లేకుండా మాట తూలకుండా, ఒక్క మాపుతో దేశద్రోహు లందరినీ మాడ్చివేశాడనీ, చనిపోయే వేళ అతను ఒకే ఒక్క వాక్యం—"యుద్ధం చేస్తూ ప్రాణం కోల్పోయే అవకాశాన్ని వదులుకున్నందుకే బాధపడుతున్నాను"— అని చనిపోయాడనీ వ్రాశాడు.

ఈ కొస్తా ఈవిధంగా కొద్దిగా అసంతృప్తి కలిగించినా, అనేక విధాల ఈచిత్రం బాగుంది. తెనిగింపుకూడా ఆరంభంలో ఒకటి రెండు రీళ్ళు ఓ మోస్తరుగా ఉన్నా పోను పోను కథతోపాటు సమానంగా పుంజుకొంది. శి. గణేశన్ ఉత్సాహానికి ధాటికి దీటైన స్థాయిలో డి. వి. నరసరాజు గారు

ఆంధ్రపత్రిక గళ్ళనుడికట్టు 18.



ఆధారాలు

అడ్డం

1. రంగముమీద కు. వ. క్రమం మారితే క్రీడ.
4. పిట్ట కొంచెమైతే ఘనమైనది కాబోలు.
6. ఇది దిగితేగాని తెలియదు.
7. పుకారు చివరనున్న విసుగు.
9. విడిపోకుండా వేసేది.
11. పై విలాసములో నాట్యము.
12. మొదట ప్రార్థించు వినోదము.
14. ఉత్తరం ముక్కల చివర తిరగేస్తే పీళ్లు వేయడానికి పనికొచ్చేది.
15. ఎందుకో నగరిలోగల అడవి!
18. మునితో నీళ్ళలో దిగి......
20. కోలకి మార్పువస్తే పాడుపిట్ట!
21. నా హృదయం ఎందులో ఉంటుంది?
23. మునిత మొదట వార్ధక్యం.
25. మర తిప్పితే నీరి.
26. కిక కికలాడే కాకము.
27. పూర్తిగా టాకాలు.

నిలువు

1. తన లోకుల వరుస తీర్పరి.
2. కర్రలు కోసేది.
3. ఆముదం మొదట తగ్గితే సంతోషం.
5. పోలేని పోతరము శక్యము.
8. ఇది సామెత ప్రకారం తలా పిడికెడు.
10. కొవ్వు తీసినవానిలో తిరగబడిన కొవ్వు.
12. మాలిక అన్నమైనది.
13. నవ్వు తెప్పించే గందరగోళము.
16. ... గిరజాలలో ... గ్రహము.
17. కోయిలా మొదటి శరీరమూ అన్న ప్రశ్న
19. ఆ పుటలో మొత్తం తార ఉంది.
20. రెండో స్వరం కోకదించి ... కాంత.
22. విద్యుక్తి లేని పదగలో పనికిరాని ... ఉంది.
24. ఇది టక్కరితనముండున్న ...!

17-వ నుడికట్టుకు జవాబులు

1 అ	న	2 గ	న	3 గా	■	4 ఋ	షి	5 త
ర	■	డిం	■	6 యి	క	రం	■	గ
7 వం	8 టి	చె	రు	కు	■	9 త	జ్ఞ	ని
■	క్కి	■	■	లు	■	ము	■	వా
10 ప	రి	11 పా	టి	■	12 ఏ	లు	13 వా	డు
లు	■	రి	■	14 అ	■	■	లు	■
15 క	లే	జా	■	16 నా	ట్య	17 రం	గ	18 ము
రం	■	19 త	రి	మి	■	జ	■	లి
20 పు	ణ్యా	ము	■	21 క	థ	కం	చి	కి.

రసభరితమైన, సంభాషణలు కూర్చారు. గాత్రధారి కె. వి. ఎస్. శర్మ, గంభీర కంఠంలో పూరించి ప్రయోగించిన శిల్పం గుండె ఝల్లుమనిపించేలా ఉంది.

పాటలు, ఈ చిత్రంలో రంగులమల్లె సరదాగా ఉన్నాయి. యుద్ధఘట్టాలను చాల వరకు కట్టుదిట్టంగా తీశారు. అమెరికన్ సైనికులనూ ఆ క్రీపాట్ లనూ (ఇది పూర్తిగా బ్రిటిషువాళ్ళ వ్యవహారం కాబట్టి) కొంచెం పొదుపుగా వాడితే గిట్టనివాళ్ళుకూడా వంక పెట్టేందుకు వీలుండేదికాదు; చాలా గొప్ప చిత్రం అని అంతా మెచ్చుకుంటారు. ★

వార్తావరణం

(57 వ పేజీ తరువాయి)

...లా ఒక్క గావుకేక పెట్టి "అలాంటి మాటలు మాయమాటలు గిరగిర ఎండి ... కో చెప్పకు. మర్యాదని ఇచ్చి పుచ్చుకో" అన్నాడు.

విచిత్రగుప్తుడు లేచి వచ్చి, నారదుడి చెవిలో "సార్ "అనవయ్యా ఆయనకో కోపం వస్తుంది" అన్నాడు మాటలు సాగదీస్తూ.

"కా...ట్" అన్నాడు దర్శకుడు సి. పుల్లయ్యగారు మాటని కొనసాగదీస్తూ.

సి. పి. ప్రొడక్షన్స్‌వారి సోమ్యరత్న ప్రధాన 'పారాంభిక' చిత్రంలోని ఈ సన్నివేశంలో పాత్రయముడు రంగారావు; అతన్ని గడగడలాడించి నరకం అంతా నానాగడబిడచేసిన కొత్తయముడు ఎన్. టి. రామారావున్ను. చిత్రగుప్తుడు వంగర వెంకటసుబ్బయ్యగారు. విచిత్రగుప్తుడుగా పేకేటి శివరాం నటించాడు.

"యమాలయంలో యమునానవుడు" అని బాదాపుగా అర్థంవచ్చే బెంగాలీ కథ ఆధారంగా ఈ చిత్రం తీస్తున్నారు. బెంగాల్ లోకూడా ఇది ఇటీవలే సినిమావతారం ఎత్తి 85 వ వారంలో విజయవిహారం చేస్తోంది.

తెలుగుచిత్రానికి దర్శకుడు సి. పుల్లయ్యగారు. రచయిత సదాశివబ్రహ్మం. ఈ చిత్ర సగం తయారయింది. అక్టోబరుకు పూర్తి అవుతుందనుకుంటున్నారు. ★

అభినవ భగీరథుడు

(15 వ పేజీ తరువాయి)

దొరగారు కృతజ్ఞతాభావంతో అన్నారు.

"మీ కృతజ్ఞతనూ, హృదయ నైర్మల్య విశాలత్వాలనూ చూచి ముగ్ధుడయిన నన్ను మీ నిష్కళంక కార్యం నిర్వాహకుణ్ణి చేసింది. మీకిలా ఇష్టమయితే అలా వినియోగించండి. మీ చేతితో జరిగితే అదే పదివేలు. మీ సంప్రదాయం ప్రకారం మీకు నమస్కరించాలని ఉంది. పాదాలు స్పృశించవచ్చునా!"

"ఎంతమాట!" అన్నారు పండితులు గారు.

పాదాభివందనం చేయటానికి అనువుగా అయ్యారు దొరగారు. పండితులుగారి గంభీర కంఠంనుండి గౌరవ ప్రవాహ సదృశములయిన ఆశీర్వచనాలు ఇలా వెలువడినాయి అప్రయత్నంగా:

"దీర్ఘాయురారోగ్యైశ్వర్యాభివృద్ధిరస్తు"
"సమానానాముత్తమశ్లోకోఽస్తు."

* * *

[ఇది నిజముగా జరిగినదని,
తన తాతగారు తమకు చెప్పినారని,
వారు చెప్పిన శ్రీ ఎమ్. దలపతిరావుగారికి
కృతజ్ఞత. శ్లోకము నేను వ్రాసినది.] ★

పుస్తక సమీక్ష

సిద్ధార్థ

ఇంగ్లీషునుండి అనువాదం-శ్రీ బెల్లంకొండ రాఘవరావు, దక్షిణ భాషా పుస్తక సంస్థ సహకారమున యం. శేషాచలం & కంపెనీ, మచిలీపట్టణంవారిచే ప్రకటితము. వెల రూ. 1-25 న. పైలు పేజీలు 145.

నోబెల్ బహుమాన గ్రహీత అయిన హెర్మన్ హెస్ (స్విస్) రాసిన గ్రంథానికి అనువాదం—ఇంగ్లీషు అనువాదంనించి శ్రీ స్వామినాథన్‌గారిచ్చిన తొలిపలుకు చాలా విశిష్టమైనది. గ్రంథమే వనుకుంటే అంతకంటె తొలిపలుకు మనోరంజకముగా వుంది. "ఎన్నిసార్లు చదివినా మన పాటు భూతిని, భావనను వృద్ధిపరుస్తూ మనకు గంభీరమైన, విస్తారమైన విజ్ఞానాన్ని అందీయగల ఉత్తమ రచన ఈ 'సిద్ధార్థ'" సిద్ధార్థ అని చూడగానే గౌతమ బుద్ధుణ్ణి గురించిన పుస్తకం అని స్ఫురిస్తుంది మనకు—కానికాదు. కథాసారమేమంటే బ్రాహ్మణ యువకుడైన సిద్ధార్థునకు తన ధర్మంమీద నమ్మకం పోయింది. అప్పట్లో వున్న బుద్ధుణ్ణి గురువుగా స్వీకరించడానికి ఒప్పుకోలేదు. తండ్రిని వదిలిపెట్టి శ్రమణులలో చేరి, అదీ నచ్చక వచ్చి సంసారంలో చిక్కుకున్నాడు. ఒక వేశ్యతో వుంటాడు. జూదం తాగుడు వగైరా అన్నీ నేర్చుకొని అనుభవిస్తాడు. కొంతకాలానికి వాటిమీద మోజుపోతుంది. చివరకు ఒక పడవవాని దగ్గరకు చేరుతాడు. అక్కడ అతనిద్వారా పరమార్థాన్ని తెలుసుకుంటాడు. తొలిపలుకు (VI పేజీలో) ఒక చక్కటి చమత్కార వ్యంగ్య కథ చెప్పారు. జ్ఞానం ఎక్కడ వుందో, ఎక్కడ దొరుకుతుందో ఈ కథవల్ల అర్థమవుతుంది.

వేశ్యదగ్గరకు వెళ్ళినప్పుడు ఇవ్వవలసిపోతే ఏమి జరుగునన్నప్పుడు "...నీటిలో రాయివేస్తే అది సూటిగా అడుగుకుపోతుంది. సిద్ధార్థునికి ఒక సంకల్పం ఒక లక్ష్యం ఏర్పడినప్పుడుకూడా అంతే ... అతని లక్ష్యమే అతనిని లాగుతుంది." అంటాడు. సాహుకారుకు సిద్ధార్థునకు జరిగిన ప్రథమ సంభాషణ హాయిగా వుంటుంది. సమాధానానికి తడుముకోను. "ప్రతివాడు తనకున్నది ఇస్తాడు. సైనికుడు బలాన్ని, వర్తకుడు సరుకులను, ఉపాధ్యాయుడు విద్యయు, కర్షకుడు ధాన్యాన్ని ఈ విధంగా ఇస్తాడు." "నేను ఆలోచించగలను. వేచి యుండగలను. పస్తులు చేయగలను." అంటాడు కామస్వామితో. జ్ఞానం అనేది ఒకరు చెబితే తెలుసుకోతగిందికాదు. జ్ఞానాన్ని మాటలలో చెప్పడం సాధ్యంకాదు ... అలాంటి ఉపదేశం ఎప్పటికీ వృథా" విజ్ఞానం వేరు, జ్ఞానం వేరు, అని అనేక విషయాలు తేటతెల్లంగా గోవిందునితో అంటాడు సిద్ధార్థుడు.

చివర 8 వ ప్రకరణంలో వున్న సిద్ధార్థ గోవిందుల సంభాషణ ఎంత చదివినా తనివి తీరదు. అదోక విధంగా హాయిగావుంటుంది. "ప్రతి విషయానికీ వ్యతిరేకంగా ఇంకో విషయం వుంటుంది. ఇది ఎంత సత్యమో అదీ అంత సత్యమే..." ఒక వ్యక్తి ఏ స్థితిలో వున్నది చెప్పడం సాధ్యంకాదు. దొంగలోను జూదరిలోను బుద్ధుడున్నాడు. బ్రహ్మ పదార్థంలోనే దొంగ వున్నాడు." ఈ పుస్తకం ఎన్నిసార్లు చదివినా చదవొచ్చు పాతగాపడదు. ఒక్కొక్క పర్యాయము ఒక్కొక్క తాత్పర్యం గోచరమవుతుంది.

మామూలుగా చదువుకోవచ్చుగాని, పిల్లలు దీనిని ఎక్కువ ఆనందించలేరు! పెద్దవారికి జ్ఞానం, విజ్ఞానం విచక్షణ చేయదగ్గవారికీ, ఆధ్యాత్మిక జ్ఞానంకొరకు వెతుకుతున్న వారికి ఈ గ్రంథం వుపకరిస్తుంది.

మూలంనించి తెలుగులోకి అనువదించినప్పుడు అసల్లోని రసం-మజా-పోకుండా ఘట్టాలను ఒక పట్టున బిగువుగా సొంపుగా ప్రతిపాదించారు.

"రా. మూ."

మీరు పొదుపరులా?

సమాధానాలు

అ-ప్రశ్నల్లో 8 అవునులు వస్తే మీరు చాలాగట్టివారు. బహు పొదుపరులు. ఇరుగు పొరుగులు మిమ్మల్ని చూసిమీరు పరమలోభులని ఆడిపోసుకుంటే ఆడిపోసుకోవచ్చు. అయితే మీ రేమీ కలత చెందనక్కరలేదు. అపర్ణగృహిణిగా వ్యవహరిస్తున్నామన్న నమ్మకంతో మీ పద్ధతులను కొనసాగించవచ్చు. సంసారంకూడా క్రమశిక్షణకులోనై ప్రశాంతంగా ఉంటుంది.

అ-ప్రశ్నల్లో 5 ఔనులూ ఆ పైనావచ్చి, ఇ-ప్రశ్నలలో మూడు ఔనులు వస్తే ఫరవాలేదు. మీరు మొండి మనుషులు కారు.

అ-ప్రశ్నలో 3 ఔనులూ, (5 లోపు), ఇ ప్రశ్నలో ఐదు ఔనులూ అంతకుపైనా వస్తే, – చాలా చిన్న ఖర్చులూ, చిన్న విషయాలూ అని మీరనుకుంటున్నవే, మీ ఖర్చులు పెరగడానికి కారణం అని గుర్తించాలి. అవన్నీ కట్టుదిట్టం చేసుకోడం మంచిది.

ఇ-ప్రశ్నల్లో ఎనిమిది ఔనులు వస్తే, సంసారం నడపడంలో రాబడి ఖర్చుల అజ, అప్పుల ప్రమాదం మీకు బాగా తెలియటం లేదు. మీవారు ఆ మాట అన్నా నొచ్చుకోవడం న్యాయంకాదు. అంతకన్న ఏం చేస్తే బాగుంటుందో ఆలోచించడం మంచిది; అవసరం.

ఇ-ప్రశ్నలలో నే తొమ్మిదిగాని పదిగాని ఔనులు వచ్చేస్తే, కొన్నాళ్ళపాటు ఇల్లు నడిపే బాధ్యత మిమ్మల్ని తరుచు విమర్శించే పెద్దమ్మాయికో, మీ వారికో, ఒప్పగించి కొంచెం రోజులు విశ్రాంతి తీసుకొని వెనకనించి సలహాలు ఇవ్వడం మంచిది. అప్పుడు మంచి ఉపాయాలు తోస్తాయి. ఈలోగా మిమ్మల్ని ఉట్టి దూబరా గాధరా మనుషులని ఎవరన్నా అంటే కోపం తెచ్చుకోకండి.

చదరంగం

5 వ సమస్యకు పరిష్కారం

కీలకంఎత్తు: మ–వి 7

6 వ సమస్యకు పరిష్కారం

కీలకంఎత్తు: రా–వి 7. మ–వి 6 అయితే; 2. ఏ–రా 4. ఏ–వి 6 అయితే; 3. రా–గు 7. మ × గు అయితే; 4. గు × ఏ మా.

(వచ్చేవారం మరొక సమస్య)

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd. by S. Radha Krishna
The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasa



అనురాగము

హీరాలాల్—రాయచూర్.


త్వరలో
విడుదల!
శ్రీ సారథి స్టూడియోస్
వారి
భాగ్యదేవత
దర్శకుడు...తాపీ చాణక్య
స్టూడియో
శ్రీ సారథి (హైదరాబాద్)
నవయుగ రిలీజ్
PRASAD'S